www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 05 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ కార్తిక బహుళ ద్వాదశి

21 - 27 నవంబర్ 2022

వెల : ₹15/-



## 'సెక్యులరిజం అంటే మెజారిటీ ప్రజల హక్కులను హరించడం కాదు!'

జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి ముఖాముఖీ

నవంబర్ 26
భారత రాజ్యాంగ
దినోత్సవం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక


(నవంబర్ 26)
భారత రాజ్యాంగ దినోత్సవ
శుభాకాంక్షలు


రాష్ట్ర ప్రజలకు, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు
భారత రాజ్యాంగ దినోత్సవ
(నవంబర్ 26)
శుభాకాంక్షలు
అర్వింద్ ధర్మపురి
(పార్లమెంట్ సభ్యులు నిజామాబాద్)

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

‘ఒక ఆలోచన నీ జీవితాన్ని మారుస్తుంది. ఒక సమోసా నీ మతాన్ని మారుస్తుంది’... ఇది మూడేళ్ల క్రితం సామాజిక మాధ్యమాలలో వెల్లువెత్తిన తీక్షణమైన చెణుకు. ఆగ్రాలోని ఒక మురికివాడలో, మీరు క్రైస్తవం తీసుకోండి, మీ పిల్లల విద్యావైద్యాలకీ, ఉద్యోగానికీ ఢోకా ఉండదు అంటూ ప్రచారం చేసిన మిషనరీలు వారికి కానుకలుగా సమోసాలు పంచారట. అయితే అవి తిన్నాక తన కూతురికి తల తిప్పుడు మొదలయిందని ఒక వనిత వాపోయింది. నిజానికి భారతీయతకు ఈ మతాల వికృత చేష్టలు ఎన్నో రుగ్మతలు తెచ్చాయి. అది వేరే విషయమే కానీ, భారతదేశంలో మత మార్పిడి పోకడలు ఎంత హేయమో, అదే సమయంలో ఎంత నీతిబాహ్యంగా, చౌకబారుగా ఉన్నాయో ఈ సమోసా కథ చెబుతుంది. మత మార్పిడిలో ఉండవలసిన మత స్వేచ్ఛ, విశ్వాసం, స్పృహ వంటి విలువలన్నీ ఇప్పుడు సిలువ మీదనో, మసీదు గుమ్మటం మీది నెలవంక కొసనో బిక్కుబిక్కుమంటూ వేలాడుతున్నాయి. అందుకే ఈ నవంబర్ 14న సాక్షాత్తు సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మతమార్పిడులు దేశభద్రతకే ముప్పు అని నిష్కర్షగా అభిప్రాయపడవలసి వచ్చింది.

బలవంతపు మత మార్పిళ్లు అత్యంత తీవ్రమైన అంశమేనని సుప్రీం కోర్టు అభివర్ణించింది. మోసగించి, ప్రలోభ పెట్టి, భయపెట్టి మతాంతరీకరణ చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్టు చెప్పింది. ‘మత స్వేచ్ఛ ఉండవచ్చు. కానీ బలవంతంగా మతం మార్చే స్వేచ్ఛ ఎవరికీ లేదు. ఈ తరహా మార్పిడులను అడ్డుకోని పక్షంలో చాలా సమస్యాత్మక పరిస్థితులు తలెత్తుతాయి. ఈ పోకడలు నిజమే అయితే అంతిమంగా దేశభద్రతకే పెను సవాలు విసరగలిగేటంత తీవ్రమైన సమస్య. అంతేకాక పౌరులు నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను కూడా ప్రమాదంలో పడేస్తుంది’ అని మాడు పగిలే మాటలు చెప్పింది. కేంద్రం తక్షణం స్పందించి, బలవంతపు మతమార్పిళ్లను పూర్తిగా అడ్డుకునేందుకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవలసిందని కూడా ఆదేశించింది. న్యాయవాది అశ్వినికుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్ మీద న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ హిమా కోహ్లి ధర్మాసనం

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ ఆశ్వీయుజ బహుళ ద్వాదశి**

**లోపలి పేజీలలో...**



ముఖపత్ర కథనం

**‘సెక్యులరిజం అంటే మెజారిటీ ప్రజల హక్కులను హరించడం కాదు!’** 6లో



ధారావాహిక నవల

**ఆనందమఠం**

- బంకించంద్ర చటర్జీ 20లో



ప్రత్యేక వ్యాసం

**మాధుర్యానికి మరో పేరు ‘కంఠశాల’** 23లో

# జాగృతి

## సంపాదకీయం

విచారణ జరిపింది. ఈ సంవత్సరారంభంలో తమిళనాడులో లావణ్య అనే పాఠశాల విద్యార్థినిని మతమార్పిడి క్రైస్తవ సైతానులు పొట్టన పెట్టుకున్న నేపథ్యంలో దాఖలైన వ్యాజ్యమిది.

మత మార్పిడులు ఎంత హీనమో, వాటి వెనుక ఎన్ని దురుద్దేశాలు ఉన్నాయో భారత ప్రభుత్వానికీ, అత్యున్నత న్యాయస్థానానికీ తెలియనిది కాదు. డబ్బు తదితర ప్రలోభాలు చూపించి, భయపెట్టి, మోసగించి సాగే మత మార్పిడులను అడ్డగించేందుకు మధ్యప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలు తెచ్చిన రెండు చట్టాలు ధర్మ స్వాతంత్ర్య అధినియం 1968, ఒడిశా మత స్వేచ్ఛ చట్టం 1967లను

# దేశానికే ముప్పు

సుప్రీంకోర్టు గతంలోనే సమర్థించిన సంగతి కూడా తాజా వ్యాజ్యంలో ప్రస్తావనకు వచ్చాయి. అయినా లక్షలలో మత మార్పిడులు జరిగిపోతున్నాయి. గిరిజన ప్రాంతాలలో అడ్డూఅదుపూ లేకుండా మత మార్పిడులు జరుగుతున్న సంగతిని సొలిసిటర్ జనరల్ అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. ఎక్కడో అడవులలో ఎందుకు? దేశ రాజధానిలో పదివేల మందిని సామూహికంగా మతం మార్చి, మేం హిందూ దేవుళ్లను పూజించం అంటూ ప్రతిజ్ఞ చేయించిన ఘనకార్యంలో ఆప్ మంత్రి పాల్గొని ఉపన్యాసాలు దంచాడు. తరువాత పదవి పోగొట్టుకుంటున్నాడు అది వేరే విషయం.

1977లో రెవరెండ్ స్టయినిస్‌లస్ వర్సెస్ మధ్యప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు సుస్పష్టంగా మత మార్పిడి ఎంత వికృతమో వ్యాఖ్యానించింది. ఒక వ్యక్తిని మొదటి మతం నుంచి మార్చడం ప్రాథమిక హక్కు కాదు. ఇది రాజ్యాంగంలోని 25(1) అధికరణానికి విరుద్ధం. ఈ అధికరణం మత స్పృహను గురించి చెబుతోంది. ఆ స్పృహను, అంటే రాజ్యాంగం ఇచ్చిన హక్కును ధిక్కరించడ మేనని ఘోషిస్తున్నది. కానీ మత మార్పిడులు కూడా మాఫియా శైలిలోకి మారుతున్నాయి. వాటితో దేశ సమగ్రతకే ప్రమాదమని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడవలసి వచ్చింది. 2009లో అస్సామ్ ట్రైమ్స్ పత్రిక నివేదించిన వార్త ఇది: హిమర్ ఉగ్రవాదులలో 15 మంది తమని తాము మన్మాసి నేషనల్ క్రిస్టియన్ ఆర్మీ పేరు పెట్టుకుని అస్సాంలోనే భువన్ పహార్ ప్రాంత హిందువులను బలవంతంగా మతం మార్చాలని ప్రయత్నించారు. 1998లో కశ్మీర్ లోయలో ప్రాణ్‌కోట్ ఊచకోత ఉదంతం వెనుక ఉన్నదీ ఇదే. ముస్లిం ఉగ్రవాదులు 26 మంది హిందువుల తలలు నరికి చంపారు. ఇస్లాంలోకి మారడానికి వీరు వ్యతిరేకించడమే వాళ్లు చేసిన తప్పిదం. ఈ మార్పిడి నిరంతర ప్రక్రియలా మార్చేశారు. తాజాగా జార్ఖండ్‌లో ఒక బాలికను అపహరించి పెళ్లి చేసుకుని ఇస్లాంలోకి మార్చారు (నవంబర్ 12,2022), మీరట్‌లో 400 మంది హిందువులను క్రైస్తవంలోకి మార్చి, హిందూ దేవతల విగ్రహాలు తొలగించి, పూజా విధానం మార్చుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు (అక్టోబర్ 29,2022). కర్ణాటకలో నియాజ్ పాషా అనే కార్పొరేటర్, మరొక 11 మంది ఒక హిందువును బలవంతంగా మతం మార్చి గొడ్డుమాంసం తినిపించారు (అక్టోబర్ 14, 2022).

భారతదేశంలో మత మార్పిడి చరిత్రంతా రక్తపాతంతో కూడుకున్నదే. లేదా ప్రలోభాలు, మూఢత్వం ఆధారంగా సాగినదే. విద్యాలయాలలో, వైద్యాలయాలలో, ఒక వర్గం మీడియా, సినిమాతో హిందువులను మతం మార్చడం ఒక నిరంతర ప్రక్రియగా సాగిపోతోంది. డీఎంకే, వైఎస్ఆర్‌సీపీ, టీఆర్ఎస్, టీఎంసీ వంటి పార్టీల మైనారిటీ ఓట్ల దాహం కొన్ని మతాలు మత మార్పిళ్లను యథేచ్ఛగా సాగించుకునేందుకు ఆసరాగా మారుతోంది. సుప్రీం కోర్టు ఆదేశించినందుకైనా కేంద్రం ఈ వికృత విన్యాసాల పట్ల అత్యంత కఠినంగా, తక్షణమే వ్యవహరించడం న్యాయం. ★

21 నవంబర్ 2022, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




32లో

కథ

**ఆకాశహర్మ్యాలు**

– దర్భా లక్ష్మీఅన్నపూర్ణ




| | | |
|---|---|---|
| వి'శేషయ్య' కథా కమామిషూ! (పుస్తక సమీక్ష) | – | 27 |
| పర్యావరణ సమస్యలకు మూలం... (అంతర్జాతీయం) | – | 28 |
| సింగరేణిని ప్రైవేటీకరించం! (తెలంగాణ) | – | 36 |
| విశాఖకు మహర్దశ! (ఆంధ్రప్రదేశ్) | – | 38 |
| ఎంతకాలం ఈ హింస? (మహిళ) | – | 40 |
| ప్రపంచ కప్‌లో భారత్ నిరాశ, పాకిస్తాన్ పేరాశ! (క్రీడ) | – | 42 |
| కాస్మొటిక్ మాఫియా నేపథ్యంలో 'యశోద' (సినిమా) | – | 43 |
| బాలజాగృతి | – | 46 |

# సెక్యులరిజం అంటే మెజా
# హక్కులను హరించ



ఏ దేశంలో అయినా రాజ్యాంగ నిర్మాతలు ఏ వర్గాన్నీ విస్మరించకుండా, అందరి హక్కుల రక్షణకు పూచీ పడుతూ రాజ్యాంగాన్ని నిర్మిస్తారు. కానీ రాజ్యాంగానికి చెందిన ఈ మౌలిక స్ఫూర్తిని భద్రంగా కాపాడుకోవలసినదీ, కొనసాగించుకునేటట్టు చేయవలసినదీ పౌరులేనంటున్నారు పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి. విభజన నాటి చేదు అనుభవాల నేపథ్యంలో రచించుకున్నప్పటికీ మన రాజ్యాంగం వ్యవస్థ నిర్వహణలో నిర్మాణాత్మక పాత్రనే పోషించగలిగిందని ఆయన అన్నారు. సవరణలు అనేవి ఒక సహజ ప్రక్రియ అని కూడా చెప్పారు. అలా అని రాజ్యాంగ నిర్మాతల ఆశయాలన్నీ వారు కోరుకున్న పంథాలోనే సాగాయని చెప్పే అవకాశం లేదనీ, వారి ఆశయాలకు సరిపడని రీతిలో, ప్రజాస్వామ్యం బలహీనపడే పరిస్థితులు సృష్టిస్తూ కొన్ని చర్యలు జరిగాయనీ జస్టిస్ నరసింహారెడ్డి కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. మెజారిటీ/మైనారిటీ వివాదం, ఫెడరలిజం, కొలీజియం వంటి అంశాలపై వివాదాలు, వాదోపవాదాలు, పరిణామాలు అవాంఛనీయమేనని చెప్పారు జస్టిస్ నరసింహారెడ్డి. సెక్యులరిజం అంటే మెజారిటీ ప్రజల హక్కులను కాలరాయడం కాదని కూడా స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం (నవంబర్ 26) సందర్భంగా జస్టిస్ నరసింహారెడ్డితో జాగృతి ముఖాముఖీలోని కొన్ని అంశాలు:

# ...రిటీ ప్రజల ...డం కాదు!'

**స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయింది. అందులో రాజ్యాంగం అమలులోకి వచ్చి భారత్ గణతంత్ర వ్యవస్థగా సాగిన ప్రస్థానం 72 సంవత్సరాలు. ఈ ఏడు దశాబ్దాలలో రాజ్యాంగం ద్వారా సాధించిన విజయాలను సగౌరవంగా మననం చేసుకొనే స్థితిలో ఉన్నామా?**

మీరు సంధించిన ప్రశ్న కొంచెం క్లిష్టమైనది. దాదాపు వెయ్యి సంవత్సరాల పరాయి పరిపాలన తరువాత 1947లో స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆ సిద్ధించడం మనమందరం గర్వపడే విధంగా, లేకపోతే స్వతంత్ర భారతాన్ని ఉత్సాహంతో పాలించు కునేటట్టు జరిగింది కాదు. సువిశాల భారతదేశాన్ని మూడు ముక్కలు చేశారు. తూర్పుభాగం, పడమటి భాగం– అంటే రెండు భుజాలను నరికిన తరువాత, వాటి మధ్యన మిగిలిన భాగాన్ని భారతదేశమని పిలుచుకుంటున్నాం. ఆ రెండు భాగాలు పాకిస్తాన్‌కు దఖలు పడినాయి. తరువాత తగువులు వచ్చి ఆ రెండు ప్రాంతాలు రెండు వేరే దేశాలైనాయి. కాబట్టి స్వాతంత్ర్యంతో పాటు, మూడు ముక్కల భారతదేశమే మనకు దక్కింది. కేవలం భౌగోళిక విభజన జరిగి, మిగిలినదంతా ప్రశాంతంగా జరిగిపోయిందా అంటే, అదీ కాదు. విభజన, ఫలితాలు లేదా పర్యవసానాలు తీవ్రాతితీవ్రంగా పరిణమించాయి. దురదృష్టవశాత్తు కొందరు చరిత్రకారులు గానీ, స్వాతంత్ర్యం రావడానికి తామే కారణమని చెప్పుకున్న చాలామంది గానీ ఆనాటి వాస్తవిక చారిత్రక దృశ్యాన్ని యథాతథంగా మనముందు ఉంచలేదు. అయినా స్వాతంత్ర్యం వచ్చిందంటూ దేశభక్తి గీతాలు పాడుకున్నాం. కానీ ప్రపంచంలో ఎక్కడా లేనట్టు దాదాపు 15 లక్షలమంది విభజన నేపథ్యంలో చెలరేగిన హింసకి బలైపోయారు. దాదాపు 2 కోట్లమంది నిరాశ్రయులయ్యారు. కేవలం మతం ఆధారంగా ఈ అమానుష కాండ సాగింది. ప్రయాణ సాధనాలు లేనప్పుడు, చేతికి దొరికింది పట్టుకుని, చిన్న, పెద్ద, స్త్రీలు.. కుటుంబ సభ్యులంతా కట్టుబట్ట లతో కొన్ని వందలూ, వేల మైళ్లు ప్రాణాలరచేత పట్టుకుని ప్రయాణించవలసి వచ్చింది. నేను చాలా సందర్భాలలో అన్నాను. ఎవరైతే స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత మాదేనంటూ చాటుకున్నారో, వారిలో ఈ విషాదం బాధ్యత ఎవరు తీసుకుంటారో చెప్పాలని చాలాసార్లు అన్నాను.

స్వాతంత్ర్యం తెచ్చినవారు – వ్యక్తులే కావచ్చు, సంస్థలే కావచ్చు.. అది తమ కృషి అని చెప్పుకోవచ్చు. తప్పులేదు. నాడు సంభవించిన మరణాలు, శరణార్థుల రాక, లక్షలలో జరిగిన మత మార్పిడులు ఎన్నో లెక్కకు అందనివే. అక్కడ జమీందారు, పెద్ద వ్యాపారవేత్త విభజనతో సర్వం కోల్పోయి వచ్చారు. స్త్రీలు, పిల్లలు, ఎంతమంది తప్పించుకు రాగలిగారో, ఇంకెందరిని నిర్బంధంలో ఉంచారో తలుచుకోవడమే హృదయవిదారకమైన విషయం. ఈ ఉద్రిక్తతలు కొంత సడలిన తరువాత 1948లో రాజ్యాంగ పరిషత్ పని మొదలయింది. దానికి మొట్టమొదట డా॥ సచ్చిదానంద సిన్హా తాత్కాలిక అధ్యక్షుడు. తరువాత డా॥ రాజేంద్రప్రసాద్ అధ్యక్షులైనారు. వివిధ రంగాల్లో ప్రసిద్ధులైనవారందరినీ పరిషత్ సభ్యులను చేశారు. రాజ్యాంగ ముసాయిదా సంఘానికి డా॥ అంబేడ్కర్ అధ్యక్షులు, డా॥ అల్లాడి కృష్ణస్వామి, బి.ఎన్.రావు వంటివారు సభ్యులు. ఎంతో మేధోమథనం తరువాత రాజ్యాంగ రూపుదిద్దుకుంది.

**భారత ప్రభుత్వ చట్టం-1935, ప్రపంచ దేశాల రాజ్యాంగాల నుంచి కొన్ని మంచి అంశాలు స్వీకరించారని అంటారు కదా! అవేమిటి?**

బ్రిటిష్ ఇండియా తెచ్చిన ‘భారత ప్రభుత్వ చట్టం–1935’ ప్రభావం రాజ్యాంగం మీద ఇతోధికంగా ఉంది. ఆ చట్టంలోని న్యాయవ్యవస్థ, ప్రాథమిక హక్కులనే కొన్ని మార్పులు చేసి రాజ్యాంగంలో ప్రవేశపెట్టారు. మిగతా విషయాల కోసం ప్రపంచంలోని కొన్ని రాజ్యాంగాలను పరిశీలించి కొన్ని అంశాలను తీసుకున్నారు. నవంబర్ 26, 1949 నాటికి మనదైన రాజ్యాంగం సిద్ధమైంది. జనవరి 26, 1950 నుంచి అమలు చేసుకుంటున్నాం.

**వచ్చిన స్వాతంత్ర్యం గురించి పూర్తి సంతోషంతో చెప్పలేకపోయినా, స్వతంత్ర భారతం నిర్మించుకున్న రాజ్యాంగం, అందులోని చాలా అంశాలు సగర్వంగా చెప్పుకోదగినవేనని అనుకోవచ్చునా? ఇందులో రాజ్యాంగ నిర్మాతలు, స్వాతంత్ర్య సమరయోధులు ఆశించిన లక్ష్యం సాధించడానికి ఇంకా ప్రయాణం సాగించవలసి ఉన్నదా?**

చాలా కోణాల నుంచీ, పొందుపరిచిన ముఖ్య విషయాల గురించీ సగర్వంగా చెప్పుకోవచ్చు. సార్వత్రిక ఓటుహక్కు, ప్రాథమిక హక్కులు పేర్కొనదగినవి. పరిపాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఏర్పాటు, వాటి హద్దుల నిర్ణయం నిర్మాణాత్మకమైనవే. చాలా వ్యవస్థలకి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించింది రాజ్యాంగం. కమ్‌ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, ఎన్నికల సంఘం వంటి వాటిని చక్కగా పొందుపరిచారు. ఇంత వైవిధ్య భరిత జీవనం ఉన్నప్పటికీ ఇంత పెద్ద దేశాన్ని కూడా వ్యవస్థీ






కొన్ని విషయాల్లో రాజ్యాంగ నిర్మాతల అభిప్రాయాలకు పూర్తి సమర్ధన లభించలేదని నిక్కచ్చిగా చెప్పవచ్చు. హైకోర్టులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నియామకం ఎలా జరగాలి? ఈ అంశం మీద రాజ్యాంగ పరిషత్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. ఆ నియామకాలలో న్యాయ వ్యవస్థకు కీలకపాత్రను ఇస్తూనే కార్యనిర్వాహక, పరిపాలనా వ్యవస్థలను కూడా పాత్రధారులను చేశారు. ఎవరి పాత్ర ఎంతవరకు అన్నదానిని కూడా నిర్దేశించారు. హైకోర్టులు, సుప్రీంకోర్టుకు న్యాయమూర్తుల నియామకాలు చేసేది దేశాధ్యక్షుడు. దేశాధ్యక్షునికి సూచనలిచ్చేదీ, సలహాలిచ్చేదీ కార్యనిర్వాహక వ్యవస్థ. ఈ ప్రక్రియ ఎక్కడి నుండి ప్రారంభమవుతుందంటే, న్యాయ వ్యవస్థ నుంచే. న్యాయవ్యవస్థ అభిప్రాయం, అంటే ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసుకుని నియమకాలు జరగాలన్న వ్యవస్థ ఉండేది. ఈ అంశంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని 80వ దశకంలో కొలీజియం వ్యవస్థను తీసుకొచ్చింది. కొలీజియం వ్యవస్థ పేరు రాజ్యాంగంలో ఎక్కడా కనబడదు. కానీ పాత వ్యవస్థను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించలేదు.

కృతంగా, విజయవంతంగా నడుపుకోవడానికి అవి ఉపయోగపడ్డాయి. అంతవరకు మనం గర్వంగా చెప్పుకోవచ్చు.

ప్రశ్నలో రెండవ భాగం– లక్ష్య సాధనకు ఇంకా సాగించవలసి ఉన్న ప్రయాణం. అవును, ఇంకా ప్రయాణించవలసింది ఉంది. రాజ్యాంగాన్ని ఇప్పటి వరకు వంద పర్యాయాలకు పైగా సవరించుకున్నాం. కాలానుగుణంగా వచ్చే మార్పును దృష్టిలో పెట్టుకొని, ఏది వ్యవస్థ నడకకు, ప్రజోపయోగానికి ఇబ్బంది కలిగిస్తుందో దానిని మార్చుకున్నాం. అందరికి ఆమోదయోగ్యమయ్యేటట్టే మార్పు చేసుకున్నాం కూడా. అయినా, సవరణలు ఒక నిరంతర ప్రక్రియ. రాజ్యాంగం అంటే, రాసుకున్న కాలం దగ్గరే ఉండి పోయేది కాదు. మన రాజ్యాంగానికి సరళత్వం ఉంది. అయినా కొన్ని ఒడిదుడుకులు తప్పలేదు. ఆ వివరాల్లోకి వెళితే చాలా విషయాలు ఉంటాయి.

**1950లో రాజ్యాంగం అమలైంది. కానీ అంత తాజా రాజ్యాంగాన్ని అదే సంవత్సరం సవరించారు. అదే తొలి సవరణ. ఎలాంటి పరిస్థి తులు తొలి సవరణను అంత వేగంగా అనివార్యం చేశాయి?**

రెండు మూడు విషయాలు పరిగణనలోనికి తీసుకోవాలి. మనకు సిద్ధించిన స్వతంత్ర భారతదేశం ఒకే మూసలో, ఒకే రూపంలో ఉన్నదేమీ కాదు. సంక్షుభిత గతం ఉంది. అది తెచ్చిన ప్రశ్నలూ, అపోహలూ ఉన్నాయి. వివిధ జాతులే కాదు, దాదాపు 560 స్వదేశీ సంస్థానాలు ఉన్నాయి. ఎవరి అభీష్టాలు వాళ్లవి. ఎవరి అభిప్రాయాలు వారివి. ఎవరి స్వార్థం వారిది అని కూడా చెప్పుకోవచ్చు. రకరకాల ప్రాథమ్యాలు. వీటన్నిటిని భారత రాజ్యాంగ వ్యవస్థ పరిధిలోకి తేవడం అనివార్యం. ఈ పరిస్థితే 1950 నాటి సవరణకు దోహదం చేసింది. ఆ సవరణ సహా, చాలా సవరణలు ఆరోగ్యకరమైన రీతిలోనే జరిగాయి. కానీ అత్యవసర పరిస్థితిని (1975–1977) అమలు చేసిన కాలంలో, 1976 సంవత్సరంలో జరిగిన సవరణలు ఇందుకు మినహాయింపు. 42వ రాజ్యాంగ సవరణ అప్పుడే చేశారు. ఆ సవరణ, తద్వారా రాజ్యాంగానికి తెచ్చిన మార్పులు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేవి కాదు. అందుకు విరుద్ధమైనవి.

**ఈ నేపథ్యంలో రాజ్యాంగ నిర్మాతల స్వప్న సాకారానికి కొన్ని అడ్డంకులు ఇప్పటికీ ఉన్నాయనే అనుకోవాలా? అవి ఎలాంటివి?**

కొన్ని విషయాల్లో రాజ్యాంగ నిర్మాతల అభిప్రాయాలకు పూర్తి సమర్ధన లభించలేదని నిక్కచ్చిగా చెప్పవచ్చు. హైకోర్టులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నియామకం ఎలా జరగాలి? ఈ అంశం మీద రాజ్యాంగ పరిషత్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. ఆ నియామకాలలో న్యాయ వ్యవస్థకు కీలకపాత్రను ఇస్తూనే కార్యనిర్వాహక, పరిపాలనా వ్యవస్థలను కూడా పాత్రధారులను చేశారు. ఎవరి పాత్ర ఎంతవరకు అన్నదానిని కూడా నిర్దేశించారు. హైకోర్టులు, సుప్రీంకోర్టుకు న్యాయమూర్తుల నియామకాలు చేసేది దేశాధ్యక్షుడు. దేశాధ్యక్షునికి సూచనలిచ్చేదీ, సలహాలిచ్చేదీ కార్యనిర్వాహక వ్యవస్థ. ఈ ప్రక్రియ ఎక్కడి నుండి ప్రారంభమవుతుందంటే, న్యాయ వ్యవస్థ నుంచే. న్యాయవ్యవస్థ అభిప్రాయం, అంటే ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసుకుని నియమకాలు జరగాలన్న వ్యవస్థ ఉండేది. ఈ అంశంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని 80వ దశకంలో కొలీజియం వ్యవస్థను తీసుకొచ్చింది. కొలీజియం వ్యవస్థ పేరు రాజ్యాంగంలో ఎక్కడా కనబడదు. కానీ పాత వ్యవస్థను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించలేదు. పాత ప్రకరణలన్నీ అలాగే ఉన్నాయి. కొత్త వ్యవస్థను కూడా ప్రతిపాదించారు. అంటే అధికారివి నువ్వే, కానీ అధికారాలు నావి అన్నట్లు. ఇదంతా ప్రత్యామ్నాయ వ్యవస్థ తరహాలో కనిపిస్తుంది. ఆర్టికల్ 237, యూనియన్ జ్యుడిషియరి కానీ, స్టేట్ జ్యుడిషియరి గానీ ఫలానా చట్టాలు, ఫలానా ఆర్టికల్ తప్పు కాబట్టి కొట్టేస్తున్నాం అని చెప్పే అధికారం సుప్రీంకోర్టుకు ఉంది. ఆ చట్టాలు తప్పయితే అమలులో ఉన్న దానిని కొట్టేయాలి. అలాగే, ఆరోగ్యకర విధానమేమంటే, కొట్టేసిన చట్టాల స్థానంలో కొత్తగా ఏమి తేవాలన్న నిర్ణయం పార్లమెంటుకు వదిలి పెట్టాలి. కొత్తగా వచ్చినవి సరిగా లేవనుకుంటే మళ్లీ కొట్టేయవచ్చు. అది పద్ధతి. ఏ చట్టమైనా అది సరైనది కాదని కొట్టేసినపుడు, దాని స్థానంలో కొత్త చట్టం వచ్చినప్పుడు ఇక అందులో దోషం కనపడకూడదు. ఇక్కడ అలా జరగలేదు. పాతది అలాగే ఉంది. నాడు దీని గురించి జస్టిస్ జె.ఎస్.వర్మ ధర్మాసనం వ్యక్తం చేసిన అభిప్రాయం ఇది. కార్యనిర్వాహక వ్యవస్థను పూర్తిగా నమ్మలేం కాబట్టి ఇలా చేశాం అన్నారు. కానీ దీని మీద చాలామంది న్యాయకోవిదులు ఆనాడే పెదవి విరిచారు. ఇదేమిటి, న్యాయవ్యవస్థ తనకు తానే న్యాయమూర్తులను నియమించుకుంటుందా? అన్నారు. కొలీజియం ఉద్దేశం ఇదే కదా! కానీ 20 ఏళ్ల తరువాత, అదే జె.ఎస్.వర్మగారు, మేము ఏదో ఉద్దేశించి, ఊహించి ఒక వ్యవస్థను తీసుకొచ్చాం. కానీ, మాకు అర్థమయిందేమంటే ఆ వ్యవస్థ విఫలమైంది అని ఒప్పుకున్నారు. ఇది ఎలాంటి పరిస్థితులకు దారి తీయనున్నదోనని ఆనాడే చాలామంది సందేహించారు.

**తనకూ ఒక పాత్ర ఉంది కాబట్టి, ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో శాసన నిర్మాణ వ్యవస్థ ఎలా స్పందించింది?**

ఆ తరుణంలో పార్లమెంటు చరిత్రాత్మకం అనదగ్గట్టే ఒక అడుగు వేసింది. నేషనల్ జుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిటీని తెచ్చింది. ఇక నుంచి న్యాయమూర్తుల నియామకం ఆ స్వతంత్ర వ్యవస్థకు అప్పగించాలని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందులోనూ న్యాయవ్యవస్థది ప్రముఖమైన భాగమే.

ఐదారుగురు సభ్యులను నియమించి, ఒక ప్రక్రియ ద్వారా న్యాయమూర్తులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. అయినా నియామకాలలో అంతిమ నిర్ణయం న్యాయవ్యవస్థ చేతిలోనే ఉంచారు. కానీ దీనిని సుప్రీంకోర్టు కొట్టేసింది. కొలీజియం వ్యవస్థ గురించి ఇంత జరిగింది. చాలామంది ప్రముఖ న్యాయకోవిదుల ఉద్దేశం కూడా ఆ వ్యవస్థ సరికాదనే. ఒక విషయం ఇక్కడ గుర్తు చేస్తాను. అమెరికాలో ప్రతిష్టాత్మకమైన యేల్స్ లా స్కూల్ గ్రంథాలయం చూశాను. ప్రపంచ దేశాల రాజ్యాంగాలన్నింటి మీద అందులో సమీక్షలు, పరిచయాలు ఉన్నాయి. భారత రాజ్యాంగం గురించి ఏమి రాశారు? ప్రపంచంలోనే అసాధారణంగా ఒక ప్రకరణం ఒక రకంగా చెబితే, దాని అమలు ప్రక్రియ వేరే రకంగా జరుగుతుంది. ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించడం కనిపించింది.

అలాగే రిజర్వేషన్లు. నేను రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. కానీ ఒకే తీరులో కొనసాగించుకుంటూ వెళితే అర్హులైన బలహీన వర్గాలకు చేరవు. ఒక మనిషి బలహీనంగా ఉన్నప్పుడు సమాజం ఇచ్చే సాయంతో కొంతకాలం తరువాత సామాన్య స్థితికి రావాలి. ఒకరికి కాలు బాగా లేనపుడు ఆ లోటు తీరేవరకు ఊతకర్ర ఇచ్చి ఆదుకుంటాం. ఆ సహాయం ఎప్పటికీ ఒకరికే పరిమితమైతే మిగతావారు అలాంటి ప్రయోజనానికి దూరమైపోతారు. రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశం ఇది కాదు. దీనిని గమనించాలి.

**భారతదేశంలో చిత్రమైన పరిస్థితి కనిపిస్తుంది. రాజకీయ ఎత్తుగడల కోసం రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకునే తెంపరితనమనవచ్చు. కొంతమంది రాజకీయవేత్తలు, కొన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఉదారవాదులు లేక మేధావులుగా చలామణి అవుతున్నవాళ్లు ఒక వికృత వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఒక పక్క రాజ్యాంగాన్ని కాపాడాలి, గౌరవించాలి అంటారు. రాజ్యాంగమే సమున్నతం అంటారు. కానీ రాజ్యాంగమే నిర్దేశించిన ఉమ్మడి పౌరస్మృతి చట్టాన్ని తేవడానికి ఓ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం ప్రారంభించగానే దానిని వ్యతిరేకిస్తారు. ఉమ్మడి పౌరస్మృతి గురించి రాజ్యాంగమే నిర్దేశించింది. నెహ్రూ, ఇతర రాజ్యాంగ నిర్మాతల ఆలోచన కూడా ఇదే. ఈ ద్వంద్వ వైఖరిని మనం ఎట్లా అర్థం చేసుకోవాలి?**

ఒక చిన్న ఉదంతాన్ని ప్రస్తావిస్తాను. అమెరికా రాజ్యాంగ రచన జరుగుతున్న కాలం. దేశమంతా తర్జనభర్జనలు. వచ్చేది ఏ రకమైన రాజ్యాంగం? రూపురేఖలు ఎలా ఉంటాయని ఉత్కంఠ. రచన పూర్తయిన రోజున మొదట థామస్ జఫర్సన్ లోపల నుంచి బయటకు వచ్చారు. బయట వేచి ఉన్న వారంతా ఉత్సుకతతో అడిగారట, పూర్తయిన ఆ రాజ్యాంగం స్వరూప స్వభావాలు ఏమిటి? అందుకు జఫర్సన్, 'ఇట్ ఈజ్ గోయింగ్ టు బి రిపబ్లికన్' అని ఆగి 'ప్రొవైడెడ్, యూ కీప్ ఇట్' అన్నారట. మేం రచించిన రాజ్యాంగమయితే రిపబ్లికన్ రాజ్యాంగమే. దానిని అలానే కాపాడుకుంటారో, భ్రష్టు పట్టిస్తారో మీ చేతుల్లో ఉంది అని అర్థం. రాజ్యాంగం కొన్ని విలువలను పొందుపరుస్తుంది. వాటిని ఎట్లా పాటించాలి, ఎలా కాపాడుకోవాలి అన్నది ప్రజల విజ్ఞత. రాజ్యాంగ స్రష్టలు శక్తి మేరకు అందరికీ మేలు జరిగే విధంగా విలువలను రూపొందించి నిక్షిప్తం చేస్తారు. కానీ ఆ విలువలను ఎవరికి కావలసిన రీతిలో వారు అర్థం చేసుకుంటే, ఇష్టారీతిలో భాష్యాలు చెబుతూ, అర్థమైనరీతిలో ఆపాదించుకుంటూపోతే వ్యవస్థ నడవ లేదు. ఇక్కడ చెప్పుకోవలసినదేమిటంటే స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో మన దేశాన్ని మనం సమైక్య జాతిగా, సమున్నత సంస్కృతి గల సమాజంగా ప్రదర్శించలేక పోయాం. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు లేదా విలువలు విదేశీ పాలనలోను తట్టుకుని నిలబడి నాయి. ఆ గొప్పతనాన్ని మనం గుర్తించలేకపోయాం. అది యాదృచ్ఛికమా లేక ప్రయత్న పూర్వకంగా జరిగిందా తెలియడం లేదు. దేశం అనేది ఒకటి ఉంది. దానికి స్వాతంత్ర్యం కూడా వచ్చింది. చాలు..నడిచిపోతుంది అనుకున్నాం.

**విభజన నాటి అవాంఛనీయ ఘటనలకి స్వాతంత్ర్యం తెచ్చామని చెప్పుకుంటున్నవారు బాధ్యత తీసుకోవాలని అభిప్రాయపడుతున్నానని ఇంతకు ముందు చెప్పారు కదా! ఇప్పుడు మీరు చెప్పిన సమాధానంలోని ఆ గుర్తించలేకపోవడం అనే అంశానికి కూడా స్వతంత్ర భారత తొలితరం నాయకత్వమే బాధ్యత వహించాలని అనుకోవచ్చునా?**


ఈ దేశానికి పూర్వం నుంచి వస్తున్న విలువలు, సంస్కృతి, చారిత్రక నేపథ్యం ఉన్నాయన్న స్పృహ స్వతంత్ర భారతదేశంలో నిర్లక్ష్యానికి గురైంది. వాటి పట్ల అప్పుడు పట్టింపే లేదు. కొందరు సమకాలీనులు చెబుతూ ఉండేవారు. నెహ్రూ అందరికీ ఆమోదయోగ్యమైన నేతగా ఆవిర్భవించలేదు. ఏఐసీసీలో ఎన్నికలు పెడితే, ఆయనకు వచ్చింది ఒకే ఓటు. అది తనదే. మిగతావి సర్దార్ పటేల్‌కు, కృపలానీ, జయప్రకాశ్ నారాయణ్‌లకు వచ్చాయి. నెహ్రూ పాశ్చాత్య నాగరికతకు అలవాటు పడ్డ వ్యక్తి. తన పార్టీ నుంచి మద్దతు లేదు. ఫలితం, కమ్యూనిస్టుల వైపు మొగ్గారాయన. అపుడు కమ్యూనిస్టు ప్రభావం ప్రబలంగా ఉంది. కమ్యూనిజం అంటే ఫ్యాషన్. భారతదేశం వేయేళ్లు పరాయి పాలనలో మగ్గింది. అది మరిచిపోయి, పేదరికం పోవాలి, లేదా భూస్వామ్య వ్యవస్థ నశించాలంటూ నినాదాలు ఇవ్వడం ఏమిటి? కొన్ని వర్గాలని శత్రువులుగా చిత్రించడం ఏమిటి? అప్పటికి స్వాతంత్ర్యం వచ్చి మూడేళ్లు. ఇక విద్యావ్యవస్థ. అది ఎవరి చేతిలో పడ్డది? మౌలానా ఆజాద్. ఆయన గొప్ప విద్యావేత్త కాదు. కానీ మన విద్యా మూలాలు గట్టివి. నలందా, తక్షశిల వరకు పోవద్దు. అప్పటికే బయటి దేశాల నుంచి ఇక్కడకి వచ్చేవారు. బ్రిటిష్ ఇండియాలో కూడా భారతీయ విద్య, భారతీయ మూలాలు నేర్చుకొనేవారు చాలామంది ఉండేవారు. అప్పుడు చాలామంది న్యాయమూర్తులు ఆంగ్లేయులు. తీర్పులు వెల్లడించడానికి వారికి కొన్ని కొన్ని భారతీయ సామాజిక మూలాలు, కుటుంబ వ్యవస్థ సూత్రాలు తెలియాలి. అవన్నీ సంస్కృతంలో ఉండేవి. అయినా వారు సంస్కృతం నేర్చుకొని, వాటిని విశ్లేషించారు. ఆ కాలంలో వారు ఆ పని చేస్తే, ఇప్పుడొక ముఠా బయలుదేరి ఇదంతా తప్పు, వేదాలు తప్పు, స్మృతులు వ్యర్థం, నీకు ఇది లేదు, అది లేదు అంటున్నది.

**ఈ ధోరణి ఎందుకు బయలుదేరింది?**

ఒక విధంగా చెప్పాలంటే భారతదేశ ఔన్నత్యం, దేశీయమైన శాస్త్ర సాంకేతిక, న్యాయపరమైన అంశాలను ప్రతిబింబించే ఏ కార్యక్రమం, చింతన గానీ, అవి సెక్యులరిజానికి వ్యతిరేకమనో, మనువాదమనో, లేక మరొక ముద్ర వేసి మనదైన చింతన, జ్ఞానాల పట్ల వ్యతిరేకతను పెంచే పోకడ

### భారత రాజ్యాంగ దినోత్సవం ఎందుకు జరుపుకుంటారు?

**నవంబర్ 26, 1949న రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన విషయం తెలిసిందే. గతంలో ఈ రోజుని భారత న్యాయ దినోత్సవంగా జరుపుకునేవారం. అక్టోబర్ 11, 2015న ముంబైలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 'సమానత్వ స్మారక విగ్రహాని'కి శంకుస్థాపన చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ 'నవంబర్ 26'ను ఏటా భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం నవంబర్ 19, 2015న గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీనినే భారతీయ సంవిధాన్ దివస్ అని కూడా అంటారు. జనవరి 26, 1950 నుంచి రాజ్యాంగం అమలైన సందర్భంగా ఆరోజుని ఏటా మనం భారత గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాం.**





LAWYERS GRID
HATTIESBURG MUNICIPAL COURT
(A LAW FIRM) K. RAMAKRISHNA Advocate
We deal with Court litigation, Solicitors, Contracts, Legal opinion
Mediation & Arbitration, Drafting & Pleadings etc,
We also provide services in Court cases with regard to Supreme Court,
Hight Court, Civil, Criminal, Family Matters, Tribunals etc,
26th November
Happy INDIAN
CONSTITUTION DAY
H.No.GA-73, SBH Colony, Venture-I, Gaddiannaram, Dilsukhnagar, HYD-500 060
Email: lawyersgrid@gmail.com Office: 04035599075 / Ph: 9642460505



L. MADHU SEKHAR
MA., LLB
Advocate
26th November
Happy INDIAN
CONSTITUTION
DAY
# Flat No. 100, Mallareddy Towers, Plot No.B-85, Mahura Nagar,
Opp to Indoor Stadium, Hyderabad-500038
9849031766, 9949031766, Email: imadhusekar@gmail.com



ఇపుడు మిలిట్రీ పాలన ఉన్నది. వాళ్ల తుపాకీ గొట్టం ఉన్నది. తుపాకీకి మతం ఉండదు. అది సెక్యులర్. మిగతా విషయాలన్నీ మత సంబంధమైనవి. ఇప్పుడు ఈ సమస్య చుట్టూ తిరుగుతున్న అబ్రహామిక్ మతాలు ఇదే ధోరణిలో ఉంటాయి. మాదే ఉండాలి. వేరేది ఉండడానికి వీలు లేదు. అప్పుడు సెక్యులర్ అన్న భావనకు అవకాశం ఎక్కడ?


తయారయింది. ఆ క్రమంలో జరిగిందే చరిత్ర పుస్తకాల నుంచి మనవైన విషయాలను తొలగించడం. జర్మనీలో ఒక సమయంలో ఇక్కడి నుండి ఎవరు వెళ్లినా వారిని మీకు సంస్కృతం వచ్చా అని అడిగేవారు. వాళ్లు సంస్కృత భాషలోని చాలా గ్రంథాలను అధ్యయనం చేసి లబ్ధి పొందారు. ఇక్కడ దాని మీదే విష ప్రచారం జరుగుతోంది. స్మృతులు, శాస్త్ర, సాంకేతిక అంశాలకు సంబంధించి ఈ దేశానికి ఎన్నెన్నో మూలాలు ఉన్నాయి. ఐన్‌స్టీన్ నుంచి మొదలు ఎందరో ఆ వాస్తవాలను గ్రహించారు. వెల్లడించారు. సున్నాను కనుగొన్నది భారత్. అది లేకపోతే ప్రస్తుత శాస్త్ర సాంకేతి పురోగతి సాధ్యమేనా? $e=mc^2$ అన్నారు. అంటే కాంతివేగం 1,76,000 కి.మీ.లు. సున్నాలు ఉంటేనే ఇంత పెద్దగా ఉంది, రోమన్ లెక్క దానికి ఎక్స్‌లు, వైలు, టి.ఎస్‌లు పెట్టుకుంటూపోతే స్థలం సరిపోదు. అలాగే క్వాడ్రాట్రిక్ సమీకరణ. దానిని ఐజాక్ న్యూటన్ కనుగొన్నాడని చెబుతారు. ఆ మధ్య దీని మూలం ఎక్కడిదో ఇమాన్యుయల్ అనే శాస్త్రవేత్త కొత్తగా పరిశోధిస్తే, కేరళ అని తెలిసింది. శ్రీనివాస రామానుజం మేధస్సుకు చలించిపోయి ఇక్కడి నుంచి తీసుకుపోయి వారు ఎన్నో సిద్ధాంతాలను కనుగొన్నారు.

**సెక్యులరిజం అనే మాటను లేక భావనను రాజ్యాంగంలో చేర్చడానికి మన రాజ్యాంగ నిర్మాతలు సందేహించారు. కానీ ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీ దానిని రాజ్యాంగంలోకి తీసుకొచ్చారు. తరువాత పరిణామాలు ఏమిటి? ఇపుడు సెక్యులరిజం పేరుతో, కొత్త భాష్యాలతో దేశాన్ని వర్గాలుగా చీల్చే ప్రయత్నం, ఒక విషాదకర దృశ్యం కనిపిస్తోంది. దీన్ని ఎలా చూస్తారు?**

సెక్యులరిజమనేది భారతీయ సంప్రదాయంలో ఇమడని భావన. ఎందుకంటే, క్రైస్తవం తీసుకోండి. చర్చి అనేది అక్కడ ఒక వ్యవస్థ. అన్నింటినీ శాసిస్తుంది. దేశ పాలన నుండి మనిషి జీవితం వరకు అన్నిటినీ నిర్దేశిస్తుంది. అంటే అన్నీ మత సంబంధమైనవే. సర్వం మతమే. ఇక మత సంబంధం లేనిది సెక్యులర్. ఇపుడు మిలిట్రీ పాలన ఉన్నది. వాళ్ల తుపాకీ గొట్టం ఉన్నది. తుపాకీకి మతం ఉండదు. అది సెక్యులర్. మిగతా విషయాలన్నీ మత సంబంధమైనవి. ఇప్పుడు ఈ సమస్య చుట్టూ తిరుగుతున్న అబ్రహామిక్ మతాలు ఇదే ధోరణిలో ఉంటాయి. మాదే ఉండాలి. వేరేది ఉండడానికి వీలు లేదు. అప్పుడు సెక్యులర్ అన్న భావనకు అవకాశం ఎక్కడ? ఈ పరిస్థితి మన దేశంలో ఎన్నడూ లేదు. పార్శీలు, ముస్లింలు, క్రిష్టియన్స్ వచ్చారు, ఇంకా ఎందరో వచ్చారు. మన రాజులు ఆహ్వానించారు. వచ్చినవారు దుర్బుద్ధితో, దురాశతో అకృత్యాలు చేశారు, అది వేరే సంగతి. మనకు ఒకరి పట్ల ద్వేషం లేదు. సర్వేజనాః సుఖినోభవంతు అన్న సంస్కృతి మనది. అందులో సర్వేజనాస్సుఖినో భవంతు అన్నప్పుడు ఏ శైవమో, వైష్ణవమో ఉండాలి. భగవద్గీతను తీసుకోండి. భగవద్గీత శ్లోకాలలో సగం కంటే ఎక్కువ మానవ జీవితానికి సంబంధించినవే తప్ప, భగవంతుని ఆరాధించడం గురించి చెప్పవు. ఇస్లాం రాకముందు పర్షియన్లు, యూదులు భగవద్గీత శ్లోకాలను పవిత్రమైనవిగా భావించేవారని ఒక ప్రముఖుడు ఒకసారి చెప్పారు.

‘ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూప జాయతే/ సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధో భిజాయతే’ అంటుంది గీత. మానవుడు అదే పనిగా ఆలోచిస్తే దానిమీద అభిమానం కలిగే అవకాశం ఉంది. అది అందకపోతే దానిమీద మమకారం పెరిగి కోపం కలుగుతుంది. కోపంవలన క్రోధం పెరిగి జ్ఞాపకశక్తి తగ్గి చివరికి అధోగతి పాలవుతాడు. ఇది మానవ నైజం గురించి చెబుతున్నది. ఇలాంటివి ఇంకా ఎన్నో ఉన్నాయి మూలసూత్రాలు. మనస్సన్నది చంచలమైనది. దాన్ని నిలపడం చాలా కష్టం. దానికి రెండే మార్గాలు అభ్యాసం, వైరాగ్యం–ఇదొక శ్లోక భావం. దీన్లో హిందూయిజం ఏముంది? అసలు మతపరమైనది ఏముంది? కానీ ఇది భగవద్గీతలో ఉంది కాబట్టి పనికిరానిది అని ముద్ర వేసి, వాళ్లే సంకుచిత దృష్టితో చూసి సెక్యులరిజం పేరుతో అడ్డుకుంటున్నారు. సెక్యులరిజం అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చడం ఎమర్జెన్సీ దురాగతాలలో ఒకటి. ఇందిరాగాంధీ పదవీకాలం పూర్తయి పోతుంది. కాబట్టి ఏం చేయాలి? లోక్‌సభ కాల పరిమితి ఐదేండ్ల నుంచి ఆరు ఏళ్లు అయింది. ఒక సర్పంచ్ లేదా ఏదైనా ఎన్నికలప్పుడు పదవీకాలం పెంచాలంటే దానికి చాలా తతంగం ఉంటుంది. కానీ ఒక నియంతలా ఆమె వ్యవహరించారు. అసలు వారి ఎన్నికనే ఎవరూ సవాలు చేయకూడదని భావించారు. వీటిలో ఒక వ్యవస్థను నరికేసే ప్రయత్నం కనిపిస్తుంది.

**సెక్యులరిజం అన్న భావనకు రాను రాను కొత్త భాష్యాలు, వక్రభాష్యాలు పెరిగిపోతున్నాయి. ఈ పదం ఆధారంగా ఇప్పుడు భారతదేశానికి కొత్త బెడదలు తయారవుతున్నాయి. చివరికి మెజారిటీ ప్రజలలో తమకు రక్షణ లేదన్న భావన కలిగిస్తోంది.**



**ఎందుకు?**

సెక్యులరిజమనేది నాట్ ఏ లైసెన్స్ టు ఎబ్యూస్ ది మెజార్టీ కమ్యూనిటీ. సెక్యులరిజాన్ని ఎవరు దుర్వినియోగపరిచే ప్రయత్నం చేసినా ఆపడానికి మిగతా వారు ప్రయత్నం చేయాలి. దేనిమీదనైతే నిలబడ్డారో దాన్నే నరుకుతామంటే ఎలా? ఈ అభ్యుదయవాదులంతా ఉన్నారు గదా! వారు ఆదర్శంగా తీసుకుంటున్న ఆ వ్యవస్థలలో ఇలాంటి పోకడలకు వీలుందా? కమ్యూనిస్టులకి చైనా ఆదర్శం. ఉదారవాదం పేరుతో, సెక్యులరిజం పేరుతో ఇక్కడ వీళ్లు మాట్లాడుతున్న మాటలు ఆ వ్యవస్థలలో మాట్లాడితే వాడు మళ్లీ బతికి బయటపడగలడా? అట్లాగే వేరే మతాల పండితుల సంగతి కూడా ఇంతే. హిందూమతం, ఇక్కడి జీవన విధానం ఇచ్చిన స్వేచ్ఛతో వాళ్లు అజ్ఞానంతో ప్రవర్తిస్తున్నారు. హిజాబ్ తీసుకోండి, ఇరాన్‌లో ఏమవుతోంది? ఇస్లాం సంప్రదాయం తిరుగులేని విధంగా ఉండే సౌది అరేబియాలో ఈ వివాదాలు లేవు. కానీ దాని గురించి ఈ మేధావులు మాట్లాడే తీరు ఏ విధంగా ఉంది? భారతదేశాన్ని తృణీకరించడం లేదా నిందించడం వాళ్లకి ఒక ఎజెండా. అది ఎక్కువ కాలం నిలువదు. ఈ మేధావివర్గ కుంచితత్త్వం రాను రాను బయట పడుతుంది. హీనాతిహీనమైన వ్యక్తులు వీరంతా. సెక్యులరిజాన్ని ఎంత దుర్వినియోగం చేస్తున్నారంటే, మత ప్రసక్తి లేని రాజ్యం కాదు, సెక్యులరిజం పేరుతో మెజారిటీ మత ఆచారాలలోకి చొరబడే ప్రయత్నం చేస్తున్నారు. శనిసింగనాపూర్, శబరిమల ఆలయం వివాదాలు ఏమిటి? హిందూమతం ఇలాగే ఉండాలని ఎలాంటి సంబంధంలేని వాళ్లు పాఠాలు చెప్పే ప్రయత్నమే. క్రిప్టో క్రిస్టియన్స్ కాన్సెప్ట్ వచ్చింది. అంటే బయిటికి హిందూ మాదిరిగా కనిపిస్తాడు. కానీ అసలు లక్ష్యం హిందూత్వను తృణీకరించడం, నిందించడం. వాళ్ల ఈ అసహనానికి కారణం, మన అధిక సహనం. ఇదంతా చేసేది విదేశాలలో గుర్తింపు కోసం.

**ఈ మొత్తం అవాంఛనీయ వాతావరణానికి బలి అవుతున్నది ఫెడరలిజం అనిపిస్తుంది.**

ఫెడరలిజం ప్రస్థానం, భావనలను గమనించడం ప్రత్యేకమైన అనుభవం. అవసరం కూడా. కాంగ్రెస్‌పార్టీ బలహీనపడుతూ వచ్చిన క్రమంలో ఆ స్థానాన్ని ప్రాముఖ్యం, పలుకుబడి కలిగిన వ్యక్తులు ఆక్రమించారు. ఇదే అంతటా కనిపించకపోవచ్చు. ఆ వ్యక్తులు ఎంత పెద్ద నినాదాలు, ఆదర్శాలు వల్లించినా వాళ్లు తెచ్చిపెట్టింది కుటుంబ వ్యవస్థనే. కాంగ్రెస్ కుటుంబ వ్యవస్థనే వాళ్లు మళ్లీ తెచ్చి పెట్టారు. ఉదాహరణకు ములాయంసింగ్. ఆయన సామాజిక మూలాలు బలమైనవి. ఆర్యసమాజానికి చెందినవాడాయన. తరువాత అఖిలేష్ యాదవ్ వచ్చాడు. అతడు తండ్రి వారసత్వాన్ని తీసుకోలేక పోయాడు. వైఫల్యాలు మొదలయినాయి. ఇలాంటి సందర్భంలోనే మా సంస్కృతి వేరు, నా భాష వేరు, మా ప్రాంతం వేరు అంటూ నినాదాలు వస్తాయి. తమిళనాడు, బెంగాల్ ఎక్కడైనా కుటుంబ పార్టీలు ఉన్నప్పుడే ఫెడరలిజాన్ని ప్రశ్నార్థకం చేసే ప్రయత్నం కనిపిస్తుంది. ఈ మధ్యలో టీఆర్ఎస్ కూడా వచ్చింది.

**ఈశాన్య భారత రాష్ట్రాలు, ఫెడరలిజానికి అక్కడ ఎదురవుతున్న సవాళ్లని ఎలా చూస్తాం?**

ఆ ప్రాంతాన్ని అసలు భారతదేశంలో భాగమని మన తొలితరం నాయకులు అనుకోలేదు. ఆ ప్రాంతాన్ని క్రైస్తవ మిషనరీలకి అప్పగించారు. మరొకరికి ప్రవేశం లేకుండా చేశారు. ఇప్పుడు మారిన పరిస్థితులలో వాళ్లు తామంతా భారత్‌లో అంతర్భాగమని బలంగా విశ్వసించడం శుభ పరిణామం.

**ఇటీవల ఒక వార్త వచ్చింది. భారతదేశంలో కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో హిందువులు మైనారిటీలు. ఉదాహరణకి లక్షద్వీప్. కశ్మీర్ కూడా. అలాంటి చోట హిందువులను మైనారిటీలుగా గుర్తించే విషయంలో మీ అభిప్రాయం ఏమిటి అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు అడిగింది. ఈ ప్రతిపాదనకు వెంటనే సమాధానం చెప్పలేమని, అది సున్నితమైన అంశమని కేంద్రం జవాబిచ్చింది. అసలు మైనారిటీ అనేది ఎంత రాశిని బట్టి నిర్ధారించాలి?**

మెజారిటీ కానిది మైనారిటీ. సాంకేతికంగా చూస్తే 49 శాతం ఉన్నా మైనారిటీ కిందకే రావచ్చు. కానీ విషయం అది కాదు. మైనారిటీ, మెజారిటీ అన్నది కాదు. మతపరంగా నీ జనాభా ఎంతన్నదీ కాదు. దేశంపట్ల నీ దృక్పథం ఏమిటి? ఈ దేశం నాది అనుకోవడంలో నీవు ఎక్కడ ఉన్నావు? ఇది ప్రధానం. అందులో స్పష్టత ఉంటే ఇలాంటి చిక్కులు, ప్రశ్నలు రానేరావు. మిగతావారి సంగతి నాకు అనవసరం. నాకు మాత్రమే సకల సౌకర్యాలు ఉండాలి అన్న వాదన మొదలైతే మైనారిటీ, మెజారిటీ అన్న విభేదం తలెత్తుతుంది. వందమంది ఉన్నారు, యాభయ్ రొట్టెలే ఉన్నాయి అనుకుందాం. విజ్ఞులు చెప్పేది– మొదట బలహీనులకీ, వృద్ధులకీ, స్త్రీలకీ, పిల్లలకీ ఇద్దామంటారు. అదీ కాకపోతే, అందరికీ సగం సగం. ఇందులో ఏదీ కాకుండా మేం వేరు, మాకే అంతా దక్కాలి అని ఎవరైనా అంటే అది ప్రపంచంలో ఎక్కడా చెల్లదు. కానీ అలాంటి వాదన కూడా ఇక్కడ చెల్లుబాటవుతోంది. అది ఒక్క భారతదేశంలోనే సాధ్యం కూడా. ఇది ప్రథమ ప్రధాని నెహ్రూ వంటివారి పుణ్యం.


మొన్నటికి మొన్న మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఏమన్నారు? ఇక్కడి ప్రతి రూపాయిలోను తొలి హక్కు ముస్లింలకేనట. ఇలాంటి పోకడ ఏమిటి? దీనిని ఎలా అర్థం చేసుకోవాలి? మెజారిటీలు ఏమైపోయినా, మైనారిటీలు మాత్రం సుఖంగా ఉండాలనా? ఇది వైవిధ్యం, భిన్న సంస్కృతుల సమ్మేళనం అనే చింతనకు వ్యతిరేకం కాదా? ఇక్కడే ఒక ప్రశ్న. ఇప్పుడు మైనారిటీలుగా చెప్పుకుంటున్నవాళ్లు కొన్నిచోట్ల మెజారిటీలు. అక్కడ మైనారిటీలను ఎలా చూస్తున్నారు? మైనారిటీ హోదా ఇస్తున్నారా? ఇవ్వడానికి సిద్ధపడుతున్నారా?


**కశ్మీర్‌లో హిందువులను మైనారిటీలని చెప్పడం లేదు కదా!**

అక్కడనే కాదు. మైనారిటీల మీద దాడులు అంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడ మైనారిటీలుగా గుర్తింపు ఉన్న వర్గాలే రాజ్యాలేలుతున్న ప్రాంతాలు ఉన్నాయి. అక్కడ మైనారిటీలను ఎలా చూస్తున్నారు? దేశంలో మీడియా ఒక అనుచిత వైఖరిని ప్రదర్శిస్తున్నది. ముస్లింలలో విశాల దృక్పథంతో ఉన్నవారు ఎందరో ఉన్నారు. వారిని వదిలి మీడియా షర్జీల్ ఇమామ్ జపం చేస్తోంది. నీవు మైనారిటీవి కాబట్టి నీకు ఎలాంటి హక్కులూ లేవు అనే పరిస్థితి ఉంటే రక్షణ కల్పించవలసిందే. కానీ ఏ విషయంలో అయినా పౌరులందరితో సమంగా హక్కులూ, అవకాశాలూ ఉన్నప్పుడు ఆ మైనారిటీ పేరుతో చలామణి కావాలని ఎందుకు అనుకోవాలి? అందరితో పాటు మైనారిటీ లనీ సమానంగా చూస్తున్నారు. అయినా నాకే సమస్తం కావాలని కాలు దువ్వితే, మాకు సరైన వాటా దక్కడం లేదని వాదిస్తే అది దుర్మార్గమే. ★

> నాకు మాత్రమే సకల సౌకర్యాలు ఉండాలి అన్న వాదన మొదలైతే మైనారిటీ, మెజారిటీ అన్న విభేదం తలెత్తుతుంది. వందమంది ఉన్నారు, యాభయ్ రొట్టెలే ఉన్నాయి అనుకుందాం. విజ్ఞులు చెప్పేది– మొదట బలహీనులకీ, వృద్ధులకీ, స్త్రీలకీ, పిల్లలకీ ఇద్దామంటారు. అదీ కాకపోతే, అందరికీ సగం సగం. ఇందులో ఏదీ కాకుండా మేం వేరు, మాకే అంతా దక్కాలి అని ఎవరైనా అంటే అది ప్రపంచంలో ఎక్కడా చెల్లదు. కానీ అలాంటి వాదన కూడా ఇక్కడ చెల్లుబాటవుతోంది. అది ఒక్క భారతదేశంలోనే సాధ్యం కూడా. ఇది ప్రథమ ప్రధాని నెహ్రూ వంటివారి పుణ్యం.

కొందరుంటారు, జన్మతః భారతీయులే. ఇక్కడే, ఈ దేశంలోనే పుట్టారు. ఇక్కడే పెరిగారు. ఈ దేశంలోనే జీవిస్తున్నారు. ఇక్కడి గాలే పీలుస్తున్నారు. ఇక్కడి నీరే తాగుతున్నారు. ఈ నేలతల్లి పెట్టిన మెతుకులు తినే బతుకుతున్నారు. వారిలో కొందరు మేధావులుగానూ చెలామణి అవుతున్నారు. కానీ, అదేమి దురదృష్టమో వారికి ఈ దేశం అంటే చిన్నచూపు. మన సంస్కృతీ, సంప్రదాయాల పొడ గిట్టదు. సిరివెన్నెల చెప్పినట్లు 'ఈ దేశపు జాడ్యానికి విదేశాల మందు తప్ప పెరటిచెట్టు పనికిరాదు' అన్నట్లుంది. అంతేకాదు, బ్రిటిష్ పాలకులు దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చి వెళ్లిన తర్వాతనే భారతదేశం ఆవిర్భవించిందని అంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే భారతదేశం బట్ట కట్టిందన్నది ఈ మేధావుల నమ్మకం కావచ్చు. పాశ్చాత్య సంస్కృతిని, విదేశీ భావజాలాన్ని నరనరాన నింపుకున్న ఈ కలుషిత మేధావుల దృష్టిలో స్వాతంత్ర్య పూర్వ భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు, మేధోసంపద, పరిపాలనా దక్షత అంతా ఒక మిథ్యే.




# కార్మిక చట్టాలకు భారతీయ సుగంధం!


బ్రిటిష్ వలస పాలకులు దేశాన్ని విడిచి వెళుతూ.. మనలో ఆత్మన్యూనతా భావాన్ని నింపేందుకు 'భాతీయులకు పరిపాలన అనుభవం లేదు. పరిపాలన తెలియదు' అంటూ విషబీజాలు నాటి వెళ్లారు. అలా వారు నాటిన విషబీజాలు కాంగ్రెస్, కమ్మీ (కమ్యూనిస్ట్)ల పోషణలో కొంత మంది మేధావుల మెదళ్లలో మొలకెత్తి విషవృక్షాలుగా పెరిగాయి. అదిగో ఆ మేధావులే భారతీయత అంటే అదేదో పాత చింతకాయ పచ్చడి అనే విధంగా ఎగతాళి చేస్తున్నారు, వెక్కిరింతలకు పోతున్నారు. భారతీయ సనాతన ధర్మాన్ని, ఆచార వ్యవహారాలను, చివరకు పూర్వీకులు మనకు అందించిన సుసంపన్న సంప్రదాయ పరిపాలనా పద్ధతులనూ అవహేళన చేస్తున్నారు. 'పాశ్చాత్య ప్రపంచమే ప్రపంచం. పాశ్చాత్య సంస్కృతే సంస్కృతి, పాశ్చాత్య పాలనే పాలన, పాశ్చాత్య చట్టాలే చట్టాలు' అనే భావనతో మన సంస్కృతిని, జాతీయ స్వాభిమానాన్ని చిదిమేసే ప్రయత్నం సాగించారు, సాగిస్తున్నారు. ఆ విషసంస్కృతి ఫలితాలు ఏమిటన్నవి అందరికీ తెలిసినవే.



**జస్టిస్ ఎన్. నగరేశ్**
కేరళ హైకోర్టు న్యాయమూర్తి

అయితే ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ఆలోచనలూ మారుతున్నాయి. భారతీయత మూలాల్లోకి అందరి ఆలోచనలూ సాగుతున్నాయి. ఇది మంచి పరిణామం. ఇటీవల భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ న్యాయవ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని నొక్కి చెపుతూ చేసిన వ్యాఖ్యలే ఇందుకు అద్దం పడుతున్నాయి. కర్ణాటక బార్ కౌన్సిల్ కొన్ని నెలల క్రితం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మోహన్ ఎం. శాంతనా గౌదర్ సంస్మరణ సభ ఏర్పాటు చేసింది. ఈ సభలో జస్టిస్ రమణ ప్రధాన ఉపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ 'న్యాయవ్యవస్థలో పరాయీకరణ ప్రభావం' గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కోర్టుల్లో ఏమి జరుగుతుందో తెలియక సామాన్య ప్రజలు అయోమయానికి గురవుతున్నారని, పరాయి భావనలలో ఉంటున్నారని అన్నారు. ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఉందని, ఆ సమయం ఆసన్నమైందని చెప్పారు. న్యాయవ్యవస్థ పనితీరులో స్థానికీకరణ, భారతీయీకరణ (ఇండియనైజేషన్) అవసరమని అన్నారు. సమాజ వాస్తవ పరిస్థితులు ఆకళింపు చేసుకుని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా న్యాయవ్యవస్థ పనితీరును, పని విధానాన్ని సంస్కరించుకోవాల్సిన అవసరం ఉందని జస్టిస్ రమణ పేర్కొన్నారు. ఆయన ఇటీవలే ఈ సూచన చేసినా నిజానికి 'న్యాయవ్యవస్థలో భారతీయత' అనే అంశంపై ఎప్పటినుంచో చర్చలు సాగుతున్నాయి. అలాగే, న్యాయ సంస్కరణల అవసరాన్ని కూడా న్యాయమూర్తులు, న్యాయ

వాదులు, శాసనకర్తలు, మేధావులు చర్చిస్తూనే ఉన్నారు. అయితే, ఆశించినంత వేగంగా అడుగులు పడడం లేదు. కానీ, ఏకంగా సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి ఇలాంటి సూచన చేయడంతో ఇది మరోసారి ప్రముఖంగా చర్చకు వచ్చింది. ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. న్యాయస్థానాలలో ఈ పరిస్థితికి సుదీర్ఘకాలం పాటు ‘ప్రత్యక్ష సాక్షి’గా నిలిచిన జస్టిస్ రమణ వ్యాఖ్యలు న్యాయసంస్కరణల తక్షణ అవసరాన్ని నొక్కి చెపుతున్నాయని కూడా న్యాయవాద, రాజ్యాంగ నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో శాసననిర్మాతలు న్యాయసంస్కరణల దిశగా అడుగులు వేస్తారని.. న్యాయమూర్తులు, న్యాయవాదులే కాదు, సామాన్య ప్రజలు కూడా ఆశిస్తున్నారు.





పురాతన భారతీయ చట్టాలు, పురాతన భారతీయ న్యాయవ్యవస్థ పనితీరును అధ్యయనం చేసినవారు.. ఆధునిక న్యాయవ్యవస్థ కంటే ప్రాచీన భారతీయ న్యాయవ్యవస్థే ఎంతో మెరుగైనదని, మేలైనదని, స్థానికమైనదని, భారతీయమని అంగీకరిస్తున్నారు. పురాతన న్యాయవ్యవస్థలో చక్కగా, సమగ్రంగా నిర్వచించిన, లౌకిక స్వభావం గల ధార్మిక చట్టాల ఆధారంగా ధర్మబద్ధంగా తీర్పులు వెలువరించేవని అంటారు. ఈ నేపథ్యంలో పురాతన, ఆధునిక న్యాయ వ్యవస్థలలోని కార్మిక సంక్షేమ చట్టాలను పరిశీలిస్తే కార్మికుల సంక్షేమాన్ని పరిరక్షించడంలో ఆధునిక చట్టాల కంటే అవి ఎంతో పటిష్టమైనవి. నిజం, ఈరోజు ‘ఆధునికం’ అని మనం మురిసిపోతున్న శ్రామిక విలువలు, చట్టాలు మనకు ప్రాచీన భారతీయ న్యాయశాస్త్ర గ్రంథాలలోనే కనిపిస్తాయి. ఈ విజ్ఞాన భాండాగారం సంస్కృత భాషలో, శ్లోకాల రూపంలో నిక్షిప్తమైంది.

దురదృష్టం ఏమంటే పాశ్చాత్య మేధస్సు ప్రసాదించిన పెడధోరణులను మెదళ్లలో నింపుకున్న ఆధునిక మేధావివర్గం.. పురాతన భారతీయ న్యాయవ్యవస్థలో కార్మికులకు రక్షణ లేదని; ఉద్యోగులు, కార్మికులను ఎలాంటి హక్కులు లేని బానిసలుగా చూసిందనే విషప్రచారాన్ని దిగ్విజయంగా ముందుకు తీసుకుపోయింది. ఆ విధమైన వాతావరణాన్ని, అంతే దిగ్విజయంగా సృష్టించింది. అయితే, ఈ వాదనలో ఇసుమంతైనా నిజం లేదు. పురాతన భారతీయ సమాజంలో ఉద్యోగులు, కార్మికులు, శ్రామికులు సంపూర్ణ స్వేచ్ఛను అనుభవించారు. వివక్ష అన్నది ఎరగనే ఎరగరు. నాడు శ్రామిక వర్గం పొందిన గౌరవం అద్వితీయం. అసలు ప్రపంచ చరిత్రలో పనిని దైవంగా, ధర్మంగా భావించే; యజమాని, కార్మికుడు అనే వ్యత్యాసం లేని; శ్రామిక వర్గానికి సముచిత గౌరవం దక్కిన కాలం ఏదైనా ఉందంటే అది సనాతన భారతీయ ధర్మం నాలుగు పాదాల నడిచిన ప్రాచీన కాలమే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు, ఓ చిన్న ఉదాహరణ: ఒక భూస్వామి తన భూమిలో ఇల్లు లేదా మరేదో కట్టాలని అనుకున్నాడనుకోండి. ఆయన ఆ బాధ్యతను తాపీ మేస్త్రికి అప్పగించేవాడు. అంతే, ఆ తర్వాత భూమి స్వభావాన్ని బట్టి ఇల్లు ఎక్కడ కట్టాలి, ఎంత విస్తీర్ణంలో, ఎలా కట్టాలి? అనేది తాపీ మేస్త్రినే నిర్ణయిస్తాడు. అలాగే వాస్తు నియమాలు, ఇతర సాంకేతిక అంశాల ఆధారంగా అన్ని నిర్ణయాలూ మేస్త్రినే తీసుకుంటాడు. సాంకేతిక అంశాల విషయంలో యజమాని పాత్ర, ప్రమేయం పరిమితంగానే ఉంటుంది. తాపీ మేస్త్రి, నిర్మాణ కార్మికులు మాత్రమేకాదు, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి ఇలా విభిన్న వృత్తులల్లోని అందరూ తమ పరిధిలో సమాజ గౌరవాన్ని సమానంగా పొందారు. అంతేకాదు, నిర్మాణం పూర్తయిన తర్వాత గృహప్రవేశ సమయంలో యజమాని ప్రతిఒక్క కార్మికుడిని కుటుంబ సమేతంగా సముచిత రీతిన సత్కరించడం ఒక సంప్రదాయంగా ఉండేది. నిజానికి ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే. కార్మికులు, శ్రామికులను సేవకులుగా చూడటమన్నది నాటి సమాజంలో ఇంచుమించుగా లేదనే చెప్పవచ్చు.

అలాగని శ్రామికవర్గ సంక్షేమం, హక్కుల పరిరక్షణకు నాడు చట్టాలు లేవా? అంటే ఉన్నాయి. కేవలం చట్టాలు ఉండడమే కాదు రాజు, పేద తేడా లేకుండా అమలయ్యాయి కూడా. నిజానికి పారిశ్రామికీకరణ తర్వాతే సంప్రదాయ పని సంస్కృతి తెరమరగవుతూ వచ్చింది. అలాగే, శ్రామికవర్గం గౌరవం సన్నబడుతూ వచ్చింది. చివరకు యాజమాన్యం, కార్మికుల మధ్య దూరం పెరిగింది. అదే సమయంలో ఎర్రజెండాలు రంగప్రవేశం చేశాయి. వర్గ విభేదాలు సృష్టించాయి. ఇద్దరి మధ్య అడ్డుగోడలు కట్టాయి. యాజమాన్యం–కార్మికుల బంధం మధ్య మార్పు చోటుచేసుకుంది. వర్గవైషమ్యాలు తలెత్తి వాతావరణం కలుషితమైంది.

ప్రాచీన భారతీయ చట్టాలు–పాశ్చాత్య సంస్కృతి ప్రసాదించినటువంటి నేడు అమలవుతోన్న కార్మిక సంక్షేమ చట్టాలతో పోల్చి తులనాత్మకంగా పరిశీలిస్తే ఆధునిక చట్టాల అసలు రంగు బయట పడుతుంది. ఉద్యోగులకు సంబంధించిన ప్రాచీన భారతీయ చట్టాలను ప్రధానంగా నాలుగు తరగతులుగా విభజించారు. అందులో మొదటిది: వేతన దాన (వేతనాల చెల్లింపు), రెండవది: స్వామి–పాల వివాద్




త్రివర్ణ పతాకానికి వందనం చేస్తున్న సుభాశ్ చంద్రబోస్

(యజమాని–సేవకుని వివాదం) ఈ రెండు చట్టాలు కూడా పాశ్చాత్య సమాజం ఇంకా కళ్లు అయినా తెరవకముందు అంటే, క్రీ.పూ. 1250లో మనుధర్మ శాస్త్రం అమలులోకి వచ్చిన నాటి నుంచి అమలవుతున్నాయి. ఇక మూడోదాని విషయానికి వస్తే.. యాజ్ఞవల్క్యుడు క్రీ.పూ. 300 సంవత్సరంలోనే 'అభ్యుపేత్య సుశ్రుష' పేరుతో ఉద్యోగ ఒప్పంద ఉల్లంఘనకు సంబంధించిన న్యాయ సూత్రాలను వివరించారు. వేతనాలు చెల్లించకపోవడానికి సంబంధించి, క్రీ.పూ. 400 సంవత్సరంలోనే 'వేతనశ్యానప కర్మ' పేరిట నారదచట్టం అమలులోకి వచ్చింది. ఇంకా.. ప్రభుత్వ ఉద్యోగుల వర్గీకరణ (శుక్ర 813–814) కనీస వేతన చట్టం (మను క్రీ.శ. 1250), ఉద్యోగ ఒప్పంద ఉల్లంఘన, నష్ట పరిహార చట్టం (నారద స్మృతి), వేతన సవరణ చట్టం (మనుస్మృతి) ఇలా ఆధునిక చట్టాలకు ఒక విధంగా మాతృకవంటి అనేక చట్టాలు ప్రాచీన భారతీయ న్యాయవ్యవస్థలో దర్శనమిస్తాయి. ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా మనదేశంలో కార్మిక సంక్షేమ చట్టాలు అమలవుతున్న నాటికి చాలావరకు పాశ్చాత్య దేశాలలో చట్టబద్ధ పాలన అనేది కనీసం మొగ్గ తొడగలేదు.

వేదకాలంలో శుక్రాచార్య రచించినట్లు చెపుతున్న 'శుక్రనీతి'లో వేతనాలను కార్యమాన (పనిని బట్టి వేతనం), కాలమాన (పని గంటలను బట్టి వేతనం) కార్యకాల మాన (పని, పని గంటలు ఆధారంగా వేతన నిర్ణయం) మూడు

**ఆధునిక భారతదేశంలో కార్మికుల వేతనాలకు సంబంధించిన తొలి చట్టాన్ని 1929లో రాయల్ కమిషన్ ప్రతిపాదించింది. మరో ఏడేళ్లు గడిచిన తర్వాతే 1936లో వేతన చెల్లింపుల చట్టం అమలులోకి వచ్చింది. అందులోనూ పనిని బట్టి వేతనం, పని గంటలను బట్టి వేతనం మధ్య ఉన్న తేడాను గుర్తించలేదు. 1948లో చేసిన కనీస వేతన చట్టం మాత్రమే పని ఆధారిత వేతనం, పని గంటల ఆధారిత వేతనాలను ప్రత్యేకంగా గుర్తించింది.**

తరగతులుగా విభజించారు. 'శుక్రనీతి' వేదకాలం నాటి గ్రంథం కాదు. క్రీ.శ. 4వ శతాబ్ది రచన అనే వాదన కూడా ఉంది. అది వేరే విషయం.

ఆధునిక భారతదేశంలో కార్మికుల వేతనాలకు సంబంధించిన తొలి చట్టాన్ని 1929లో రాయల్ కమిషన్ ప్రతిపాదించింది. మరో ఏడేళ్లు గడిచిన తర్వాతే 1936లో వేతన చెల్లింపుల చట్టం అమలులోకి వచ్చింది. అందులోనూ పనిని బట్టి వేతనం, పని గంటలను బట్టి వేతనం మధ్య ఉన్న తేడాను గుర్తించలేదు. 1948లో చేసిన కనీస వేతన చట్టం మాత్రమే పని ఆధారిత వేతనం, పని గంటల ఆధారిత వేతనాలను ప్రత్యేకంగా గుర్తించింది.

ఈ నేపథ్యంలో జస్టిస్ ఎన్వీ రమణ ప్రస్తావించినట్లు ప్రాచీన భారతీయ చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా కార్మిక చట్టాల భారతీయీకరణలో పని స్వభావం ఏదైనా కార్మికులు సమానమైన గౌరమర్యాదలకు, అలాగే న్యాయబద్ధమైన వేతనానికి అందరూ అర్హులనే విషయాలను పరిగణలోకి తీసుకోవాలి. ఈ విషయంలో ప్రాచీన భారతీయ చట్టాలు ఆదర్శంగా నిలుస్తాయి. అలాగే, న్యాయవ్యవస్థ భారతీయీకరణ కోసం చేసే చట్టాలు వ్యక్తి కేంద్రంగా, సమాజ కేంద్రంగా ఉండాలే కానీ, న్యాయస్థానం కేంద్రంగా ఉండకూడదని న్యాయనిపుణులు అంటున్నారు.

శ్రమైక జీవన సౌందర్యానికి ప్రధాని నరేంద్ర మోదీ ఇస్తున్న ప్రత్యేక ప్రాధాన్యం గురించి కూడా ఈ సందర్భంగా మనం చెప్పుకోవాలి. 'సత్యమేవ జయతే'తో పాటు 'శ్రమయేవ జయతే' అనే ఆర్యోక్తికి విలువనిస్తూ శ్రమను గౌరవించడం అంటే ఏమిటో ప్రధాని మోదీ మనకు ఆచరించి చూపుతున్నారు. గంగా నది శుద్ధి కోసం తలపెట్టిన 'నమామి గంగే' కార్యక్రమంలో పాల్గొన్న స్వచ్ఛ భారత్ కార్యకర్తల కాళ్లు కడిగి ఆయన దేశానికే ఆదర్శంగా నిలిచారు. ★


# నిర్మాణం.. ఓ విస్మృత స్ఫూర్తి

**'రాజ్యాంగమే సర్వోన్నతం'– స్వతంత్ర భారత పౌరులందరిని కలిపి ఉంచే పదబంధమిది. వైవిధ్య భరిత భారతావనిని సమైక్యంగా ఉంచే ఏకతా సూత్రమిది. ఆటుపోట్లే చరిత్ర పుటలుగా ఉన్న ఈ దేశంలో ఆధునిక సామాజిక గమనానికీ, జీవనానికీ అదే కరదీపిక. మూలాలను గౌరవించుకుంటూనే, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం నేర్పే తాత్విక భూమిక. కానీ ఆ పదబంధాన్ని ఉచ్చరించే చాలా మందికి రెండు నాల్కలు ఉన్నాయి. ఒక నాలుక 'రాజ్యాంగమే సర్వోన్నతం' అంటుంది. మరొకటి 'వందేమాతరం' పలకనంటుంది. రాజ్యాంగ నిర్మాతలు శ్రీరాముడిని ఈ దేశపు ఆధ్యాత్మిక వార సత్వంగా గుర్తించలేదా అని అడిగితే ఒక నాలుక తడబడుతుంది. మరొక నాలుక రాముడిని దూషించడాన్ని భావ ప్రకటనా స్వేచ్ఛ అంటూ దబాయిస్తుంది. 'గీతా'సారం భారతీయ చింతనాధారగా రాజ్యాంగం చిత్రించింది. కానీ భగవద్గీత పేరు ఎత్తితేనే లౌకిక వ్రత భంగమైపోయిందంటూ గగ్గోలు పెట్టే నోళ్లకీ కొదవలేదిప్పుడు. ఈ ధోరణిని అత్యధికులైన భారతీయులు ఈసడిస్తున్నారు.**

శతాబ్దాల పరాయి పాలన, బానిసత్వాల తరువాత భారతదేశం జనవరి 26, 1950న సార్వభౌమాధికారం ప్రకటించుకుంది. స్వాతంత్ర్యోద్యమ సమరంలో అక్కడక్కడ పునరుజ్జీవన దృక్పథం పలచబడినా, స్వతంత్ర భారతీయుల అదృష్టం కొద్దీ రాజ్యాంగ నిర్మాణంలో ఆ దృక్పథం దృఢంగానే పనిచేసింది. అందుకే భారతీయ జీవనసారాన్ని, భారతీయత మూలాలను విస్మరించకుండా తగు జాగ్రత్త వహిస్తూనే రాజ్యాంగ రచన సాగింది. మన రాజ్యాంగ తొలి ప్రతుల (హిందీ, ఆంగ్లం) స్వరూప స్వభావాలు ఇందుకు సాక్ష్యం పలుకుతాయి.

మన రాజ్యాంగ నిర్మాణం చరిత్రాత్మకం. భారత ప్రభుత్వ చట్టాలు– 1858, 1909, 1919, 1935 బ్రిటిష్ ఏలుబడిని నిర్దేశించాయి. గోపాలకృష్ణ గోఖలే, తేజ్ బహదూర్ సప్రూ, వీఎస్ శ్రీనివాసశాస్త్రి వంటి భారతీయ మేధావుల





గాంధీజీ నౌఖాలి పర్యటన చిత్రం

నుంచి కొన్ని సలహాలు, సూచనలు స్వీకరించినా ఆ చట్టాల రూపకర్తలు ఆంగ్లేయులే. స్వతంత్ర భారతంలో మనదైన రాజ్యాంగ రచన ప్రారంభమైంది.

దేశం నలుమూలల నుంచి చట్టసభల నుంచి పరోక్ష పద్ధతితో ఎన్నికైన ప్రతినిధులతో రాజ్యాంగ పరిషత్ ఆవిర్భవించింది. పార్లమెంట్‌లోని సెంట్రల్ హాలులోనే (కాన్‌స్టిట్యూషన్ హాలు) డిసెంబర్ 9, 1949న రాజ్యాంగ పరిషత్ సమావేశాలు మొదలయినాయి. ఆనాడు 207 మంది సభ్యులు హాజరయ్యారు. తరువాత ఈ సంఖ్య మారుతూ వచ్చింది. ప్రత్యేక దేశం డిమాండ్‌తో తొలిరోజే ముస్లింలీగ్ సమావేశాన్ని బహిష్కరించింది. జనవరి 24, 1950న రాజ్యాంగ పరిషత్ తుది సమావేశం జరిగింది. అంతవరకు ఇదే తాత్కాలిక పార్లమెంటుగా చలామణీ అయింది. ఇందులో 69 శాతం భారత జాతీయ కాంగ్రెస్ సభ్యులే. డిసెంబర్ 11న డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. డాక్టర్ హరీంద్ర కుమార్ ముఖర్జీ (ప్రముఖ క్రైస్తవ నాయకుడు, మైనారిటీల హక్కుల సంఘం అధ్యక్షుడు) ఉపాధ్యక్షునిగా, ప్రముఖ పత్రికా రచయిత, రాజ్యాంగ వ్యవహారాల నిపుణుడు బెనెగల్ నరసింగరావు (కర్ణాటక) రాజ్యాంగ సలహాదారుగా ఎంపికయ్యారు. ఆగస్ట్ 29, 1947న డాక్టర్ అంబేడ్కర్ అధ్యక్షులుగా ముసాయిదా సంఘం ఆవిర్భవించింది. ఇంకా అల్లాడి కుప్పుస్వామి అయ్యర్, ఎన్. గోపాలస్వామి అయ్యంగార్, కేఎం మున్షీ, సయ్యద్ మహమ్మద్ సదుల్లా, బీఎల్ మిట్టర్, డీపీ ఖైతాన్ ఈ సంఘంలో ఉన్నారు. ఇవి కాకుండా మరో ఎనిమిది ఉప సంఘాలు కూడా తరువాత ఏర్పాటయినాయి. నెహ్రూ, పటేల్ వంటివారు ఆ సంఘాలకు నాయకత్వం వహించారు. ముసాయిదా సంఘం నవంబర్ 4,1947న రాజ్యాంగ ముసాయిదాను రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించింది. రెండేళ్ల, 11 మాసాల, 17 రోజుల పాటు పరిషత్ 114 సమావేశాలు జరిపి ఈ ముసాయిదాపై చర్చించింది. నవంబర్ 26, 1949న ఈ ముసాయిదాకు ఆమోదం లభించింది. ఈ రోజునే జాతీయ శాసన దినోత్సవంగా జరుపుకోవడం ఆరంభించారు. సభ్యులు ప్రతిపాదించిన 2000 సవరణలతో ముసాయిదాకు ఆమోదం లభించింది. జనవరి 24, 1950న 284 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు సంతకాలు చేసిన తరువాత భారత రాజ్యాంగంగా ఆవిర్భవించింది. ఇందులో 22 విభాగాలు, 395 ఆర్టికల్స్, 12 షెడ్యూల్స్ ఉన్నాయి. రెండు అనుబంధాలు కూడా ఉన్నాయి.

'వుయ్ ది పీపుల్..' అంటూ రాజ్యాంగం ముందుమాటలో కనిపించే తొలి పదాలు అమెరికా రాజ్యాంగం ముందుమాట ఇచ్చిన ప్రేరణతో తీసుకున్నవే. ప్రాథమిక హక్కులు కూడా అమెరికా రాజ్యాంగం నుంచి వచ్చినవే. పంచవర్ష ప్రణాళికల ఆలోచనను సోవియెట్ యూనియన్ నుంచి తీసుకున్నాం. ఆర్థిక, సామాజిక హక్కులను ప్రసాదించే ఆదేశిక సూత్రాలను ఐర్లాండ్ నుంచి తెచ్చుకున్నాం. ముందుమాటలో పేర్కొన్న 'స్వేచ్ఛ', 'సమత్వం', సౌభ్రాత్రం' ఫ్రెంచ్ విప్లవం నుంచి గ్రహించిన ఆదర్శాలే. కానీ వీటిని నాటి రాజ్యాంగ నిర్మాతలు మనదైన జీవనవిధానంతో, ఆలోచనతోను, చరిత్రతోను అనుసంధానం చేస్తూ వాస్తవికంగా వ్యవహరించారు. రాజ్యాంగ తొలిప్రతుల స్వరూపం, ఆకృతి దీనికి సాక్ష్యం చెబుతాయి. భారతీయుల మనోభావాలకు రాజ్యాంగ నిర్మాతలు ఎంతో విలువనిచ్చారు. దానిని గమనించాలి. దేవనాగరి, రోమన్ లిపులలో తొలి ప్రతులను తయారు చేయించారు. ప్రేమ్ బిహారీ నారాయణ్ రైజాదా(సక్సేనా) స్వదస్తూరితో ఆ ప్రతులు రాశారు. రాజ్యాంగంలోని ప్రతి ముఖ్యమైన అధ్యాయానికి ఒక బొమ్మ వేయించారు. రవీంద్రనాథ్ టాగూర్ స్థాపించిన శాంతినికేతన్‌కు చెందిన నందలాల్‌బోస్, ఆయన సహచరులు, శిష్యులు కలసి ఆ బొమ్మలు వేశారు. ఇవన్నీ మనదైన చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించేవే. వీటిని డెహ్రాడూన్‌లో ముద్రించారు. ఆ చేతి ప్రతులను సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఫోటో లితోగ్రాఫ్ చేశారు.



రాజ్యాంగం తొలి ప్రతిలో కనిపించే ఛత్రపతి శివాజీ, గురుగోవింద్ సింగ్, రాణి లక్ష్మీబాయి చిత్రాలు

ఇందులో 20 పెయింటింగ్స్ ఉపయోగించారు. ప్రతి పేజీని అజంతా శైలి చిత్రాలతో అందంగా అలంకరించారు. లంకా విజయం, గీతోపదేశం, వేదకాలం నాటి గురుకులాన్ని ప్రతిబింబించే దృశ్యం, గంగావతరణం, విక్రమాదిత్య చక్రవర్తి, బుద్ధుడు, మహావీరుడు, నలందా విశ్వవిద్యాలయం, ఛత్రపతి శివాజీ, గురు గోవింద్ సింగ్, రాణీ లక్ష్మీబాయి, అక్బర్, టిప్పు సుల్తాన్ బొమ్మలు, హిమాలయాలు, మొహెంజదారో ఎద్దు, సుభాశ్‌బోస్, గాంధీజీ బొమ్మలు ఇందులో ఉన్నాయి. అంటే పురాణాలతో పాటు మొహెంజదారో నుంచి మహాత్ముడి వరకు చరిత్రనూ రాజ్యాంగ రచనకు స్ఫూర్తిగా స్వీకరించారు. మొదటి భాగం– కేంద్రం, కేంద్రం పరిధులు. దీనికి పైన మొహెంజదారో తవ్వకాలలో బయల్పడిన (ఇదొక ముద్రిక) ఎద్దు బొమ్మను ఉపయోగించారు. ఎంతో బలిష్టంగా, గంభీరంగా, సుందరంగా ఉండే ఈ బొమ్మను ఈ అధ్యాయానికి ప్రతీకగా ఎంచుకోవడంలోని అంతరార్థాన్ని గ్రహించడం కష్టం కాదు. మొహెంజదారో, హరప్పా సంస్కృతిలో వృషభ ఆరాధన ఒక అంశం. రెండో భాగం– పౌరసత్వం. వేద సంప్రదాయంలోని


యజ్ఞవాటిక దృశ్యాన్ని దీనికి ఎంచుకున్నారు. మూడో అధ్యాయం పేరు ప్రాథమిక హక్కులు. దీనికే లంకా విజయం చిత్రాన్ని ఉపయోగించారు. అంటే రావణుని జయించి సీతా సాధ్వితో శ్రీరామచంద్రుడు పుష్పక విమానంలో, లక్ష్మణ సమేతుడై అయోధ్యకు తరలుతున్న దృశ్యమిది. విశ్వాసం, సత్యం కలసి ఒక రాక్షసశక్తి మీద సాధించిన విజయానికి ప్రతీకగా ఈ బొమ్మను రాజ్యాంగ నిర్మాతలు ఎంచుకున్నారు. ఆదేశిక సూత్రాలను నాలుగో అధ్యాయంలో పొందుపరిచారు. ఈ అధ్యాయానికి ఆరంభంలోనే కురుక్షేత్రంలోని గీతోపదేశం చిత్రాన్ని ఉంచారు. ఐదో అధ్యాయం– కేంద్రం. దీనికి బౌద్ధంలోని సంఘం దృశ్యాన్ని ప్రతీకగా తీసుకున్నారు. ఆరో అధ్యాయంలో 'ఏ' భాగానికి మహావీరుని బొమ్మ ఉంది. ఏడో అధ్యాయానికి నటరాజ స్వామి బొమ్మను ఉపయోగించారు.

ఇందులో స్వరాజ్య సమరయోధులలో ఇద్దరే– సుభాశ్ చంద్రబోస్, గాంధీజీ బొమ్మలు మాత్రమే ఉపయోగించారు. గాంధీ నడిపిన దండియాత్ర, నౌఖాలీ పర్యటనలు ఇతివృత్తంగా తీసుకున్న రెండు బొమ్మలు ఉపయోగించారు. నేతాజీ త్రివర్ణ పతాకానికి వందనం చేస్తున్న దృశ్యం కనిపిస్తుంది. ఈ తొలి ప్రతులు ఇప్పటికీ పార్లమెంటు గ్రంథాలయంలో భద్రంగా ఉన్నాయి. కానీ ఆ ప్రతులలో భారతీయ పురాణాల చిత్రాలు ఉన్నాయన్న సంగతి ఎవరూ చెప్పరు. ఒకదశలో వీటిని తొలగించాలన్న యత్నం జరిగిందని చెప్పేవారూ ఉన్నారు. రామాయణం, భారతం, శైవం, బౌద్ధం, జైనం వీటన్నిటి ప్రేరణ, ఆలోచన రాజ్యాంగ రచనలో తమకు మార్గదర్శకంగా నిలిచాయని ఈ బొమ్మల ద్వారా రాజ్యాంగ నిర్మాతలు సూచించారు. కానీ సెక్యులరిజం పేరుతో హిందువుల ఆరాధనను చులకన చేయడం ఇటీవలి పరిణామం.

రాజ్యాంగ ముసాయిదాకు ఆమోద ముద్ర వేస్తూ రాజ్యాంగ పరిషత్ సభ్యులంతా సంతకాలు చేసిన తరువాత వందేమాతర గీతం ఆలపించారు. జనవరి 24, 1950న జనగణమన అధినాయక జయహే అన్న రవీంద్రనాథ్ టాగూర్ గీతం, బంకింబాబు రచించిన 'వందేమాతరం' గేయంలోని మొదటి రెండు చరణాలను జాతీయ గీతాలుగా స్వీకరిస్తూ రాజ్యాంగ పరిషత్ తీర్మానించింది. ఒక రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సమయంలో కూడా కొందరు అది 'రాజ్యాంగ నిర్మాతల అభిప్రాయాలకు విరుద్ధం' అంటూ ఆక్రోశించారు. కానీ ఆ రాజ్యాంగ నిర్మాతలే వందేమాతరం ఆలపించారు. జాతీయగీతంగా స్వీకరించారు. అలాగే స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తిని ఇచ్చిన త్రివర్ణ పతాకం. ఆ జెండా నీడనే రాజ్యాంగ రచన పూర్తయింది!

ప్రస్తుతం కుహనా మేధావులు, కుహనా సెక్యులరిస్టులు యథేచ్ఛగా ఉపయోగిస్తున్న 'సెక్యులరిజం' అన్న మాట మొదట రాజ్యాంగంలో లేనేలేదు. 'సెక్యులర్', 'సోషలిస్ట్' అన్న రెండు పదాలను 42వ సవరణ చేసి ఇందిరాగాంధీ ముందుమాటలో చేర్పించారు. రాజ్యాంగ చట్టం (42వ సవరణ) 1976 పేరుతో పిలిచే ఈ సవరణ అత్యవసర పరిస్థితి కాలంలో జరిగింది. ఆ సవరణ తరువాత రాజ్యాంగాన్ని కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇందిరగా కొందరు నిపుణులు అభివర్ణించారు. 1977లో ఇందిరాగాంధీ అపజయం పాలయ్యారు. జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇలాంటి సవరణలు భారతీయ వ్యవస్థకు సరికాదని, వాటిని సరిచేస్తామని ఆ పార్టీ ప్రభుత్వం చెప్పింది. కానీ చేయలేకపోయింది.

ఆ సవరణ అసలు సార్వభౌమ, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యం అన్న నినాదాన్ని సార్వభౌమ, లౌకిక, సామ్యవాద, గణతంత్ర రాజ్యమని మార్చింది. చట్టసభలు చేసిన చట్టాలకు ఉన్న రాజ్యాంగబద్ధత




**భారత రాజ్యాంగ పరిషత్ సమావేశాలలో ప్రథమ ప్రధాని నెహ్రూ. భారత్‌ను స్వతంత్ర సర్వసత్తాక గణతంత్ర దేశంగా ప్రకటించుకోవాలని కోరుతూ నెహ్రూ తీర్మానం ప్రవేశపెట్టినప్పటి చరిత్రాత్మక దృశ్యమిది**

గురించి నిలదీయడానికి సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉన్న మొత్తం అధికారాన్ని ఈ సవరణ దారుణంగా కుదించివేసింది. ప్రాథమిక హక్కులకు పాతరేసింది. ముందుమాట సహా, రాజ్యాంగంలోని చాలా విభాగాల స్వరూపాలను ఆ సవరణ మార్చింది. ప్రధానికి హద్దులులేని అధికారాలను కట్టబెట్టింది. పైగా ఏ అంశాన్నయినా సవరించే నిరంకుశాధికారం పార్లమెంటుకు వచ్చింది. ఈ సవరణకు న్యాయ సమీక్షకు అవకాశం లేకుండా చేసింది. అసలు భారత రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి తీవ్రంగా భంగం కలిగిస్తూ ఎన్నో రాష్ట్రాల అధికారాలని కేంద్రానికి 42వ సవరణ బదలీ చేసింది. మినర్వా మిల్స్ వర్సెస్ కేంద్రం వివాదంలో సుప్రీం కోర్టు జూలై 31, 1980న ఇచ్చిన తీర్పులో 42 సవరణ లోని రెండు అంశాలను కొట్టివేసింది. అందులో ఒకటి చట్టసభల నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేయరాదన్న నిబంధన.

సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యంగా భారత్‌ను రూపొందించడం మన రాజ్యాంగ కర్తల ఉద్దేశం కాదు. ఆ రెండు పదాలు రాజ్యాంగంలో ఉండవలసిన అవసరం లేదనే మన పెద్దలు భావించినట్టు కనిపిస్తుంది. పండిట్ నెహ్రూ నిరంతరం సెక్యులరిజం గురించి ప్రస్తావించేవారు. సోషలిజం కూడా ఆయన ముద్దుబిడ్డే. ఆ రెండు అంశాలను రాజ్యాంగంలో చేర్చాలన్న ప్రతిపాదనలు వీగిపోయాయి. ఎందుకంటే లౌకికవాదం ఈ దేశ ప్రజల జీవన విధానంలోనే ఉందన్న విశ్వాసం. వేదధర్మం ప్రబలంగా ఉన్న కాలంలో జైనం జన్మించింది. హిందూ జీవనవిధానంలోని కొన్ని లోపాల మీద తిరుగుబాటుతో బౌద్ధం ఆవిర్భవించింది. అవి కూడా వాటి తప్పిదాలతో మరుగున పడినాయి. పలు రకాల ఆచరణలు, సంప్రదాయాలు ఉన్న విదేశీయులు ఈ దేశం మీదకు వచ్చారు. వారిని కూడా హిందూ జీవన విధానం కలుపుకుంది. పార్శీలు, యూదులు ఈ దేశంలోనే ఆశ్రయం పొందారు. సగౌరంగా జీవించారు. ఆ వాస్తవాన్ని వారే ప్రకటించుకున్నారు.రాజ్యాంగాన్ని మనసా వాచా గౌరవించాలి. అది ఒకే నేల మీద నివశిస్తున్న జాతి కలసి రాసుకున్న ఒప్పందపత్రం. రాజ్యాంగ మౌలికత నాశనమైపోతోందంటూనే, దాని మీద బురద చల్లే పని చేస్తే జనం అర్థం చేసుకోగలరు. రాజ్యాంగ నిర్మాతలకు స్పష్టత ఉంది. ఈ దేశం, దీని గతం, ఆ గతంలోని తాత్వికత రాజ్యాంగ నిర్మాణంలో ప్రతిబింబించాలని వారు కోరుకున్నారు. ఆ విషయాన్ని ఇప్పుడు ఎవరు గుర్తు చేసినా వారు మతోన్మాదులవుతున్నారు. అదే చారిత్రక వైచిత్రి.

**– జాగృతి డెస్క్**

# రాజ్యాంగం: నేటి



కాలానికి ఆధునికతను అద్దినది ప్రజాస్వామ్యమే. ఆ భావన ఒక ఆదర్శ స్థాయిలోనే మిగిలి పోకుండా, ఆకృతి దాల్చడానికి ఉపకరించేది రాజ్యాంగం. అందుకే 'రాజ్యాంగం మార్గదర్శి, నేను ఏనాడూ దానిని విస్మరించను' అంటాడు జార్జి వాషింగ్టన్. భారతదేశం అనే పురాతన భూమిని ఆధునిక రాజకీయ, ఆర్థిక, సామాజిక తాత్వికతలతో చెలిమి కట్టించడంలో మన రాజ్యాంగం నిర్వహించిన పాత్ర చరిత్రాత్మకమైనది. ఆరున్నర దశాబ్దాల ఆధునిక భారత ప్రస్థానానికి రాజ్యాంగమే మార్గదర్శిగా నిలిచింది. ఇందుకు ఎన్నో దృష్టాంతాలు కనిపిస్తాయి. మన దేశంవరకు రాజ్యాంగమంటే సమున్నత చట్టం.

'భారత పౌరులమైన మేము...' అంటూ భారత రాజ్యాంగం ఆరంభమవుతుంది. అంటే ఇది ప్రజల కోసం, ప్రజలు రాసుకుని, ప్రజలే అందించిన రాజ్యాంగమని ఆ మూడు ముక్కలు సూచిస్తున్నాయి. స్వేచ్ఛ, సమత్వం.. సౌభ్రాతృత్వం రాజ్యాంగానికి ఆత్మ వంటివి.

భారత రాజ్యాంగం అంటే మొదట గుర్తుకు రావలసిన అంశం ఫెడరల్ వ్యవస్థ గురించి ఆలోచించే సంప్రదాయం లేని భారత్‌ను అదే వ్యవస్థలో ఒదిగి ఉండేటట్టు చేసిన సంగతి. అలాగే సమత్వం కూడా, ఏనాడూ ఇక్కడి భావధారలో లేని సమత్వం అనే ఒక ఉదాత్త భావన ప్రయోజనం ఏమిటో రుచి చూపించింది. అంతకుమించి, వందల ఏళ్ల క్రితం మరచిపోయిన స్వేచ్ఛను దేశానికి తిరిగి ప్రసాదించినది రాజ్యాంగమే. అది మన దేశంలో యథాతథ స్థితిని కొనసాగనివ్వలేదు. అయినా దేశాన్ని ఘర్షణ స్థాయికి కూడా వెళ్లనివ్వలేదు.

మన రాజ్యాంగం అమలు, విజయాలూ, వైఫల్యాలూ వంటి అంశాల గురించి ఏదైనా మాట్లాడాలని అనుకుంటే, మొదట ఆ సమున్నత చట్టం అమలులోకి వచ్చిన జనవరి 28, 1950కి ముందు ఉన్న చారిత్రక దృశ్యాన్ని ఒక్కసారి వీక్షించాలి. సుదీర్ఘ విదేశీ పాలన, చిరకాలంగా ఇక్కడ ఉన్న అనర్థాలు, ఆ అనర్థాలకు సామాజిక వ్యవస్థ అల్లికలో వచ్చిన ఘర్షణలు తోడైన రు వాస్తవం, ఆర్థిక అసమానతలు, వివక్ష, అంతరాల పట్ల అవగాహన ఉండాలి. డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జవహర్‌లాల్‌తోపాటు కేఎం మున్షీ, భోగరాజు పట్టాభిసీతారామయ్య, జేబీ కృపలానీ వంటి మహనీయులు అల్లాడి కృష్ణస్వామి వంటి ఎందరో రాజ్యాంగ నిపుణులు, స్వాతంత్ర్య పోరాట యోధులు సభ్యులుగా ఉన్న రాజ్యాంగ పరిషత్ ఊహకు కూడా అందని కొన్ని సమస్యలను ఇప్పుడు దేశం వీక్షిస్తున్నది. కొన్ని కొత్త ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి సమాయత్తం కావలసిన ఉన్నది కూడా. అలాంటి సమయంలో రాజ్యాంగం విఫలమైందన్న మాటను కొందరు విసిరినా, నిజమైన వైఫల్యం రాజకీయాలది, రాజకీయ నాయకత్వానిది తప్పు, రాజ్యాంగానిది కాదని చరిత్రలో ఇప్పటికే రుజువైంది. 1960 దశకం వరకు జాతీయ పోరాట స్ఫూర్తి మన వ్యవస్థలను నడిపించింది. తరువాత నాయకత్వ స్ఫూర్తి ఆ బాధ్యతను స్వీకరించింది. 1975 తరువాత మాత్రం ఈ దేశాన్ని నడిపించినది పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తే. జూన్ 25, 1975న

# ఐక్యతా సూత్రం

ప్రకటించిన అత్యవసర పరిస్థితి పౌర హక్కులు, ఆదేశిక సూత్రాలు, పౌరుల స్వేచ్ఛలో రాజ్యం జోక్యం, న్యాయస్థానాలు– ప్రభుత్వ జోక్యం వంటి అంశాల గురించి గట్టి ఆలోచనలకు అంకురార్పణ చేసింది. 1990 నుంచి కేంద్రంలో మైనారిటీ ప్రభుత్వాల జోరు మొదలైంది. 'కేంద్ర ప్రభుత్వం' అన్న మాట రాజ్యాంగంలో లేకున్నా, అలాంటి సంక్షుభిత రాజకీయ నేపథ్యంలో కూడా దేశ ఫెడరల్ వ్యవస్థకు జీవం పోసిన ఘనత మన రాజ్యాంగానిది. ప్రపంచీకరణ, 21వ శతాబ్దపు తొలి ఒకటిన్నర దశాబ్దాలు భారత రాజ్యాంగానికి నిశ్చయంగా కొన్ని సవాళ్లు విసిరాయి. ఇవి రాజ్యాంగ పరిషత్ ఊహించినవి కావనే అనిపిస్తుంది. అంతర్జాతీయ పరిణామాలు, వ్యక్తి స్వేచ్ఛ, ఆత్మ గౌరవ నినాదాలకు వెల్లువెత్తిన కొత్త నిర్వచనాలు; నేషన్, నేషనలిజమ్, యాంటి నేషనలిజమ్ వంటి వాటిపై చర్చ, చర్యలు ఇందుకు సంబంధించినవే. ఈ విషయంలో ఒకవైపు అలాంటి భావనలకు స్వేచ్ఛను ఇస్తూనే, ప్రశ్నించ డానికి వీలు కల్పిస్తూనే భారత్‌ను ఒకే దేశంగా కొనసాగడానికి అవరోధాలు లేకుండా చేస్తున్న మహోన్నత శక్తి మన రాజ్యాంగం.

రాజ్యాంగం తొలి సవరణ (జూన్ 18, 1951– 9వ షెడ్యూల్, 31ఎ, 31బి అధికరణల చేరిక; 15, 19, 85,87,174, 176, 341, 342, 372, 376 అధికరణలకు సవరణ) నుంచి, తాజా సవరణ (సెప్టెంబర్ 8, 2016, జీఎస్టీ బిల్లు) వరకు 101 పర్యాయాలు రాజ్యాంగం మార్పులు చేసుకుంది. ఇది బలహీనత అనిపించుకోదు. కాలానుగుణంగా మార్చుకునే అవకాశం భారత రాజ్యాంగానికి ఉంది. అయితే ఇది ఎంత సరళమో, అంత కఠినం కూడా. రెండు రకాల సవరణ విధానాలు ఇదే చెబుతాయి. కొన్ని సవరణలు పార్లమెంట్ ఒక్కటే చేయవచ్చు. కొన్ని సవరణలకు అసెంబ్లీల అనుమతి అవసరం. ఇది మొదటి నుంచి కనిపిస్తున్న క్రమమే. 1955 ఆవడి కాంగ్రెస్‌లో సామ్యవాద సమాజ స్థాపన లక్ష్యంగా చేసుకుంది. కానీ 1990లో ప్రపంచీకరణ నేపథ్యంలో సరళీకృత ఆర్థిక విధానాలు దేశంలో ప్రవేశించడానికి రాజ్యాంగం ఆటంకం కాలేదు.

ఫెడరల్ వ్యవస్థ భగ్నం కాకుండా రాజ్యాంగం నిర్వహించిన పాత్ర ఘనమైనది. ఇందుకు చక్కని ఉదాహరణలు ఉన్నాయి. రాజ్యాంగం నిజమైన విజయం ఈ అంశంలోనే ఉంది కూడా. 275వ అధికరణ ఉంది. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య వనరుల విభజనలో ఈ అధికరణే కీలకం. పదో ఫైనాన్స్ కమిషతో ఇది మరింత బలపడింది. అది ఎంత సుస్థిరమైందంటే, ఇప్పుడు ప్రపంచానికి ఈ వనరుల విభజనకు సంబంధించి ఈ అధికరణ ఆదర్శంగా మారిపోయింది. 356 అధికరణ మరొక పాఠం. రాష్ట్రాలలో రాష్ట్రపతి పాలన, లేదా కేంద్ర పాలన విధింపునకు అవకాశం ఇచ్చే అధికరణ ఇది. ఇది రాజ్యాంగంలో ఉన్న మాట వాస్తవం. ప్రథమ ప్రధాని నెహ్రూ కాలంలోనే కేరళలో ఈఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని తొలిసారి రద్దు చేయడం దగ్గర నుంచి ఈ అధికరణ వివాదాస్పదమే. కానీ కర్ణాటకలో ఎస్ ఆర్ బొమ్మయ్ ప్రభుత్వం రద్దు తరువాత సుప్రీంకోర్టు ఈ అధికరణాన్ని విచక్షణా రహితంగా ఉపయోగించే ప్రమాదాన్ని తగ్గించింది. హిందీ వివాదం కారణంగా, అంటే భాష కారణంగా 1960లో తమిళనాడు ఈ దేశం నుంచి విడిపోతుందని భయపడ్డారు. తరువాత ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొన్నారు. అయినప్పటికీ మన రాజ్యాంగం కొన్ని అంశాల పట్ల మౌనం వహి



స్తుందన్న వాదన ఉంది. అది నిజం కూడా. కానీ ఆ మౌనం గంభీరమైనదని తెలుసుకోవాలంటారు నిపుణులు. వివిధ కారణాలవల్ల మన రాజ్యాంగం ఆత్మ ఆధునికం. కానీ అది నిక్షిప్తమై ఉన్న శరీరం మాత్రం పురాతనం. 1820 నాటి పాలనే ఇప్పటికీ కొనసాగుతోందన్న కటువైన అభిప్రాయాలు అప్పుడప్పుడు వెల్లువెత్తడం అందుకే కూడా.

భారత రాజ్యాంగం శిలాశాసనం కాదు. సరళమైనదే. కానీ రాజ్యాంగాన్ని సమీక్షించుకునే అవకాశం మనం కోల్పోయాం. స్వాతంత్ర్యం స్వర్ణోత్సవాల సందర్భంగా ఆ అవకాశం వచ్చింది. వారం రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమా వేశాలు జరిపి, ఇందుకు సంబంధించిన తీర్మానం ఆమోదించింది. పీఏ సంగ్మా స్పీకర్. ఈ ఉదాత్త భావనలకు సంబంధించిన తీర్మానాన్ని ఎలా అమలు చేయాలో అందులో ప్రస్తావించుకోలేదు. అది తప్పిదమే. తరువాత ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వం తీర్మానాన్ని అమలులోకి తేవడానికి ప్రయత్నించడంతోటే రాజకీయాలు మొదలైనాయి. ఇక్కడ రాజకీయాలు అన్న మాటే వాస్తవం. ఎన్డీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న పార్టీ బీజేపీ కాబట్టి రాజ్యాంగ సమీక్షలో ఉదాత్త లౌకిక భావాలకు చోటు ఉండదని ప్రచారం మొదలైంది. నిజానికి ఇది అపోహ అని అప్పుడే చాలామంది నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. రాజ్యాంగ సమీక్షా సంఘం ఏర్పాటయింది. దానికి అధ్యక్షులు సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య. బీపీ జీవన్‌రెడ్డి, ఫాలి నారిమన్ వంటి న్యాయకోవిదులు, సీఆర్ ఇరానీ (అప్పుడు స్టేట్స్‌మన్ పత్రిక సంపాదకుడు, ప్రస్తుతం లేరు) సభ్యులు. ప్రజాస్వామ్యం అనే అంశం గురించి ఏర్పాటు చేసిన సంఘంలో జస్టిస్ హెచ్ ఆర్ ఖన్నా, తెలుగువారైన జయప్రకాశ్ నారాయణ్ సభ్యులు. అయినా అపోహలు తొలగిపోలేదు. దీనితో రాజ్యాంగాన్ని శాస్త్రీయంగా సమీక్షించుకునే అవకాశం చేజారిపోయింది. ఇదొక చారిత్రక తప్పిదం. కాబట్టి జరిగిన తప్పిదాలకు రాజ్యాంగాన్ని బాధ్యురాలిగా చూపించడం కంటే, రాజకీయాలను కారణంగా చెప్పడం వాస్తవిక దృక్పథమవుతుంది.

రాజ్యాంగం ప్రకారమే జరిగిన అధికార వికేంద్రీకరణతో మొదట దెబ్బతిన్నది గ్రామీణ ఆర్థిక వ్యవస్థ. అయితే గ్రామాలు రిపబ్లిక్‌లుగా ఉండాలని గాంధీజీ భావించేవారు. ఈ రెండు వాస్తవాలు అంత తొందరగా జీర్ణం కావు. అలాంటి హోదా కల్పిస్తే కుల సమీకరణల దృష్ట్యా గ్రామాలలో పెదధోరణులు ప్రబలిపోతాయని అంబేడ్కర్ ఊహించారు. దీనితో కులవృత్తులు నాశనమైనాయి. రాజ్యాంగమే ప్రసాదించిన జీవించే హక్కుకు పరోక్షంగా గండి పడుతోంది. కానీ దీనిని మార్చవచ్చు. ఎందుకు మార్చుకోలేదు? అందుకు మళ్లీ రాజకీయాలనే తప్పు పట్టవలసి ఉంటుంది. అందరికీ సమానావకాశాలు, విద్య, వైద్యం అందరికీ అందుబాటులో ఉండడం వంటి అంశాల వైఫల్యం కూడా రాజకీయ నాయకత్వం చిత్తశుద్ధికి సంబంధించినవే కానీ, రాజ్యాంగ వైఫల్యం కాదు. రాజ్యాంగం రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. ఇది సమన్యాయ ఉద్దేశమే. కానీ నేటికీ 60 శాతం మంది సమన్యాయానికి సుదూరంగా ఉండిపోవడం ఒక చేదు వాస్తవం. ఒక పౌరుడికి విద్యావకాశాలు కల్పించకుండా, సంపద సృష్టిలో భాగస్వామిని చేయకుండా సమన్యాయం రమ్మంటే రాదు. స్త్రీ విముక్తికి సంబంధించి ఆదేశిక సూత్రాలలో స్పష్టమైన అంశాలే కనిపిస్తాయి. కానీ వాస్తవంలో కనిపిస్తున్నది వేరు. మరి 33 శాతం రిజర్వేషనకు అర్థం ఎక్కడ?

రాజ్యాంగ రచన పూర్తయిన తరువాత అంబేడ్కర్ వాస్తవిక దృక్పథంతో చెప్పిన పలుకులు ఇప్పటికీ గుర్తుంచుకోదగినవే. రాజ్యాంగ రచన పూర్తి కావడంతోటే దేశంలో దారిద్ర్యం, అసమానతలు, అంతరాలు సమసిపోవు. రాజ్యాంగ ముసాయిదానో లేదా, ప్రతినో చూసి పారిపోవు. ఆ దృశ్యం ఇవాళికి తాజాగానే ఉంది. అదొక విష్కంభం. ★




7

ఆ రాత్రి శాంతికి మఠంలోనే బస చేయడానికి అనుమతి లభించింది. అందుచేత ఆమె తన గదిని అన్వేషించడంలో నిమగ్నురాలయింది. చాల గదులు ఖాళీగానే ఉన్నాయి. గోవర్ధనుడనే పరిచారకుడు ఆమెకు అన్ని గదులు చూపిస్తున్నాడు. కాని ఏ గదీ ఆమెకు వాసయోగ్యంగా కనిపించడం లేదు. శాంతి "సంతాన సోదరా! అటువైపు గదులు కూడా చూపించు" అంది.

"ఆ గదులు ఇంతకంటే బాగుండేమాట నిజమే. వానిలో సంతాన సేనాపతులు ఉంటున్నారు."

"ఎవరు వారు?"

"భవానందుడు, జీవానందుడు, ధీరానందుడు, జ్ఞానానందుడు. ఆనందమఠం ఆనందులమయమే కదా!"

"పద. ఆ గదులు పరికిద్దాం."

గోవర్ధనుడు ముందు శాంతికి ధీరానందుని గది చూపించాడు. ధీరానందుడు ఆ సమయంలో ద్రోణపర్వం చదువుకుంటున్నాడు. అతడు శాంతితో మాట్లాడలేదు. ఆమె కూడా పలకరించలేదు.

తరువాత భవానందుని గదికి తీసుకువెళ్లాడు. భవానందుడు ఊర్ధ్వ దృష్టితో ఎటో పరకాయించి చూస్తున్నాడు. అతడు చూస్తున్న వైపు ఒక ముఖచిత్రం ఉన్నది. ఎవరిదో తెలియదుగాని, చాల సుందరమైన ముఖం. భవానందుడు ఈ శోభామయమైన రూపాన్ని ఉపాసిస్తున్నాడు. ధ్యానిస్తున్నాడు. అతడు శాంతి రాకను గమనించనే లేదు.

శాంతి ఆ తరువాత మూడవగదిలోనికి వెళ్లింది. "ఇది ఎవరి గది?" గోవర్ధనుడు "జీవానందస్వామిది" అన్నాడు. "ఇంకా ఎవరున్నారు? గదిలో ఎవరూ లేరే!"

"ఎక్కడికో వెళ్లి ఉంటారు. బహుశా, ఈ క్షణంలోనో, మరుక్షణంలోనో రావచ్చును."

"ఈ గది అన్నిటికంటే ఉత్తమంగా ఉంది."

"కాని ఈ గదిలో మీకు అవకాశం ఉండదు."

"ఎందువల్ల?"

"జీవానందస్వామి ఉంటున్నారు."

"నేను ఈ గదిలోనే ఉంటాను. వారినే మరో గది చూచుకోమని చెప్పు." "అలా కుదరదను



కుంటాను. జీవానందస్వామి ఈ గదికి యజమాని. ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా ఏమీ జరగటానికి వీలులేదు."

"సరే. నీవు వెళ్లు. నాకు ఎక్కడా చోటు దొరక్క పోతే, ఏ చెట్టునీడనో పడుకుంటానులే" అని శాంతి గోవర్ధనుడిని పంపివేసింది.

శాంతి జీవానందుని పులిచర్మం పరుచుకుని పడుకుంది. దీపం పెద్దది చేసి పుస్తకం చదువుకో సాగింది.

కొద్దిసేపు గడిచాక జీవానందుడు గదిలోనికి వచ్చాడు. శాంతి పురుషవేషాన్ని గమనించాడు. గుర్తించగలిగాడు. "ఇదేమిటి శాంతీ?" అని పలక రించాడు.

శాంతి పుస్తకం పక్కన పెట్టి, నింపాదిగా జీవానందుని వంక చూచి "మహాశయా! శాంతి ఎవరు?" అని అడిగింది.

జీవానందుడు అవాక్కు అయినాడు. చివరకు "శాంతి ఎవరా? నీ పేరు శాంతి కాదా?" అన్నాడు.

"నా పేరు నవీనానందస్వామి!" ఇలా చెప్పి శాంతి తిరిగి పుస్తక పఠనంలో మునిగిపోయింది.

జీవానందుడు విరగబడి నవ్వాడు. "ఇది కొత్తరకం వినోదంలా ఉంది. మంచిది. శ్రీశ్రీ నవీనా నందస్వామిజీ! నీవు ఏ ఆలోచనతో ఇక్కడకు వచ్చావు?"



"ముందు మర్యాద, తరువాత నీవు, ఇది బాగానే ఉంది."

"స్వామీ! ఏమి ఆజ్ఞ! తాము భర్కయీపురం నుంచి ఏ మిషతో ఇక్కడకు ఏతెంచారు?"

శాంతి మరింత గంభీర స్వరంతో "ఇక్కడ వ్యంగ్యం అవసరం లేదు. భర్కయీపురం ఏమిటో, ఎక్కడో నాకు తెలియదు. నేను సంతాన ధర్మగ్రహణం నిమిత్తం వచ్చాను. దీక్ష పుచ్చుకున్నాను" అంది.

"నిజంగానా? అంటే, అంతా సర్వనాశనం అయిందన్నమాట!"

"సర్వనాశనం ఎలా అవుతుంది? మీరూ దీక్షితులే కదా!"

"నీవు కేవలం స్త్రీవి!"

"నేను స్త్రీనా? ఎవరు చెప్పారు మీకు?"

"నా విశ్వాస్వం, నా భార్య స్త్రీయేనని!"

"తమకు భార్య ఉన్నదాయేమి?"

"అవును. ఆ భార్యవు నీవే అనిగూడా స్పష్టంగా చెబుతున్నాను. తెలుస్తోందా?"

"అయితే ఇప్పుడేం చేస్తారు?"

"బలవంతంగానైనా నీ అధరామృతం తాగుతాను!"

"బహుశా మీ దృష్టిలోపం అనుకుంటాను. దీక్ష సమయంలో మీరు చేసిన శపథం ఎట్టిది? నేను మీ స్త్రీని అనుకున్నా, నాతో ఏకశయ్యపై ఎలా శయని స్తారు? మీరు రజుసర్పభ్రాంతిలో ఉన్నారనిపిస్తోంది. మీరు ఇప్పటికైనా తెలివితెచ్చుకుని వేరే శయనం ఏర్పరుచుకోండి."

ఈ మాటలు చెప్పి శాంతి తిరిగి తన పుస్తక పఠనంలో మునిగిపోయింది. జీవానందుడు తనకు వేరొక శయ్య ఏర్పాటు చేసుకున్నాడు.

**తృతీయ భాగము**

**1**

భగవంతుని దయవలన 76వ సంవత్సరం సమాప్తమయింది. బంగాళదేశంలో రూపాయికి ఆరణాల వంతు జనాభా–ఆ సంవత్సరం కాల గర్భంలో కలిసిపోయింది. డెబ్బైయేడవ సంవత్సరం ఈశ్వరుడు ప్రసన్నుడుగా తయారయినాడని చెప్పుకోవచ్చును. వర్షాలు సకాలంలో కురిసినాయి. పృథ్వి సస్యశ్యామలం అయింది. పోయిన సంవత్సరం వచ్చిన కరవుతో చనిపోగా మిగిలినవారు ఈ సంవత్సరం కడుపు నిండా భోజనం చేయగలిగారు. ఈ యేడు పంటలు బాగా పండినాయి. కాని తినేవాళ్లు ఏరీ?

గ్రామాలన్నీ నిర్మానుష్యమైనాయి. ఇళ్లన్నీ గొడ్ల సావిళ్లయినా, నివసించేవాళ్లు లేకపోవడంవల్ల. ఇలా ఒకటి, రెండు, మూడు సంవత్సరాలు గడిచి పోయినాయి. అరణ్యం పెరిగిపోతూ ఉంది. పూర్వం మనుషులు నివసించిన స్థలంలోనే ఇప్పుడు, పశు



బంకించంద్ర చటర్జీ

వులు, క్రూరమృగాలు విచ్చలవిడిగా తిరుగుతు న్నాయి.

ఇక్కడ సంతాన సంప్రదాయంవారు విష్ణు పాదపద్మాలను తులసిమాలతో పూజిస్తున్నారు. పిస్తోళ్లు, తుపాకులు ఇళ్లలో కనిపిస్తే చాలు, వాటిని గుంజుకుని వచ్చి తమ దగ్గర దాచుకుంటున్నారు. భవానందుడు సాటి యోగులతో ఇలా చెప్పాడు: "సోదరులారా! ఎవరి ఇంట్లోనయినాసరే, మణిమాణి క్యాలు, చెడిపోయిన తుపాకీ కనిపించాయంటే, మీరు మణిమాణిక్యాల జోలికి వెళ్లకుండా వాటిని వదిలివేసి, తుపాకి తీసుకురండి."

హిందూమతం మరుగున పడుతున్న సమయం అది. హిందూమతాన్ని పునరుద్ధరించటానికి అనేకులు ప్రయత్నాలు చేస్తున్నారు. రోజురోజుకు సంతానుల సంఖ్య పెరిగిపోతోంది. ప్రతి నెల వేల కొద్దీ గ్రామీణులు సంతాన సంప్రదాయంలో ప్రవేశించి ముసల్మానుల శాసనాన్ని ధిక్కరిస్తున్నారు. జీవా నందుడు, భవానందుడు చేసే కృషి వల్ల సంతానుల సంఖ్య, కార్యదీక్ష అధికం అవుతున్నాయి. స్థానిక ముసల్మాను నవాబు ఈ విషయం విని, సైనిక దళాలను పంపి ఈ ఉద్యమాన్ని లొంగదీయాలని ఆలోచించాడు. కాని ఈ సరికే సంతానులు యుద్ధనైపుణ్యం గడించారు. శస్త్ర అస్త్ర ప్రయోగంలో ఆరితేరారు. ఆ కాలంలో ఆంగ్ల గవర్నర్ జనరల్ హేస్టింగ్స్ దొర ఉన్నాడు. కలకత్తాలో లోహ శృంఖ లాలు తయారు చేయించి, దానితో భారతదేశాన్ని యావత్తు బంధించగలుగుతానని అతడి అంచనా. ఒకానొక రోజు భగవంతుడు కూడా 'తథాస్తు! కాని ఆ రోజు చాల దూరంలో సుంది!' అన్నాడు. సంతానుల బలం గురించి విని హేస్టింగ్స్ వణికి పోతున్నాడు, ప్రస్తుత కథా కాలం నాటికి.

హేస్టింగ్స్ ముందు దేశంలో విద్రోహక చర్యలను, వ్యక్తులను అరికట్టాలని ప్రయత్నం చేశాడు. కాని దేశీయ సైన్యాల ధోరణి ఎలావున్నదంటే, వారు యుద్ధ సమయంలో కూడా హరినామ సంకీర్తనం చెవిని పడినదంటే అస్త్రశస్త్రాలు వదిలి పారిపోతున్నారు. చివరకు ఎటూ దారితోచక హేస్టింగ్స్ ఈ ఉద్యమాన్ని అణచడానికి కెప్టెన్ థామస్ అనే అతడిని కొద్దిపాటి

సైన్యంతో నియమించాడు.

కెప్టెన్ థామస్ సరికొత్త పన్నాగం పన్నాడు. ఆంగ్ల సైన్యం, ముసల్మాను సైన్యం, ఇంకా గ్రామీణ సైన్యం అంతటినీ కలిపి అత్యంత బలిష్టమైన సేనను తయారుచేశాడు. ఈ అసంఖ్యాకమైన సేనను ఎన్నో విభాగాలుగా చేసి ఒక్కొక్క విభాగాన్ని ఒక్కొక్క బల వంతుడైన నాయకుని చేతిలో ఉంచాడు. తరువాత ఈ నాయకులకు ప్రాంతాలను కేటాయించాడు. ఒక్కొక్క దళానికి ఒక్కొక్క ప్రాంతం అప్పగించి ఆ ప్రాంతంలో సంతానులందరినీ వారు లొంగదీసు కుందుకు, అంతమొందించేందుకు సర్వవిధాలా ప్రయత్నించాలని అనుజ్ఞ ఇచ్చాడు. థామస్ సైన్యాన్ని పొలంలో వరి కోసినట్లుగా, గ్రామీణ రైతులు నరికి వేశారు. హరిధ్వనితో థామస్ చెవులు పూడుకు పోయాయి. అప్పటికి సంతాన ఉద్యమం బలిష్టంగా తయారయింది. ప్రాపకం సంపాదించింది.

**2**

కంపెనీ వారికి అనేక కొటారులు వున్నాయి. ఒక కొటారు 'శివగ్రామం' అనే ఊరిలో కూడా ఉంది. డానీ వర్త్ అనే మహాశయుడు దీనికి యజమాని. ఇతడు అనేక పర్యాయాలు సంతాన సైన్యం చేత దెబ్బతిన్నాడుగాని, ఎలాగో ప్రాణాన్ని నిలుపుకో గలిగాడు. తన భార్యాపిల్లలను కలకత్తాకు వెంట పెట్టుకుని ఆ గ్రామానికి వచ్చాడు. సంతానులు చేస్తున్న దోపిడులు చూచి ఆ ప్రాంతపు గిరిజన దళాల వారు కూడా ఇదే పనులకు పూనుకున్నారు. వీరందరూ కలిసి కెప్టెన్ థామస్ భోజనాగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. థామస్ భోజనసామగ్రులను బళ్లమీద వేసుకుని పోతున్నాడు. వాటిని దారిలో అడ్డగించారు గిరిజనులు. థామస్ సైనికులు దెబ్బలు తిని పారిపోయారు. థామస్ ఈ విషయాన్ని కలకత్తాకు నివేదించుకున్నాడు. ఆ నివేదిక మాత్రం తప్పులతడక. తాను 157 మంది సిపాయిలతో వెళ్లి 3373 మంది విద్రోహులను పారదోలినట్లు, 2153 మందిని చంపినట్లు, 7 గురిని ఖైదుచేయగలిగినట్లు నివేదించాడు. ఇదంతా సత్యదూరమే, ఏడుగురిని ఖైదు చేయడం తప్ప. డంబాలు పలుకుతూ తిరుగుతున్న థామస్ డాన్వర్‌కు కూడా హితబోధ చేసి ధైర్యం చెప్పటానికి పూనుకున్నాడు. ఇప్పుడిక నీవు నీ భార్యాపిల్లలను తెచ్చుకోవచ్చును. ఇక్కడ నిర్భయంగా ఉండవచ్చును, అని చెప్పాడు. డాన్వర్ మటుకు "మీరు ఇక్కడ ఒక పదిరోజుల పాటు, దేశంలో శాంతి నెలకొనేవరకు ఉండండి. తరువాత నా కుటుంబాన్ని తెచ్చుకుంటాను". అన్నాడు. ఇక్కడ భోజన సదుపాయాలు చక్కగా అమరినాయి గనుక థామస్ అలాగే ఉండిపోతానన్నాడు.

ఆనందమఠంలో, భవానందుడు చాల వ్యాకు లుడై వున్నాడు. అప్పుడప్పుడు థామస్ వేటకోసం అరణ్యంలోనికి వస్తున్నాడు. ఒకమారు అరణ్యంలో చాల లోపలకు వెళ్లిన తరువాత సైనికులు, ఉద్యోగులు పులుల అరుపులు విని బెదిరిపోయి ఇంక వెనుకకు మరలుతామన్నారు. థామస్ మటుకు ధైర్యంగా ఒక్కడే అరణ్యంలోనికి చొచ్చుకుపోయినాడు.

ఈ అరణ్యంలో సహజమైన మార్గం ఏదీ లేదు. గుర్రం సూటిగా నడవటానికి వీలులేకుండా వుంది. అందుచేత థామస్ తన గుర్రాన్ని విడిచిపుచ్చి, భుజానికి తుపాకి తగిలించుకుని కాలినడకను ప్రయాణం కొనసాగించాడు. లోపల ఎక్కడా పెద్ద పులులు కనిపించలేదు. ఎవరో ఒక వ్యక్తి కూర్చుని ఉండడం అగుపించింది. అతని చుట్టూ లతా గుల్మాలు వ్యాపించి ఉన్నాయి. పూలచెట్ల మధ్య ఒక నవీన సన్యాసి కూర్చుని ఉన్నాడు. ముందు థామస్‌కు విపరీతమైన ఆశ్చర్యం కలిగింది. తరువాత క్రోధం వెల్లువెత్తింది. థామస్‌కు కొద్దిగా హిందీ భాష వచ్చును. ఆ భాషలోనే "ఎవరు నీవు?" అని అడిగాడు.

"నేను సన్యాసిని."

"నీవు విద్రోహివి!"

**ఆనందమఠంలో, భవానందుడు చాల వ్యాకులుడై వున్నాడు. అప్పుడప్పుడు థామస్ వేటకోసం అరణ్యంలోనికి వస్తున్నాడు. ఒకమారు అరణ్యంలో చాల లోపలకు వెళ్లిన తరువాత సైనికులు, ఉద్యోగులు పులుల అరుపులు విని బెదిరిపోయి ఇంక వెనుకకు మరలుతామన్నారు. థామస్ మటుకు ధైర్యంగా ఒక్కడే అరణ్యంలోనికి చొచ్చుకుపోయినాడు.**

"అంటే ఏమిటి?"

"తుపాకి పేల్చి నిన్ను కాల్చివేస్తాను."

"కాల్చు!"

కాల్చటమూ, మానివేయటమా అనే యోచనలో పడిపోయాడు థామస్. ఈ సమయంలో సన్యాసి విద్యుద్వేగంతో ముందుకువచ్చి కెప్టెన్ చేతిలోని తుపాకిని లాగుకున్నాడు. సన్యాసి తన వంటిమీద జంతు చర్మాన్ని తీసి అవతల పారవేశాడు. జడలను లాగి పారవేశాడు. థామస్ తనకెదురుగా అపూర్వ సౌందర్యరాశి అయిన ఒక స్త్రీ నిలువబడి ఉన్నట్లు గమనించాడు. ఆ సుందరి నవ్వుతూ థామస్‌తో ఇలా అంది. "అయ్యా! నేను స్త్రీని. ఎవరికీ ఎటువంటి హాని చేయలేను. కాని ఒక్క ప్రశ్న మాత్రం అడుగుదామనుకుంటున్నాను. ఇప్పుడు దేశంలో హిందూ ముసల్మానుల కలహాలు జరుగుతున్నాయి. మరి మీరు ఎందుకు ఇందులో జోక్యం కలిగించు కుంటున్నారు? మీ దారిన మీరు మీ ఇంటికి వెళ్లండి."

"ఇంతకూ నీవెవరు?"

"కనిపించడం లేదా? నేను సన్యాసినిని. నీవు యుద్ధం చేసి వచ్చిన వారిలో నేనొకతెను."

"నీవు వచ్చి నా ఇంటిలో ఉంటావా?"

"నీకు ఉపపత్నిగా ఉండమంటావా?"

"కలిసి ఉందాం అంతే! వివాహం చేసుకోనక్కర్లే దులే!"

"నాకూ ఒకమాట అడగాలని ఉంది. మా ఇంట్లో ఒక అందమైన కోతి ఉంది. ఈ మధ్యనే చనిపో యింది. దాని గూడు ఇప్పుడు ఖాళీ. నీవు వచ్చి ఆ గూడులో కూర్చుంటావా? నీ మెడలో తాడు కడతాను. ఆ గూడులో కూర్చుంటావా?"

"నీవు భలే తమాషాగా మాట్లాడుతున్నావు. నీ మీద నాకు చాల అభిమానంగా ఉంది. నీవు నా ఇంటికి రా. నీ భర్త యుద్ధంలో చచ్చిపోతాడు. తరువాత మాత్రం నీవు ఏం చేయగలవు?"

"ఒక షరతు మీదనైతే అంగీకరిస్తాను. రెండు మూడు రోజులలో యుద్ధం ఎలాగూ జరుగుతుంది. ఆ యుద్ధంలో మీరు జయిస్తే, నీవు వచ్చి మా కోతి గూటిలో కూర్చోవాలి. నీకు అరటిపళ్లు పెడతాను. సరేనా?"

"అరటి పళ్లు బాగుంటాయి. నీదగ్గరున్నాయా ఇప్పుడు?"

"ఛో, నీ తుపాకి తీసుకుని. ఇటువంటి తెలివి తక్కువ వారితో మాట్లాడడం కూడా అనవసరం" అని ఆ స్త్రీ తుపాకి కింద పడవేసి వేగంగా పరుగు తీసింది.

ఆ స్త్రీ 'శాంతి' అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

**3**

శాంతి కెప్టెన్ థామస్‌తో మాట్లాడి అరణ్యం లోనికి పారిపోయింది. కొద్ది క్షణాలలోనే కెప్టెన్‌కు ఓ స్త్రీ కంఠం నుండి మధుర గీతం వచ్చి వినిపించ సాగింది. ఈ కంఠానికి తోడుగా మరొక పురుష కంఠం కూడా వినిపించింది. మరొక క్షణానికి మూడవ గొంతు కూడా ఈ పాటలో కలిసింది.

అరణ్యం చాల దట్టమైనది. లోపల ఏమి ఉన్నదో బయటకు కనిపించదు. శాంతి అరణ్యాంతరంలోనికి వెళ్లింది. అక్కడ చెట్ల నడుమ ఆమెకో కుటీరం వున్నది. చెట్ల కొమ్మలతో, ఆకులతో, పూతీగలతో తయారైన కుటీరం అది.

ఈ కుటీరంలో ప్రవేశించింది శాంతి. లోపల జీవానందుడు సితార వాయిస్తున్నాడు.


జీవానందుడు ఆమెను చూచి ఇలా అన్నాడు: "చూడు శాంతీ! ఒక రోజు నేను వ్రతభంగం చేశాను. దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవలసి వుంది. కాని నీ అవరోధం చేతనే ఇంతవరకు ప్రాయశ్చిత్తం చేసుకో వడం కుదరలేదు. ఆలస్యం అయినకొద్దీ ఏమవు తుందోనని నాకు భయంగా వుంది. రేపు జరుగబోయే యుద్ధంలోనే నాకు ప్రాయశ్చిత్తం అవుతుందేమో! నా మరణం ఆసన్నమవు తుందేమో...!" **(సశేషం)**

కళ... తాను నమ్మిన సంగీత జగత్తు కులమతాలకు అతీతమంటూ అందరిని ఆదరించి, ఆచరించి చూపిన మానవతామూర్తి ఘంటసాల. హిందూస్థానీ సంగీత సంప్రదాయంలో మేరు శిఖరం ఉస్తాద్ బడే గులాం ఆలీ లాంటి వారిని మన్నించి, వర్ధమాన గాయకులను ప్రోత్సహించి, ఎదిగినకొద్దీ ఒదిగి ఉండాలనే సూక్తికి ప్రతీక. 'ఘంటసాల గారి అమృతగళం ఉత్తరాదిన పుట్టక పోవడం మాలాంటి గాయకుల ఆదృష్టం' అని ప్రఖ్యాత గాయకుడు రఫీ అభినందనలు అందుకున్న మృదుమధుర గాయకుడు. గొప్పదనాన్ని గుర్తించడానికి మనిషి వ్యక్తిత్వమే కానీ ఎత్తు,సిరిసంపదలు కావడానికి ఆయన ఒక నిదర్శనం. పనికిరాదన్న గాత్రమే పట్టుదల, వినయంతో సంగీతాన్ని ప్రధానంగా లలిత సంగీతాన్ని పరిమళింప చేసింది. అద్వితీయ గాత్రం నవరసాలను పరిపూర్ణంగా పోషించింది. పాట ఆయన గాత్రంలో మురిసిపోయింది. పద్యం ఆ గొంతులో వయ్యారమొలికి రుణ పడిపోయింది. భగవద్గీత వ్యాఖ్యానం అజరామర కీర్తిని ఆర్జించి పెట్టింది. 'నువు మలచిన ఈ బతుకు నీకే నైవేద్యం' అని ఒక చిత్రగీతంలో ఆయనే పాడినట్లు... గంధర్వలోకాల నుంచి వెంట తెచ్చుకున్న ఒకానొక అలౌకిక మాధుర్యాన్ని తనను అభిమానించి, ఆరాధించేవారికి పంచి వెళ్లిపోయారు. 'ఒక సూర్యుడు, ఒక చంద్రుడు, ఒక ఘంటసాల' అన్నట్లు గాలి ఉన్నంత వరకు ఆయన గాత్రం చెవికి సోకుతూనే ఉంటుంది.



# మాధుర్యానికి మరో పేరు 'కంఠశాల'

**'విద్యా దదాతి వినయం వినయాద్యాతి పాత్రతాం పాత్రతా ద్ధన మాప్నోతి ధన ద్ధర్మం తతస్సుఖం'** (విద్యవలన వినయం, దాని వలన పాత్రతను, అందు మూలంగా ధనం, ధనం వల్ల సుఖం పొందుతారు) అన్న సూక్తికి ఘంటసాల నిలువెత్తు నిదర్శనం. ధిషహణాంకారానికి బహుదూరం. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉంటే తత్వం.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

'లవకుశ'లో వాల్మీకి పాత్రధారి నాగయ్య గారికి పాడవలసి వచ్చినప్పుడు వణికి పోయారట. వారి సంగీత దర్శకత్వంలో బృందం గానంలో 'గొంతు కలిపిన నేనేమిటి? ఆయనకు గాత్రమివ్వడం ఏమిటి? ఎంతటి అపచారం?' అని మధనపడి చివరికి నాగయ్య గారి అనునయం, ప్రోత్సాహంతో పాడక తప్పలేదు. 'ఎలా పాడాలో నాగయ్యగారి దగ్గర నేర్చుకున్నాను' అని వినయంగా చెప్పేవారు ఘంటసాల.

గాయకుడిగా ఎంతగా రాణిస్తున్నా పాట పాడే విషయంలో ఆయనకున్న అంకితభావం, నిబద్ధత గురించి వారి తనయ శ్యామల తమ రచనలో ప్రస్తావించిన తండ్రి మాటల్లో... 'కవి ఎంతో అనుభూతితో రాస్తారు. సంగీత దర్శకుడు కష్టపడి స్వరాలు కూరుస్తారు. వాద్యబృందం (ఆర్కెస్ట్రా) శ్రద్ధగా వాయిస్తుంది. అలాంటప్పుడు మనని ఎవరేమంటార్లే! అనే అహంకారంతో తోచినట్లు పాడితే పాట నిస్సారమవుతుంది. అంతమంది శ్రమా వృథా అవుతుంది. అడిగేవారు లేనప్పుడే మరింత బాధ్యతగా వ్యవహరించాలి. వారి నమ్మకాన్ని కాపాడుకోవాలి. నమ్మకాన్ని, ప్రేమాభిమానాలను శ్రమతో సంపాదించి నిలబెట్టుకోవాలే కానీ డబ్బుతో కొనలేం' అని ఒక తమిళ పాటను సాధన చేసే సందర్భంలో ఆమెతో అన్నారట. అంతేకాదు...'నటులు శక్తిమేరకు నటించడానికి ప్రయత్నిస్తారు.వారి పెదవుల కదలికకు అనుగుణంగా నేపథ్య గానం అందించడం గాయనీగాయకుల ధర్మం' ఒక ముఖాముఖిలో చెప్పారు.

**కృతజ్ఞతాబద్ధుడు**

బాల్యంలో, చదువుకునే రోజుల్లో ఆదరించి ఆకలి

తీర్చిన ప్రతి ఒక్కరిని జీవితాంతం గుర్తుంచుకుని, సందర్భానుసారం వారిని స్మరించుకునే వారు. 'విజయ నగరంలో మధుకర వృత్తితో పొట్ట పోసుకుంటూ మొదటి కబళం వేసిన తల్లిని, ఆర్థికంగా ఆదుకున్న కళాకారిణి సరిదె లక్ష్మీనరసయమ్మ (కళావర్ రింగ్)ను మరువలేదు. ఆయన నేపథ్యగాయకుడిగా స్థిరపడి, ఆమె కాలం చేసిన కొన్నేళ్లకు విజయగనరం వెళ్లిన ఘంటసాల ఆమె ఇంటిని సందర్శించి నమస్కరించి, భోరుమంటూ గుమ్మం మీద కూలబడి పోయారట. 'భక్తి విశ్వాలంటే అవి' అన్నారు ఒక సందర్భంలో రావి కొండలరావు.

**పట్రాయని-ద్వారం**

గురువు పట్రాయని సీతారామశాస్త్రి అంటే అమితమైన ఆరాధనాభావం. గురుపూజ ఘనంగా నిర్వహించిన తరువాత నాటి మద్రాసులో గృహ ప్రవేశం చేశారు. 'గురువు' అన్న మాట శ్రీ శాస్త్రిగారి యెడలనే సార్థక మయిందనిపించింది' అని చెప్పుకున్న ఆయన వారిపట్ల గౌరవాభిమానాలతో గురుపుత్రుడు సంగీతరావును చేరదీసి జీవిత పర్యంతం సోదరుడిగా చూసుకున్నారు.

గాయకుడిగా రాణించానంటే అందుకు ప్రధాన కారకులు కళాశాల ప్రిన్సిపల్ ద్వారం వెంకటస్వామి నాయుడు గారి సలహాయే కారణం అనేవారు. వయొలిన్ నేర్చుకోవాలనుకున్న ఘంటసాల కంఠాన్ని విన్న ఆయన గాత్ర విద్య వైపు మళ్లించారు. 'ఆనాడు నాయుడు గారు అలా మార్గదర్శనం చేయకపోతే వయొలిన్ కళాకారుడిగానే స్థిరపడేవాడినే'మో అని గుర్తు చేసుకునేవారు ఘంటసాల.

**'నాన్నగారు రజనీ....!'**

'ఈ లేఖ తెస్తున్న కుర్రవాడు (ఘంటసాల) సంగీతాన్ని అభ్యసించాడు. ఏమాత్రం వీలున్నా రేడియోలో పాడించే అవకాశం కల్పించగలరు' అని సముద్రాల రాఘవాచార్యులు సంగీత దర్శకుడు, మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారి బాలాంత్రపు రజనీకాంతరావుకు లేఖ పంపారు. రజని-ఘంటసాలది 'కళా సంబంధం'తో పాటు తండ్రీతనయుల లాంటి అనుబంధంగా చెప్పుకోవాలి. వయసులో ఇద్దరికి కేవలం రెండేళ్లే తేడా అయినా ఘంటసాల ఆయనను పితృభావంతో 'నాన్నగారు' అని మన్నించేవారు. 'చలన చిత్రసీమలో నేపథ్య గాయకుడిగా నిలదొక్కుకోకముందు రేడియోలో పాడేందుకు అనేక అవకాశాలు కల్పించి నా జీవనానికి సహకరించారు' అని వినమ్రంగా చెప్పేవారు ఘంటసాల. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడం ఆకాశవాణి లక్ష్యం. ఆ పద్ధతిలోనే నా వంతు సాయం చేశాను. పూజ్యులు సముద్రాల వారంతటి వారు సిఫారసు చేశారంటే ఆయనలో ఏదో ప్రత్యేకత ఉందనిపిం చింది. ఒక మాటలో చెప్పాలంటే నేను ఘంటసాలను ఆకాశవాణి శ్రోతలకు పరిచయం చేశాను అనడం కంటే ఆయన కీర్తిపతాక ఎగురుతున్నంత దాకా నా ప్రస్తావన ఉండడం నా భాగ్యం' అని ఘంటసాలతో గల అనుబంధాన్ని రజనీ ఈ వ్యాసకర్తకు వివరించేవారు.

నేపథ్యగాయకుడిగా విఖ్యాతులైన తరువాత కూడా ఘంటసాల రేడియోలో పాడేవారు. ఆ క్రమంలోనే పాడేందుకు ఒకసారి ముందుగానే సమాచారం అందుకుని, అంగీకారం కూడా తెలిపారు. కానీ కారణాంతరాల వల్ల కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. అప్పటికి ఆయనకున్న స్థాయిని బట్టి చిన్నపాటి వివరణతో సరిపెట్టుకోవచ్చు. కానీ తన గైర్హాజరీకి పశ్చాత్తాప పూర్వక సంజాయిషీ లేఖ రాశారు. అది ఆయన సంస్కారమని, వినయం ఆయన సొంతమని, ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలనే దానికి నిలువెత్తు నిదర్శనమని రజనీ గుర్తు చేసేవారు.



పట్రాయని సీతారామశాస్త్రి

కళావర్ రింగ్ (సరిదె లక్ష్మీనరసయమ్మ)

**సమరయోధుడు... సమాజసేవకుడు**

'సంగీత సభలు చేస్తూ, నాటకాలు ఆడుతూ సంగీత శిక్షణ యిస్తూ ఆర్థికంగా సతమతమవుతున్న సమయంలోనే ప్రపంచం అంతా యుద్ధ వాతావరణంలో మునిగింది. మన దేశం పర ప్రభుత్వ దాస్యంలో ఉంది. నాయకులు అందరు జైళ్లల్లో మగ్గుతూ ఉన్నారు.ఆ సమయంలో నా వ్యక్తిగత జీవితం,నా కుటుంబ బాధ్యత, సంగీత సాధన దేశ భవితవ్యం ముందు చాలా అల్పంగా కనిపించాయి. చాలామంది మిత్రులతో నాటి ఆగస్టు (క్విట్ ఇండియా) ఉద్యమంలో పాల్గొన్నాను. ఫలితంగా పద్దెనిమిది మాసాలు కారాగార శిక్ష విధించింది. జైలు జీవితం నాకు ఎన్నో విధాలుగా మహోపకారం చేసింది. కర్తవ్య దీక్ష, స్థిర సంకల్పం, నియమబద్ధమైన జీవితం, నేను జైలు జీవితం గడిపినప్పుడే అర్థం చేసుకున్నాను' అని తమ అభినందన ప్రత్యేక సంచికలో పేర్కొన్నారు.

నాయకులే కాదు... కళాకారులూ సమాజానికి బాధ్యత వహించాలన్నది ఆయన గట్టి విశ్వాసం.'కళ ఎంత ఉన్నతమైనదైనా కావచ్చును. కళాకారుడు కళను తపస్సుగా భావించవచ్చును. కానీ అతను ప్రజా సమస్యలకు, వారి కష్టనిష్ఠూరాలకు దూరం కాకూడదు. కళను ప్రజా శ్రేయస్సుకు వినియోగించినప్పుడే కళాకారుని జీవితం ధన్యం అవుతుందని నా విశ్వాసం' అని స్వీయ రచనలో అభిప్రాయ పడ్డారు. 'సినిమా వ్యక్తిగా ధన సంపాదనచేస్తూ అశేష ప్రజలను ఆకర్షిస్తూ ఆనందపచేస్తూ , వారి సన్మానాలు అందుకోవడం మాత్రమే కళాకారుని జీవిత పరమార్థంగా భావించలేకపోతున్నాను' అనీ నిర్మొహమాటంగా చెప్పారు.

జాతీయ యుద్ధనిధి సేకరణలో, అనేక వైద్యశాలలు, కళాశాలల నిర్మాణంలో, పోలీసుల నిధి సేకరణలో, అనేక సాంస్కృతిక కార్యకలాపాలలో, కళాకారునిగా భాగస్వామిని కాగలడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పుకున్నారు.

అ కారణం చేతనే దేశమాత పిలుపు ఎప్పుడు ఏ రూపంలో వినవచ్చినా నా సేవల నర్పించడానికి సంసి ద్ధుడుగా ఉన్నాననీ ప్రకటించారు.

**సంగీత కళాశాల 'కలే'**

సంగీతం నేర్చుకునేందుకు తాను పడిన కష్టాలు, ఇబ్బందులు ఔత్సాహిక, సంగీతాభిలాషగల

విద్యార్థులకు ఎదురు కాకూడదన్న భావన ఆయనను వెంటాడేది. తిరుపతిలో కానీ హైదరాబాద్‌లో కానీ సంగీత కళాశాలను నెలకొల్పి, ఆసక్తి గల వారికి ఉచిత వసతి సదుపాయాలతో సంగీతం నేర్పించాలన్నది ఆయన సంకల్పం. అందుకు తిరుపతిలో స్థలం కూడా కొనుగోలు చేశారు. హైదరాబాద్‌లో కళాశాల స్థాపనకు ఆయన ఆరాధించే సత్యసాయి బాబా భరోసా ఇచ్చారు. కానీ ఘంటసాల ఆరోగ్యం సహకరించలేదు. సంగీత కళాశాల స్థాపన విషయమై చివరి క్షణం వరకు తపించారట.

**పద్యం ఆ గాత్రంలో హృద్యం**


'ఏ సాహిత్యంలోనూ లేని అపురూప సంపద పద్యం. దీని పఠనంలో వినూత్న పద్ధతి ప్రవేశ పెట్టాలని ప్రయత్నించాను. అప్పటి ప్రేక్షకాభిరుచిని బట్టి రంగస్థల పద్య ఆలాపన ఉండేది. ఆ రీతి తీసివేయదగ్గది కాకపోయినా ఆ ప్రక్రియలో నూతనత్వాన్ని పరిచయం చేయాలన్నది నా ప్రయత్నం' అని ఘంటసాల చెప్పేవారు. ఆయన బాణీని ఈలపాట రఘురామయ్య, సూరిబాబు లాంటి రంగస్థల, వెండితెర నటప్రముఖులు కూడా ప్రశంసించారు. హరికథల లోనూ ఘంటసాల శైలిలో పద్యాలు పాడాలన్న ప్రయత్నం అప్రయత్నంగానే మొదలైంది. కవిత్రయం నుంచి ఆధునిక కవుల వరకు ఎందరివో పద్యాలు ఆయన స్వరంలో పల్లవించాయి.

అనేక మంది కవుల రచనలను గానం చేసినా, పేకేటి శివరాం (అనంతరం కాలంలో నటుడు, దర్శకుడు) సహకారంతో 'నగుమోమునకు నిశానాథ బింబముజోడు....' పద్యం గ్రామఫోన్ రికార్డుగా మొదట వచ్చిందని 1970వ దశకంలో 'ఆకాశవాణి'కి ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖీలో కృతజ్ఞతాపూర్వకంగా చెప్పారు. ఇతర సంగీత దర్శకులు తమ చిత్రాలలోని పద్యాలకు బాణీలు కట్టే అవకాశం ఘంటసాల వారికే ఇచ్చేవారంటే ఈ అంశంలో ఆయనకు గల సాధికారిత అవగతమవుతుంది. వారి సూచనలను మన్నిస్తూనే బాణీలు కట్టేవారట.

**'యశస్వీభవ..'**

ఇది కంచికోటి పీఠాధిపతి శ్రీచంద్రశేఖర సరస్వతీ మహాస్వామి మహదాశీర్వచనం. 1960వ దశకంలో నామమాత్రపు వాద్య సహకారంతో తమ సమక్షంలో 'గిరిజా కల్యాణం' యక్షగానాన్ని (ఆ తర్వాత 'రహస్యం'చిత్రంలో వినియోగించారు) ఆలపించినప్పుడు మహాస్వామి నిండుమనసుతో అందించిన ఆశీస్సులు.సుమారు పుష్కర కాలం తరువాత వారిని దర్శించి 'భగవద్గీత'ను గానం చేయాలన్న అభిలాషను విన్నవించగా, 'మంచిపని చేస్తున్నావు. తప్పకుండా ఇది చాలా ప్రజాదరణ పొందుతుంది. నీ జన్మ చరితార్థమవుతుంది నాయనా..!' అని ఆశీర్వదించారు. వారి ఆశీర్వాద





ఫలమో, ఘంటసాల వారి గాత్రవైభవమో 'గీత' అనన్య ప్రచారం పొందుతోంది.

**కలియుగ 'గీతా'చార్యుడు**

బతుకుతెరువు కోసం సుమారు మూడు దశాబ్దాల పాటు సాగిస్తున్న నేపథ్యగాన ప్రస్థానానికి క్రమంగా స్వస్తి పలుకుతూ, ఆధ్యాత్మికత వైపునకు మళ్లాలన్న సంకల్పమే భగవద్గీతాలాపన. ఆయన జీవిత ప్రస్థానంలో చలనచిత్ర నేపథ్య గానం ఒక ఎత్తయితే, భగవద్గీత గానం మరో ఎత్తు. 'గీత' గానం పట్ల చిరకాలంగా గల ఆసక్తికి, ప్రఖ్యాత గాయని లతామంగేష్కర్ మరింత స్ఫూర్తినిచ్చారు. అనారోగ్యం ఎదురైనా వెనుదీయక లక్ష్యాన్ని సాధించారు. భగవద్గీత పాడిన నోటితో 'లల్లాయి' సినిమా పాటలు పాడను అనేవారని వారి ధర్మపత్ని సావిత్రమ్మ గారు చెప్పారు.

ఆ మాట దక్కించుకున్నట్లే అలాంటి పాటలు పాడకపోవడం అటుంచి 'గీత'ను వినకుండానే (రికార్డులు విడుదల కాకుండానే) ఆ గాత్రం మూగవోయింది. ఉత్కృష్టమైన గీతను సరళభాషలో, మధురగానంతో జాతికి అందించిన 'గీత'కు తెలుగునాట దక్కే గౌరవం ఎంత అని ప్రశ్నించుకుంటే అభిమానులకు ఆవేదనే మిగులుతోంది. అది ఆలయాలలో కంటే అంతిమ యాత్రలలో విరివిగా వినిపించడం శోచనీయం. 'గీత' వినిపించిందంటే ఆయా ప్రదేశాలలో శవజాగరణో, శవయాత్రో అనే సంకేతాలు అందే స్థితి రావడం బాధించే అంశం. అసలుసిసలు వ్యక్తిత్వ వికాస గ్రంథంగా మన్ననలు అందుకుంటూ, మనిషి మనీషిగా మారే విధానాన్ని బోధించే 'జ్ఞాన'గీత ఇలా 'జాగరణ' గీతగా మారడం బాధించే అంశం. 'శోభనిచ్చే గీత శోకగీత కాదు.. కారాదనే భావన కలిగినపుడు, కల్పించ గలిగినప్పుడే 'గీత'కు గౌరవం. అదే ఆయనకు నిజమైన నివాళి.

**'జయంతితే సుకృతినో రస సిద్ధాః కవీశ్వరాః**
**నాస్తి తేషాం యశః కాయే జరా మరణంజం భయం'**



# మనదైన న్యాయవ్యవస్థ కోసం, మనవైన న్యాయసూత్రాల కోసం...

వివాదాల పరిష్కార ప్రక్రియ– ఆంగ్లంలో Dispute Redressal Mechanism. దీనిని మానవ సమాజ పరిణతికి గీటురాయిగా సామాజిక శాస్త్రజ్ఞులు భావిస్తారు. ఈ వివాద పరిష్కార యంత్రాంగాన్నే న్యాయ వ్యవస్థ లేదా న్యాయస్థానాలని పిలుచుకుంటాం. న్యాయస్థానాలలో కక్షిదారుల తరపున వాదించే వారిని న్యాయవాది, వకీల్, ప్లీడర్‌గా వ్యవహరిస్తుంటాం. వివిధ చట్టాలు, నియమ నిబంధనలను ఆయా కక్షిదారుల తరపున విపులీకరించి, విశ్లేషించి వాదించే న్యాయవాదులకు సమాజంలో గౌరవ ప్రతిష్టలు ఉంటాయి.

భారత స్వాతంత్ర్యోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించి, జన బాహుళ్యంలోనికి తీసుకెళ్లిన గాంధీజీ, మోతీలాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, తేజ్ బహదూర్ సప్రూ, ప్రకాశం పంతులు వంటివారి పేర్లు అందరికి పరిచితమే. గాంధీజీ తన పర్యటనలో ఆయా ప్రాంతాల ప్రముఖ న్యాయవాదుల ఇళ్లకు వెళ్లి వారిని స్వాతంత్ర్యోద్యమంలో ఎలా భాగస్వాములను చేసేవారో ఆనాటి నేతల ఆత్మకథలు చదివితే తెలుస్తుంది.

వ్యక్తులు తాము ఎదుర్కొంటున్న కొన్ని సామాజిక, న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం న్యాయవాదుల దగ్గరకు వెళతారు. ఇదంతా కేవలం కేసులు వాదించటం, తీర్పులు తేవడం కాదు. సమస్యల మూలాన్ని గుర్తించి, విశ్లేషించడం. ఆయా వర్గాల, సమూహాల, వ్యక్తుల ఆకాంక్షలను, ఆవేదనలను పరిగణనలోనికి తీసుకుని, వాటికి అక్షరరూపం ఇచ్చి, ఒక క్రమపద్ధతిలో చెప్పడం (Articulate Action) కూడా. సమాజ ఆలోచనా ప్రక్రియను ఒక క్రమపద్ధతిలోకి మళ్లించే పనిలో న్యాయవాది కీలకపాత్ర వహిస్తారు. ఇది నిరంతర ప్రక్రియ.


ఠేంగ్డేజీ

అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఒకరు ప్రకటించినట్లు, 'బలహీనులైన పౌరులకూ, దుందుడుకుతనంతో ఉన్న రాజ్యానికీ మధ్య నిలబడడానికి ఏ రోజునైతే న్యాయవాది నిరాకరిస్తాడో ఆ రోజే అరాచకానికి పునాది పడుతుంది.' అంటే న్యాయవాది ఒక 'సామాజిక రక్షణ కవచం' వంటివాడు.

అలాంటి న్యాయవాదులను ఒకే గొడుగు కింద తీసుకువచ్చి సామాజిక సేవలో భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభమైన సంస్థ 'అఖిల భారతీయ అధివక్తా పరిషత్'. 1992లో భారతీయ తత్త్వవేత్త దత్తోపంత్ ఠేంగ్డే మార్గదర్శకత్వంలో ఇది ఒక రూపును సంతరించుకుంది. అంతకుముందే, అంటే, 1975 నాటి ఎమర్జెన్సీలోను, తరువాత 1990–92 అయోధ్య రామ జన్మభూమి ఉద్యమ సందర్భంగా సామాన్య ప్రజల కోసం వివిధ రాష్ట్రాలలో ఏర్పడిన న్యాయవాద సంఘాలన్నీ 1992 నుంచి అఖిల భారతీయ అధివక్తా పరిషత్ ఛత్రం కిందకు వచ్చాయి.

కేరళలో అభిభాషక పరిషత్, తెలుగు రాష్ట్రాలలో న్యాయవాద పరిషత్, తమిళనాడులో వరక్కిరగళ సంఘ్, పశ్చిమ బెంగాల్‌లో జాతీయ న్యాయవాదుల వేదిక వంటి పేర్లతో ఆయా రాష్ట్రాలలో శాఖలు ఏర్పడ్డాయి.

సమాజంలో పనిచేస్తున్న సజ్జన శక్తికి అండగా నిలబడటమే అధివక్తా పరిషత్ ప్రధాన కర్తవ్యం. వివిధ రంగాలలో పనిచేస్తున్న ఉద్యమకారులకు సరైన రీతిలో న్యాయ సహాయం అందించటం మరొక ముఖ్య కార్యక్రమం. న్యాయ వ్యవస్థలో చట్ట నిబంధనల విశ్లేషణ వాటి అమలు విషయంలో భారతీయ విలువలు భూమిక వహించే వాతావరణాన్ని నిర్మించే ప్రక్రియను న్యాయవాద పరిషత్ జాతీయ స్థాయిలో చేపట్టింది. న్యాయ వ్యవస్థను పాశ్చాత్య వలసవాద ప్రభావం నుంచి విముక్తం చేసే ప్రయత్నాలు చేపడుతున్నది.

న్యాయ సిద్ధాంతాలు, వాటి భూమికను ఆంగ్లంలో Juris Prudence (జ్యూరిస్ ప్రుడెన్స్) అంటారు. ప్రస్తుతం న్యాయవ్యవస్థ పాశ్చాత్య వలసవాద ఆంగ్లో సాక్సన్ (Anglo Saxon) జ్యూరిస్ ప్రుడెన్స్ ఉన్నదని, దానిని మార్చి భారతీయ న్యాయసూత్రాలను వివిధ పరిష్కార ప్రక్రియలో తీసుకురావాలని ఠేంగ్డేజీ వంటి పెద్దలు అభిలషించారు. దీనికై న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాస్త్ర పండితులను ఒకే తాటిపై తీసుకు వచ్చేందుకు పరిషత్ కృషి చేస్తున్నది.

వర్తమాన భారతీయ సమాజంలో వివిధ వర్గాల, సమూహాల ఆకాంక్షలు సరైన దిశలో నెరవేరాలంటే న్యాయవాద సిద్ధాంత ప్రక్రియ భారతీయ విలువల ఆధారంగా నడవాలి. అదే ప్రక్రియతో న్యాయ స్థానాలూ పనిచేయాలన్నది జాతీయవాదుల ఆకాంక్ష.

न्यायः मम धर्मः

ప్రతి దేశానికి కొన్ని మౌలిక విలువలు ఉంటాయి. ఆ విలువలే ఆ 'దేశ ఆత్మ'.

ఒక న్యాయసూత్రాన్ని ప్రతిపాదించి విశ్లేషించి, ఇక్కడి భారతీయ విలువల ఆధారంగా వివిధ అంశాలకు అన్వయించాలని, దీనిని సాధ్యం చేయాలంటే ఆలోచనా పద్ధతిలో మౌలిక మార్పు తీసుకురావాలని పరిషత్ ప్రయత్నం. కొత్తగా న్యాయ వాద వృత్తిలోనికి ప్రవేశించే వారికి మెలకువలు నేర్పించి దిట్టమైన న్యాయవాదులుగా రూపొందించి వారిని సమాజ సేవకు మళ్లించే పనిని పరిషత్ చేపట్టింది.

దేశవ్యాప్తంగా 600 జిల్లాలలో ఉన్న అధివక్తా పరిషత్, జాతీయవాద శక్తులు, సమాజంలో మంచికోసం ఆరాటపడే వ్యక్తులకు అండగా నిలిచే న్యాయవాద బృందాలను ఏర్పరచింది.

సమాజ కార్యం ఈశ్వరీయ కార్యం అన్న పెద్దల ఆలోచనకు అనుగుణంగా గోష్ఠులు, సృజనాత్మకత, సమావేశాల ద్వారా న్యాయవాదులను తీర్చిదిద్దే దిశగా పరిషత్ పని చేస్తున్నది. కార్యోన్ముఖులైన వారికి అండగా నిలవడం ప్రధానమైన పనిగా చేపట్టింది. భారతీయ తాత్త్విక చింతన ఆధారంగా న్యాయవ్యవస్థ పని చేసే వాతావరణాన్ని రూపొందించడం పరిషత్ ధ్యేయం.

– సమాచారి

శరత్

# వి'శేషయ్య' కథా కమామిషూ!

మన సమస్యలు ఎంత పెద్దవి! వల్లీశ్వర్ '99 సెకన్ల కథలు'లో ఇదో శీర్షిక. 'ప్రతి సమస్యకీ ఓ పరిష్కారం' అనేది ముఖచిత్రం పైభాగంలో టాప్ లైన్. ప్రధానంగా ఈ రెండూ ఆయన కలం బలాన్ని మనముందు ఉంచుతాయి. అట్టమీద తొలి భాగంలోని అక్షరాలు, దిగువ సగాన విస్తరించిన బొమ్మల పరంపరలు సృజన నిర్వహణను పట్టి చూపుతాయి.

వ్యక్తిగతంగా, వృత్తిపరంగా రచయితలో రెండు ప్రధాన లక్షణాలు. సూటిగా మాట్లాడటం, ధాటిగా రాయడం. అలా అని ప్రతిదీ వివరించి, వర్ణించి, పొడిగించి చెప్పరు. ఎక్కడికక్కడ విభజించుకుంటూ, కథాత్మకతను పరిపోషించుకుంటూ శ్రోతలను, చదువరులనూ ఆకట్టుకోవడమే ఆయన అలవాటు.

నిడివి పరంగా కథల రీతి పలు విధాలు. ఒకటిన్నర నిమిషంలోనే ఆసాంతం చదివించేలా ఉత్కంఠభరిత కథలు రాయడం సాహసమే. సరిగ్గా ఆ పనినే చేపట్టిన వల్లీశ్వర్ ఎంతగా ఆకట్టుకున్నారో స్పందనలే చెప్తున్నాయి.


రాజకీయనేతలు, సారస్వతవేత్తలు, సేవాతత్పరులు, ఆత్మవిశ్వాసుల గురించే ఇప్పటిదాకా ఆయన పుస్తకాలు రాశారు. భావాలనూ, అనుభవాలనీ పొందుపరిచి సామాజిక, ఆర్థిక అంశాలెన్నింటినో ప్రజలముందుంచారు. అవన్నీ ఒకెత్తు. 'సంచిక' వెబ్ పత్రికలో ప్రయోగంగా చేపట్టి, కథలు రాయడం మొదలుపెట్టి, ఆ వెంటనే 'ఎమెస్కో' కానుకగా తేవడమే మరొకెత్తు.

పలు ఆధ్యాత్మిక గ్రంథాలు వెలయించిన ఆయన, అదే స్ఫూర్తిని సెకన్ల కథలలోనూ మేళవించడం అన్నిటికన్నా ప్రత్యేకం. ఈ తరహా కథా విధానం అన్ని విధాలా విలక్షణమే.

ఇదివరకు ఎన్నడూ కథలు రాయలేదని అన్నారాయన. ఇప్పుడు కూడా ఇవి రాసినట్లు లేవు, మన పక్కనే ఉండి చెప్తున్నట్లు ఉన్నాయి. అందుకే శ్రీకాకుళం వేదికగా ఏర్పాటైన ఆవిష్కరణ సభలో ముందుగా పరిచయ వాక్యాలు విన్నవారంతా, పుస్తకం కోసం ఎంతగా తహతహలాడారో ప్రత్యక్షంగా చూశాను . ఏవో కొన్ని తప్ప, ఈ కథల శీర్షికలన్నీ విభిన్నం. ఎప్పుడూ ఎక్కడా చూసి/చదివి ఉండం. 'ఏరా నా మాయల మరాఠీ, మంథరలూ ఉంటారు, పెళ్లి పిల్ల తేల్చేసింది, సగం స్పృహ, మంత్ రోజుల్లో.., పులి-తేనె, గీతే గీతని నడిపిస్తుంది..' - వాటిల్లో కొన్ని. ప్రతి కథ - ఎంతగా చదివిస్తుందంటే...ఆ భాష, శైలి చాలాసేపు మనల్ని వెంటాడుతుంటాయి.

'సహజంగా పుట్టుకొచ్చిన నవ్వుకి, అసహజంగా పులుముకొన్న నవ్వుకి తేడా బాగా తెలిసిన వయసు, అనుభవం శేషయ్య గారిది' అని తొలి కథలోనే అంటారొక చోట. ఈ ఒక్క వాక్యంతోనే ఆ ఏక, ఏకైక మూలాధార నాయకుడి అంతరంగ తరంగాన్ని ఫొటో తీసినట్లయింది!

కథల ఎత్తుగడ దేనికదే వైవిధ్యం. 'అర్ధరాత్రి 2 గంటలయింది. 82 ఏళ్ల శేషయ్యగారి ఫోన్ మోగింది. అమెరికా నుంచి 30 ఏళ్ల మనవరాలు అరుస్తోంది' అంటారొక కథలో. అంకెల, సంఖ్యల ప్రస్తావనతోనే కథారంభం.




**99 సెకన్ల కథలు**
**రచన:** జి. వల్లీశ్వర్
**(ఫోన్:** 94404 46444)
**పేజీలు:** 272 **వెల:** రూ.175/-
**ప్రతులకు:** ఎమెస్కో బుక్స్ ప్రై.లి.
హైదరాబాద్, విజయవాడ.

అమెరికా నుంచి హైద్రాబాద్ వెళ్తున్న విమానాన్ని ఢిల్లీలో ఎక్కారు శేషయ్య- అనేది మరో తరహా ప్రారంభం.

'చదువు అబ్బలేదు. అయినా పరాంకుశానికి బతుకు తెరువు బాగా అబ్బింది' అని మొదలు పెట్టారు ఇంకో కథని. శీర్షిక: 'వాస్తు అంటదు!' (తనతో పాటు పాఠకుడిని కథా సామ్రాజ్యంలోకి తీసుకెళ్లడానికి ఎన్ని ప్రయత్నాలూ ప్రయోగాలూ చేయాలో అన్నీ చేసేశారు వల్లీశ్వర్).

ముగింపులోనూ అదే మెరుపు, విరుపు, రెండు కపోతాలు కథని 'మనోజ్ ఆలోచనలో పడ్డాడు' అంటూ ముక్తాయించారు. ఆ కపోతాలు ఏమిటి, అతడి యోచన దేని గురించి అనేది అంతర్లీనం.

శేషయ్య వంక చూసి, మనసుతోటే నమస్కారం చేశారు యువదంపతులు అనేది వేరొక కథ చిట్టచివరి వాక్యం. 'అంతరిక్షంలోకి ఎగరాలి' అనే ఆ రచన శీర్షికకి, ఈ మనోనమస్సుకీ లంకె తెలియాలంటే అంతా చదవాల్సిందే.

అలాగే 182వ పేజీతో ముగిసిన ఒక కథలో ఆఖరి పంక్తి 'కస్తూరి కళ్లు పశ్చాత్తాపాశ్రువులతో చెమ్మగిల్లాయి' అని. అనేక విధాల అశ్రువుల సమాచారం మనకు తెలుసు. మరి 'పశ్చాత్తాప అశ్రువులు' అనేమాట ఈ సాహితీవేత్త భాషా వైదుష్యానికి ఒకానొక సూచిక. అలనాటి మేటి మాటలు – దంతధావనం, అభ్యంగన స్నానం, అల్పాహారం వంటివాటినీ తనదైన ఈ కథా ప్రపంచంలోకి తెచ్చారు. అలుక్కుపోయిన నీళ్లు అనే పదాల్ని మీరెప్పుడైనా విన్నారా, చదివారా? వాటిని ఇదే సంపుటిలో చూడండి, చదవండి. కడుపు మంట వెంటాడటం అంటే ఏంటో కూడా కథాపరంగా ఇందులోనే చూసి తెలుసుకోవచ్చు.

తెలుగు భాష వైభవం, తెలుగు సిగ్గు పేర్లతో ఉన్న రెండు కథలూ ఆణి ముత్యాలు. పత్రికల వార్తల్లోని పదప్రయోగాలు, అక్షరదోషాలు, విపరీతార్థాలపైన చురకలున్నాయిందులో. ఆహుతులు (ఆహూతులు) సమిష్టి (సమష్టి) ఉచ్చారణ (ఉచ్చారణ).. ఇలా భాషను సర్వభ్రష్టత్వం పట్టిస్తున్న మీడియాను సంస్కరించాలనడం అంతరార్థం. ఒక తెలుగువాడు మరో తెలుగువాడిని చరవాణి సంఖ్య గురించి అడిగితే, ఆంగ్లంలో చెప్పడమే అలవాటైన తీరును 'వైభవం'లో ఎండగట్టారు. వీణ్ణి ఇంగ్లీష్ మీడియంలో వేస్తే తెలుగెలా వస్తోందని బడిపిల్లవాడి తల్లిదండ్రులు తలకిందులవుతారు 'సిగ్గు' కథలో. భాషా దినోత్సవాన సభలో తెలుగు పద్యాల్ని, ప్రశ్నలకు సమాధానాల్ని అలవోకగా చెప్తున్న అతడిని పెద్దలు అభినందిస్తారు. కన్నవారినీ వేదికపైకి పిలిచి సత్కరిస్తారు. అసలు రహస్యమేమిటో మనకు తెలిసేది పుస్తకమంతా చదివితేనే!

కథానుగుణంగా సంస్కృతశ్లోకాలు, ఇతిహాస సందర్భాలు వివరించడం శోభను మరింత పెంచింది.

హృదయం సువిశాలమైతే.. కథాశీర్షిక ఈయన రీతికి పరిపూర్తిగా వర్తిస్తుంది. విస్తృత ఆలోచన, తక్షణ కార్యాచరణ కలగలిసిన తత్వం కాబట్టే ఇప్పుడిలా కథాయోధుడయ్యారు.

అసలింతకీ ఆ శేషయ్య మీరేనా మహానుభావా?.. ★




# పర్యావరణ సమస్యలకు

పర్యావరణ మార్పుల ప్రభావం వల్ల ప్రపంచ దేశాలు తల్లడిల్లుతున్నాయి. ఒక్కో దేశం ఒక్కో రకంగా సతమతమవుతోంది. భూతాపం ఒక్కసారిగా పెరిగిపోవటం వల్ల మొట్టమొదటి సారిగా యూకేలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను దాటి పోయాయి. అమెరికాలోని కొన్ని ప్రాంతాలు గత ఏడాది వీచిన వేడిగాలుల వల్ల దావానాల ప్రభావానికి లోనయితే, మరికొన్ని హరికేన్ల బారిన పడ్డాయి. పాకిస్తాన్‌ను వరదలు, తూర్పు ఆఫ్రికాను కరవు, ఆహార కొరత వంటి సమస్యలు పీడిస్తున్నాయి. నైజీరియాలో వరదలకు 600 మంది మరణించారు. 1.3 మిలియన్ల మంది నిరాశ్రయులయ్యారు. మన దేశంలో 75 శాతం జిల్లాలు తీవ్రమైన పర్యావరణ ప్రభావానికి లోనవుతున్నాయని కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్మెంట్, వాటర్ (సీఈఈ) అధ్యయనం వెల్లడించింది. 2021 గ్లోబల్ క్లయిమేట్ రిస్క్ ఇండెక్స్ నివేదిక ప్రకారం, ప్రపంచంలో తీవ్రప్రభావానికి లోనయ్యే దేశాల్లో భారత్ ఏడో స్థానంలో ఉంది. పర్యావరణ ప్రభావం వల్ల ప్రజల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పసిపిల్లలు, వృద్ధులు అకాల మరణాల పాలవుతున్నారు.

ఈ ముప్పును అధిగమించటానికి ప్రపంచ దేశాలు సమష్టిగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు ఏ మేరకు బాధ్యత వహించాలి? అనే అంశంపై చర్చించేందుకు ఐక్యరాజ్యసమితి ఏటా పర్యావరణ సదస్సును నిర్వహిస్తోంది. ఆ క్రమంలో ఈ ఏడాది ఈజిప్టులో 27వ సదస్సు (కాప్ 27) నవంబరు 6 నుంచి 18 వరకూ షర్మ్ –ఎల్– షేక్‌లో నిర్వహించారు. 200 దేశాలకు చెందిన 35వేల మంది ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. వాతావరణ మార్పుల వల్ల ఎదురయ్యే 'లాస్ అండ్ డ్యామేజెస్'కు అభివృద్ధిచెందిన దేశాలు బాధ్యత తీసుకోవాలని, అవసరమైన ఆర్థిక సాయం అందించాలని ఈసారి సమావేశాల్లో ప్రముఖంగా చర్చ జరిగింది. సదస్సుకు ముందు 66 అభివృద్ధి చెందిన దేశాలు తమ 'లాస్ అండ్ డ్యామేజెస్'కు సంబంధించిన నివేదికలు సమర్పించాయి. ఏ రంగానికి ఎంత నష్టం సంభవించిందనే అంశంపై స్పష్టత లేదు. 2024కు ముందే ఒక అంచనాకు రావాలని పర్యావరణ నిపుణులు కోరుతున్నారు.

**కాప్ సదస్సులంటే..**

కాప్ అంటే.. కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీలు . ఇక్కడ పార్టీలు అంటే సదస్సుకు హాజరయ్యే దేశాలు. ఇవన్నీ కూడా 1992లో 'యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లయిమేట్ ఛేంజ్ ( యూఎన్‌ఎఫ్‌సిసి)పై సంతకం చేసిన దేశాలు. చమురు, బొగ్గు, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాలను కాల్చటం వల్ల ఉద్గారాలు విడుదలై భూమి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భూ ఉష్ణోగ్రతలు 1.1cకి పెరిగాయి. ఇవి 1.5కి చేరుకునే దిశగా సాగుతున్నాయని ఇంటర్నేషనల్ ప్యానల్ ఆన్ క్లయిమేటు ఛేంజి (ఐపీసీసీ)లోని ఐరాస శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు 1850లలో నమోదయిన స్థాయిని దాటి 1.7 నుంచి 1.8cకి పెరిగితే ప్రపంచ జనాభాలో సగం మంది ప్రాణాంతకమైన వేడి, ఉక్కపోతకు గురవుతారని ఐపీసీసీ అంచనా వేసింది. ఈ పరిస్థితిని అధిగమించి ఉష్ణోగ్రత 1.5c నుంచి పెరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనేదానిని చర్చించటమే పర్యావరణ సదస్సుల ప్రధాన లక్ష్యం. వీటిని కాప్ సదస్సులు అని పిలుస్తారు.

**అందరి చూపు భారత్ వైపు**

నరేంద్రమోదీ నాయకత్వంలోని భారత్‌కు ప్రపంచంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. దానికి తోడు ఈ ఏడాది డిసెంబరులో జీ–20 అధ్యక్ష హోదాను ఇండోనేసియా నుంచి భారత్ స్వీకరించ నుంది. భద్రతామండలిలో ఇప్పటి వరకూ తాత్కాలిక సభ్యత్వ దేశంగా ఉన్న కొనసాగుతున్న భారత్‌కు అధ్యక్ష స్థానం దక్కనుంది. అలాగే వచ్చే ఏడాది షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్సీఓ) ఛైర్మన్ షిప్ కూడా దక్కనుంది. ఈ నేపథ్యంలో కాప్ సదస్సులో భారత్ కీలకపాత్ర పోషించాలని చిన్న దేశాలు కోరుతున్నాయి. పర్యావరణ అంశానికి సంబంధించి భారత్ కొన్ని లక్ష్యాలకు కట్టుబడి ఉంది. మిగతాదేశాల మాదిరిగా గాంభీర్య ప్రకటనలు చేయకుండా సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకుని తన నిబద్ధతను ప్రకటించుకుంది. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంపు, ఉద్గారాల జీడీపీ సామర్థ్యం తగ్గింపు, అడవుల విస్తీర్ణాన్ని పెంచటం వంటి లక్ష్యాలను విధించుకుని ముందుకు వెళుతోంది.

**నిధుల సంగతేమిటి?**

వాతావరణ మార్పుల కట్టడికి అందిస్తున్న నిధులను మూడు భాగాలుగా చెప్పుకోవచ్చు. మొదటిది: మార్పుల తీవ్రతను తగ్గించటం కోసం, అంటే శిలాజ ఇంధనాలతో పాటు ఇతర కాలుష్య కారక చర్యలకు దూరంగా ఉండాలి. రెండోది : మార్పులను తట్టుకుని నిలబడటం కోసం..ఇక మూడో రకం నిధులు వివాదాస్పదమైనవి. వీటినే 'లాస్ అండ్ డ్యామేజ్ ఫైనాన్స్'గా పిలుస్తారు. ఇప్పటికే సంక్షోభం ఎదుర్కొన్న దేశాలకు పరిహారంగా ఈ నిధులు అందిస్తారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు 2020 నాటికి ఏటా వంద బిలియన్ డాలర్లు (రూలలో 8, 19,160 కోట్లు) వంతున నిధులు అందిస్తామని అభివృద్ధి చెందిన దేశాలు 2009లో అంగీకరించాయి. అయితే 2020 ఆ మొత్తం 83.3 బిలియన్ డాలర్లు (రూ.6,82,360 కోట్లు)కు చేరింది. 2023 నాటికి ఆ లక్ష్యం నెరవేరే అవకాశం ఉంది.




# మూలం సంపన్న దేశాలు

డాక్టర్ పార్థసారథి చిరువోలు

ఇప్పటి వరకూ కేవలం ఐదు యూరోపియన్ దేశాలు లాస్ అండ్ డ్యామేజెస్‌కు నిధులిస్తామని వాగ్దానం చేశాయి. అందులో జర్మనీ, ఆస్ట్రేలియా, బెల్జియం మొత్తం 220 మిలియన్ యూరోలు అందిస్తామని హామీ ఇచ్చాయి. అంతకు ముందు డెన్మార్క్, స్కాట్లాండ్ వరుసగా 13 మిలియన్ పౌండ్లు, 5 మిలియన్ పౌండ్లు ఇవ్వటానికి ముందుకొచ్చాయి. స్వీడన్ లాంటి కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు మాత్రమే నాయకత్వాన్ని ప్రదర్శించాయి.

అభివృద్ధి చెందిన దేశాలు సహజ ఉత్పాదకాలపై ముందస్తు హెచ్చరికలకు స్పందించి 800 మిలియన్ డాలర్లు గనక వెచ్చించగలిగితే, ఏటా 3 నుంచి 16 బిలియన్ డాలర్ల వరకూ నష్టాలను అధిగమించ గలరని వరల్ట్ మెటీరియాజి కల్ ఆర్గనైజేషన్ పేర్కొంది. ఇలా అభివృద్ధి చెందిన దేశాల 'లాస్ అండ్ డ్యామేజెస్' 2050 నాటికి ఒకటి నుంచి 8 ట్రిలియన్ డాలర్లకు చేరతాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

బొగ్గును ఇంధన వనరుగా ఉపయోగించటమే భూతాపానికి కారణమని గత ఏడాది యూకేలోని గ్లాస్గోలో నిర్వహించిన కాప్ 26 సమావేశం మొట్ట మొదటిసారిగా తేల్చింది. ఆ వినియోగాన్ని దశల వారీగా పూర్తిగా నిలిపివేయాలని వివిధ దేశాలు ప్రతిపాదించాయి. ఆ మేరకు భారత్, చైనా ప్రతిపాదించి అందులో మార్పులు చేశాయి. శిలాజ ఇంధనాల వినియోగాన్ని ఆపటమే వాతావరణ సమస్యల పరిష్కారానికి మార్గమని ఈ దఫా సదస్సులో భారత ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. భారత్ తన కర్బన ఉద్గారాల నియంత్రణకు 2070 వరకు తన దీర్ఘకాలిక ప్రణాళిక (రోడ్ మ్యాప్)ను ఈ సదస్సులో ప్రవేశపెట్టింది. కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశాలు త్వరితగతిన తమ లక్ష్యాలను చేరుకోవడానికి మరింత చొరవ చూపాలన్నారు. తన పర్యావరణ ప్రణాళికలను ఐరాసకు అందించిన దేశాల్లో భారత్ 57వ దేశం. పేదదేశాలకు ధనిక దేశాలు పరిహారం అందించటం అనే అంశం పైన చర్చించటం, బాధితుల పట్ల సంఘీభావాన్ని ప్రకటించినట్టవుతుందని కాప్ 27 అధ్యక్షుడు, ఈజిప్టు పర్యావరణ మంత్రి సమే షౌక్రి అభిప్రాయపడ్డారు. ఐరాస వాతావరణ ప్యానెల్ చీఫ్ హొసంగ్ లీ.. గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలకు అనుగుణంగా జీవించటం, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించటానికి కృషి చేయటం వంటి అంశాల గురించి ఆయన మాట్లాడారు. ఈ దఫా అమెరికా, చైనా అధికారిక చర్చలకు సిద్ధం కాలేదు గానీ, రెండు దేశాల ప్రతినిధులు జాన్ కెర్రీ, షునీ జూనూహా ఇందులో అనధికారికంగా చర్చలకు సిద్ధం కావటం విశేషంగా చెప్పుకోవాలి. యూఎస్ హౌస్ స్పీకరు నాన్సీ పెలోసి తైవాన్ సందర్శన అనంతరం గత ఆగస్టులో బీజింగ్ అన్ని రకాల చర్చలను నిలిపివేసింది.

గ్లోబల్ వార్మింగ్‌ను నియంత్రించేందుకు ప్రపంచం అంతా కర్బన ఉద్గారాలను తగ్గించవలసిన అవసరం ఉందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ సదస్సులో పిలుపు నిచ్చారు. ఆయన ప్రసంగానికి మంచి స్పందన వచ్చింది. పారిస్ ఒప్పందం మేరకు 2030 నాటికి తాము లక్ష్యాలకు కట్టుబడతామని చెప్పారు. తాము చేపట్టే చర్యల వల్ల ఉద్గారాలు 2030 నాటికి బిలియన్ టన్నులు తగ్గుతాయని చెప్పారు. ఇక ఉక్రెయిన్ అయితే, రష్యా ప్రకటించిన యుద్ధం వల్ల పర్యావరణానికి, మానవాళికి సంబంధించిన వినాశనాన్ని ప్రత్యేకంగా ఎత్తి చూపింది. దాదాపు రెండు డజన్ల మంది అధికారులు హాజరయ్యారు. భారీగా ఆయుధాలతో దాడులు, పెద్ద ఎత్తున సైన్యం కదలికల వల్ల భూమి, నీరు, వాయువుల కలుషితమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం వల్ల ఐదోవంతు రక్షిత భూమి నాశనమైందని, సాగు భూమి విషతుల్యం కావటం వల్ల 11.4 బిలియన్ డాలర్ల నష్టం సంభవించిందని చెప్పుకొచ్చారు. బ్రిటన్ ప్రధాని రుషిసునాక్ ఈ సమావేశాలకు హాజరై అర్థాంతరంగా వైదొలిగారు. ఇందుకు కారణాలు వెల్లడి కాలేదు.

**హైదరాబాద్ విద్యార్థికి అరుదైన అవకాశం**

హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థి అంకిత్ సుహాస్‌రావుకు ఈ సదస్సులో పాల్గొనే అరుదైన అవకాశందక్కింది. సదస్సుకు హాజరయిన వారందరి లోకి అతడు అత్యంత పిన్నవయస్కుడు. వ్యవసాయంలో స్థానికత గురించి ప్రముఖంగా ప్రస్తావించి అందరి మన్ననలు అందుకున్నాడు. స్థానికంగా సాగుకు అనుకూలమైన కాయగూరలు ఎంచుకోవాలని, వాతావరణానికి సరిపడనివి ఎంచుకున్నప్పుడు ఎరువులు, పురుగుమందులు ఎక్కువ అవసరం అవుతాయని ప్రకటించాడు. తన బృందంతో కలిసి 'గ్లోబల్ ఛైల్డ్ క్లయిమేట్ మేనిఫెస్టో' రూపకల్పనలో భాగస్వామి అయ్యాడు. 'ఇది నా జీవితకాల అనుభవం. సదస్సులో రైతు పక్షాన సుస్థిర వ్యవసాయం గురించి మాట్లాడటమే కాదు, తీవ్రమైన వాతావారణ మార్పులు మహిళలు, పిల్లలు, వెనకబడిన వర్గాల్లో కలిగించే దుష్ఫలితాల గురించి తెలుసుకోగలిగాను. ప్రస్తుతం అనుసరిస్తున్న వ్యవసాయ విధానాల వల్ల కలుగుతున్న వినాశానాన్ని అర్థం చేసుకోగలిగాను' అని సదస్సు అనుభవాలను పంచుకున్నాడు. షర్మ్ఎల్ షేక్ సమీపాన గల దహాబ్ బీచ్‌ను శుభ్రపరిచే కార్యక్రమంలో కూడా ఆ విద్యార్థి పాల్గొన్నాడు. అవినీతి, ఆర్థిక అస్థిరత్వం, పర్యావరణ మార్పులు వంటి అంశాల్లో మార్పులు తేగల శక్తి తమకు ఉందని తన బృందం తరఫున గట్టిగా చెప్పాడు.

ఈజిప్టులో నిర్వహించిన కాప్ 27 సదస్సులో ఎన్నో ప్రతిపాదనలు వచ్చాయి. అవన్నీ కార్యాచరణకు నోచుకున్నప్పుడే అనుకున్న పర్యావరణ లక్ష్యాలను సాధించటం వీలవుతుంది. ఇది చెప్పినంత తేలిక కాదు. చాలా దూరం ప్రయాణించాలి. ★

❋ పౌరాణికం ❋



# మహర్షులకే పూజనీయ

**దోర్బల పూర్ణిమాస్వాతి**

రామాయణంలో మనకు కనిపించే స్త్రీ పాత్రలలో మహాపతివ్రత అనసూయ ఒకరు. ఆమె అత్రి మహర్షి భార్య. వినయవివేకాలు ఆమెకు సహజ భూషణాలు. అనసూయ అంటే 'అసూయ లేనిది' అని అర్థం. ఆమె కర్దమ ప్రజాపతి, దేవహూతిల పుత్రిక. స్వాయంభువ మనువు మనుమరాలు. పతివ్రతా శిరోమణులుగా ఖ్యాతి పొందిన అరుంధతి మొదలగువారు ఆమె సోదరీమణులు. పతిసేవలో మక్కువ ఎక్కువ. ఆమె పతిభక్తికి మెచ్చిన అత్రిమహర్షి అష్టాక్షరీ మంత్రోపదేశం చేయగా, దాని ఉపాసనంతో యోగస్థితిని పొంది మహర్షులకు కూడా పూజనీయమైన మహోన్నత స్థానం పొందారు. ఆమె అత్రి మహర్షి భార్య.

శ్రీరాముడు వనవాసం సమయంలో కొంత కాలం అనసూయ వద్ద గడపాలని సీతకు సూచిస్తాడు. ఆ సమయంలో అనసూయ సీతను కన్న కూతురిలా ఆదరించి, పాతివ్రత్య ధర్మాలనేకం బోధిస్తుంది. సీత తిరిగి వచ్చేటప్పుడు ఎప్పటికీ మాసిపోని నారచీరలు, ఎన్నటికీ వాడని పుష్పాలు, ఎంత రాసుకున్నా తరగని సుగంధ లేపనాలు బహూకరిస్తుంది. అలా సాక్షాత్తూ లోకమాత సీతమ్మనే కన్న తల్లిలా ఆదరించింది అనసూయాదేవి.

**అంతకు నేపథ్యాన్ని పరిశీలిస్తే...**

వనవాస సమయంలో సీతారామ లక్ష్మణులు అత్రి మహర్షి ఆశ్రమానికి వెళ్లారు. వారు ఆశ్రమంలో అడుగుపెట్టగానే అత్రి కనపడ్డాడు. ఆయన భార్య అనసూయ గురించి అత్రి పరిచయం చేస్తూ... "నాభార్య అనసూయ చాలా ఖ్యాతి వహించింది. ఆమె మహాపతివ్రత. ఆమె అనన్యమైన తపస్సు చేసింది. ఎంత గొప్పగా తపస్సు చేసిందంటే.. పదేళ్ళు ఈ భూమి మీద పంటలు పండకపోతే తన తపశ్శక్తితో మూలాలను సృష్టించి జనులను పోషించింది. ఒకప్పుడు సాటి పతివ్రత సుమతి కోసం సూర్యచంద్రుల గమనాన్ని ఆపేసింది." అని చెబుతూ ఇంకా ఇలా అన్నాడు... "వృద్ధాం.. మహావృద్ధురాలు. అరటి చెట్టు గాలికి ఎలా ఊగిపోతుందో అలా ఊగిపోతోందిప్పుడు. మనిషి నిలబడలేదు. అక్రోధనాం సదా... ఆమె ఎన్నడూ క్రోధాన్ని పొందదు. ఆమె జీవితంలో 'కోపం' అన్నమాట లేదు...."

అలా సాధ్యమా.. కోపం లేకుండా ఉండగలమా!!

నిజానికి క్రోధం వలన ఈ లోకంలో ఏదీ సాధించలేరు. సాధన చేయగా చేయగా దానిని గెలవవచ్చు. దానికి రెండు మార్గాలు చెబుతుంది శాస్త్రం. అవతలి వారి మీద నీకు కోపం వచ్చింది. దేనికి కోప్పడాలనుకుంటున్నావ్... 'వాడు తప్పు చేశాడు'.. అని నీకనిపించింది కాబట్టి. మంచిదే. నువ్వెప్పుడూ తప్పు చేయలేదా... నువ్వెప్పుడూ తప్పు చేయలేదని త్రికరణ శుద్ధిగా భావిస్తే కోప్పడు. అలా తప్పు చేయకుండానే ఉన్నావా... వెనక్కి తిరిగి చూసుకో. ఎప్పుడో ఒక ప్పుడు తప్పు చేశావుగా.. మరి ఇంకొకడు తప్పు చేసినప్పుడు కోప్పడే అధికారం నీకు ఎక్కడుంది? కోప్పడకు.

రెండు.. కోపంతో సాధించేది తాత్కాలికం.




❋ తాత్వికత ❋

## తల్లీ నువ్వే తండ్రివీ నువ్వే

అదొక పాఠశాల. శివగురు అనే మాష్టారు దగ్గర విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో ఒకడు మరొకడి వస్తువు దొంగిలించి పట్టుబడ్డాడు. అతనిని గురువు గారి దగ్గర నిలబెట్టారు. 'దొంగిలించడం తప్పని నీకు తెలీదా?' శివగురు అతడిని అడిగారు. 'ఇక మీదట దొంగిలించన'ని అతను మాటివ్వడంతో గురువు క్షమించారు. మరో వారానికల్లా అతను ఇంకొకరి వస్తువు దొంగిలించి పట్టుబడ్డాడు. ఈసారి అతనిని క్షమించకుండా పాఠశాల నుంచి బహిష్కరించాలని తోటి విద్యార్థులు పట్టుబట్టారు. కానీ శివగురు ఈసారి కూడా 'దొంగిలించడం తప్పని తెలీదా?' అని అడిగారు శాంతంగా. ఆయన అలా అడగటం నచ్చని విద్యార్థులు 'గురువు గారూ! మీరతనిని బడి నుంచి బహిష్కరించాల్సిందే. మీరు అలా చేయకుంటే మేం ఈ బడి నుంచి వెళ్లిపోతాం' అన్నారు.

శివగురు 'మంచిది.. మీరందరూ వెళ్లిపోవచ్చు' అన్నారు అంతే ప్రశాంతంగా.

ప్రేమతో సాధించేది శాశ్వతం. నీకున్న అధికారంతో శాసించి, అవతలి వాడిని వశం చేసుకోవచ్చు అదీ తాత్కాలికమే. ప్రేమతో అవతలివాడిని నీ వాదనతో ఒప్పించు.... అది శాశ్వతం. అందుకే కోపం వల్ల ప్రయోజనం లేదు. మరటువంటప్పుడు ఈశ్వరుడు కోపాన్ని ఎందుకు సృష్టించినట్లు? అంటే అది కార్యసాధనకు ఉపకరణం. కొన్ని సందర్భాల్లో పరిస్థితులను చక్కదిద్దడానికి అది ఉపకరిస్తుంది. దానిని నీ అదుపులో పెట్టుకుంటే దానికి నీవు వశవర్తివి కావు, అది నీకు వశవర్తియై ఉంటుంది.

అనసూయమ్మ సాధించింది అదే. "రామా! ఈమె కోపం లేకుండా చేసిన అనేక కర్మల వలన విశేషమైన కీర్తి పొందింది. ఈమెను లోకమంతా కూడా బిరుదు

# అనసూయ

నామంగా పిలిచింది. లంకేశుణ్ణి సంహరించిన రాముడు పుష్పక విమానంలో సీతా లక్ష్మణ హనుమత్ సమేతంగా అయోధ్యకు వెళుతూ, సీతారాములు తాము వనవాస సమయంలో గడిపిన రోజులను నెమరువేసుకుంటూ ఉంటారు. ఆ ప్రయాణంలో అత్రి మహర్షి ఆశ్రమం కనిపించినప్పుడు ఆ పుణ్యదంపతులు ఇచ్చిన ఆతిథ్యం గురించి గుర్తు చేసుకోవడాన్ని బట్టి రామాయణంలో అనసూయ పాత్ర వైశిష్ట్యాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. ★

గురువుగారి నోట ఆ మాట వస్తుందని ఊహించని విద్యార్థులు నిశ్చేష్టులయ్యారు. అప్పుడు శివగురు 'మంచేదీ, చెడేదీ అని అర్థమయ్యేలా చేసేది విద్య. అది తెలుసుకున్న మీరు ఎక్కడికి వెళ్లినా మంచిమార్గంలో సాగుతారనే నమ్మకం నాకుంది. కానీ దొంగిలించడం మానేసేంత వరకూ నేనితనికి చెప్పవలసిన పాఠాలెన్నో ఉన్నాయి' అని చెప్పారు.

గురువుగారి మాటతో అందరూ మౌనంగా నిల్చున్నారు.

దొంగిలించిన విద్యార్థి 'మీరు నాకు గురువు మాత్రమే కాదండీ. ప్రేమ చూపించే తల్లీ, విజ్ఞానిచ్చే తండ్రీ మీరే' అని కన్నీరు పెట్టుకుంటూ తన తప్పు తెలుసుకుని ఆయన పాదాలకు నమస్కరించాడు.

శివగురు అతనిని క్షమించి దగ్గరకు తీసుకున్నారు. ★



# గిరిజనుల కల్పవృక్షం ఇప్పచెట్టు

ఇప్ప లేదా విప్ప పేరు వినగానే భద్రాచలంలో రాములవారి ప్రసాదమే గుర్తుకు వస్తుంది. ఎందుకంటే వనవాస సమయంలో సీతారామ లక్ష్మణులు ఇప్పపూలనే స్వీకరించారు. భారతదేశంలోని గిరిజనులు దీనిని పవిత్రంగా భావిస్తారు.రాజ్ గోండ్, కొలాం, ప్రధాన్, చెంచు, లంబాడా తెగలవారు తాము జరుపుకునే పండుగల సంబరాలకు ఇప్పపువ్వునే దేవుళ్లకు నైవేద్యంగా పెడతారు.

గిరిజనులు జరుపుకునే సంప్రదాయ వేడుకలు, సంబరాలు, పెళ్లిళ్ల సమయంలో ఇప్పపూలనుంచి తయారు చేసిన సారాను తాగడాన్ని ఆచారంగా పాటిస్తారు. ఇప్పపూలతో గిరిజనులు వివిధ రకాల రుచికరమైన ఏడాది పొడవునా నిల్వ ఉండే ఆహారపదార్థాలు తయారు చేసుకుంటారు. ఇప్ప కుడుములు, ఇప్ప జొన్న రొట్టె, ఇప్ప పూల గోంగూర, ఇప్పపూల మసాలా, ఇప్ప సత్తుపిండి, ఇప్ప లడ్డూలు, ఇప్ప జంతికలు, ఇప్ప మురుకులు ఇలా చెప్పుకుంటూ పోతే గిరిజనులు ఇప్పపూలతో చేసే వంటకాల రుచి బాగుంటుంది.



అడవి తల్లిని, ఇప్పచెట్టును నమ్ముకుని, పువ్వులు అమ్ముకుని జీవనం సాగిస్తున్న గిరిజనుల సంస్కృతిలో ఈ చెట్టు ఓ భాగమై పోయింది. కొండ ప్రాంతాల్లో విరివిగా పెరిగే ఈ చెట్లు అడవిబిడ్డలకు ఆదరవుగా మారాయి. వందల సంవత్సరాల నుంచి ఇప్పచెట్టు వారి పాలిట కల్పవల్లిగా మారింది.

విప్పపూలు సువాసన కలిగి ఉంటాయి. ఫలాలు కోలాకారంగా లేత ఆకు పచ్చ రంగులో ఉంటాయి. లేత పసుపు వర్ణం కలిగిన విత్తనాలు తెల్లటి గుజ్జును కలిగి ఉంటాయి. ఒక్కొక్క ఫలంలో ఒకటి నుండి నాలుగు వరకు విత్తనాలు ఉంటాయి. విత్తనాలు జనవరి నుండి మే మాసాంతం వరకు లభిస్తాయి.

విప్ప చెట్టు 15 నుండి 20 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. ఒక్కో చెట్టు ఏడాదికి 80 కిలోల వరకు ఇప్ప విత్తనాల దిగుబడి ఇస్తుంది. అదే పూలైతే 150 కిలోల వరకు లభిస్తాయి. అందుకే గిరిజనులు తాము నివాసముండే ప్రాంత సమీపాల్లో ఇప్పచెట్లు ఉండేలా చూసుకుంటారు. ఎండ బెట్టిన విప్ప పూలలో మాంసకృత్తులు, పిండిపదార్థం , ఖనిజ లవణాలు, పీచుపదార్థం, కాల్షియం, ఫాస్పరస్, కెరోటిన్, విటమిన్-సి, సక్రోజ్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పచెట్టు కలపను ఇంటి తలుపులు, గుమ్మాలు, కిటికీలు, ఎడ్ల బండ్ల చక్రాల తయారీలో వినియోగిస్తారు.

ఇప్ప విత్తనాల నుండి తీసిన నూనెను సబ్బులు, కొవ్వొత్తుల తయారీకి వినియోగించటంతో పాటు కీళ్ల నొప్పులు, చర్మరక్షణ తైలంగా వినియోగిస్తున్నారు. ఇప్పపువ్వులో పోషక విలువలు అధికంగా ఉండటంతో వాటిని ఇతర ప్రజలకు పరిచయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ★

## కథ

పదహారురోజుల పండగ చేసుకుని నాలుగు రోజుల క్రితమే అత్తగారింటికి వచ్చిన కొత్త కోడలు లావణ్య.

కొత్త కొత్తగా ప్రేమ పాఠాలు చెబుతున్న ప్రియ సఖుడితో చెట్టాపట్టాలేసుకుని, పొంగుతున్న పాలలో ఉండే వేడివేడి ఉత్తేజంతో ఈ ప్రపంచాన్ని చూస్తోంది. ఈ ప్రపంచంలో ప్రతీదీ మరింత మోహనమయంగా, ప్రేమమయంగా అగుపిస్తోంది.

రోజూ కూసే కోయిల కొత్తగా తనకోసమే పాడుతున్నట్టు, విరబూసిన మల్లెల సౌరభం తనతో ప్రేమ ఊసులు చెబుతూ తన ప్రపంచాన్నంతటినీ సౌరభాలతో ముంచెత్తుతున్నట్టూ, ఊహలకందని పరవశమేదో మనస్సుని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్టుగా ఉంది. చందమామని ఇన్నాళ్లు మరో రాతి గ్రహంగా భావించిన లావణ్యకి ఇప్పుడు అది చల్లని మెరుపుల ముద్దలా, తన హృదయంలోకి తీపి వెలుగుల్ని పంపిస్తున్నట్టుగా ఉంది.

లావణ్య మదిలో రేగుతున్న మధురోహలు ఆమెను మరింత లావణ్యవతిని చేస్తున్నాయి. ఆమెను అనుక్షణం పులకితను చేస్తున్న ఆమె ప్రియసఖుడు అనిరుధ్!

కోడలి అందచందాలు అత్తగారు వసుంధరని సంతోష తరంగిణిని చేస్తున్నాయి. సత్యనారాయణ వ్రతమప్పుడు పెళ్లికూతుర్ని మరీ దగ్గరగా చూసిన బంధువులూ, స్నేహితులూ అందరూ లావణ్యకి నూటికి నూరు మార్కులు వేసేశారు.

ఆ హడావిడి అంతా అయిపోయాక వసుంధరలో ఏదో తెలియని గుబులు మొదలయింది. కొత్త కోడలితో నిత్యకృత్యంలో సర్దుబాటు ఎలాగన్న విషయంలో.

ఆమెకి అప్పటికే పెద్దకోడలితో ఎదుర్కొన్న చేదు అనుభవం మరీమరీ గుర్తుకి రాసాగింది. ఇప్పుడు ఆ పిల్లకి ఒక్క పనీరాదు, నేర్చుకొని చెయ్యాలన్న ఉత్సాహం, కోరిక రెండూ లేవు. ఎప్పుడెప్పుడు కట్టుకున్న వాడి చేత వేరు కాపురం పెట్టేద్దామా అన్న ఒకే ఒక్క ధ్యాస తప్ప!

అందుకే చిన్న కోడలి విషయంలో కూడా ఎటువంటి కోరికలూ, ముచ్చట్లూ మనసులో పెట్టుకోకూడదని ముందే నిర్ణయించేసుకుంది వసుంధర. ఇంట్లో పనివాళ్లు ఉండటంతో ఏదో సామెత చెప్పినట్టుగా 'ఇటు చీపురుపుల్ల తీసి అటు పెట్టే' అవసరం లేదు. పెళ్లి సందర్భంగా ఉద్యోగానికి మూడు నెలలపాటు శెలవు పెట్టేసింది లావణ్య.

కొత్త కోడలు కళ్ల నిండా, ఒంటి నిండా మెరుపులతో నట్టింట్లో లక్ష్మీ దేవిలా తిరుగుతుంటే వసుంధరకి కన్నుల పండువలా ఉంది.

అదిగో– అటువంటి సందర్భంలో జరిగిందా సంఘటన!


వసుంధరకి ఇద్దరు పినతల్లులు, ఒక పెద్దమ్మ, వాళ్లలో ఇద్దరి భర్తలు, పినతల్లుల తోటికోడళ్లు ఇద్దరూ– మొత్తం ఏడుగురు– 'ఎల్లుండి ఉదయమే మీ ఇంటికి వస్తున్నాం' అంటూ ఫోన్ చేశారు.

అనిరుధ్ పెళ్లి సమయంలోనే వాళ్లందరూ తీర్థయాత్రలంటూ బయలుదేరారు.

తమ ఇంట్లో పెళ్లి సమయానికే ఇలా తీర్థయాత్రలు పెట్టుకోవటం ఏమిటని తను చాలా బాధపడుతున్నాననీ, మీలాంటి పెద్దవాళ్లందరూ వస్తే పెళ్లి వేడుకలకి వచ్చే నిండుదనం ఎంత అద్భుతంగా ఉంటుందో వర్ణించి చెబుతూ– ఆ వైభవం లేకుండా చేస్తున్నందుకు మీమీద కినుక వహిస్తున్నానంటూ ప్రకటించింది వసుంధర.

“నీ కొడుకు పెళ్లిని నువ్వు ఆగమేఘాల మీద ఏర్పాటు చేసుకున్నావ్! మేం ఈ తీర్థయాత్రల ఏర్పాట్లన్నీ రెండు మూడు నెలల క్రితం చేసుకున్నవి తల్లీ!” అని వాళ్లు మెత్తగా నచ్చజెప్పారప్పుడు.

'ఇప్పుడు అనుకోకుండా హైదరాబాద్ చేరుకుంటాన్నామనీ– మీ ఇంటికి వచ్చి నూతన వధూవరులకి ఆశీర్వాదం అందించి వెళ్తామ'నీ చెప్పారు.



# ఆత్మీయ వాత్సల్యాలు

దర్భా లక్ష్మీఅన్నపూర్ణ

వెంటనే వాళ్ల భోజనాలకి కావలసిన సరంజామా ఏర్పాటు చేసుకుంది వసుంధర. వాళ్లు వస్తున్నారన్న సంబరంలో అడుగు కాస్త వేగంగా వేసిందో ఏమో బాత్‌రూమ్‌లో జారిపడింది. డాక్టర్ దగ్గరకి వెళ్తే పట్టీ వేసి కనీసం నెల రోజులు బెడ్‌రెస్ట్ తీసుకోవాలన్నారు.

మరుసటి రోజు ఉదయమే ఆమె అనుంగు పిన్నమ్మలూ, బాబయ్యలూ వచ్చేది.

వారికి షడ్రశోపేతమైన భోజనాన్ని వండి వడ్డించటానికి వసుంధర కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకుంది. నిజం చెప్పొద్దూ–రుచికరంగా వంట చెయ్యటంలో వసుంధర మహా అందెవేసిన చెయ్యి. పదిమందికి వంట చెయ్యాలన్నా పరాచికాలాడుతూ మరీ– ఘుమఘుమలాడే వంటకాల్ని గుట్టుగానా అన్నట్టుగా సిద్ధం చేసెయ్యగల మహానేర్పరి! ఆప్యాయంగా కొసరి కొసరి వడ్డించి తినిపించటం కూడా మహా ఇష్టం. అందరూ తృప్తిగా భోజనం చేస్తే ఆమెకి తను తినకుండానే కడుపు నిండి పోతుంది. అటువంటి మహాఇల్లాలు వసుంధర.

అందుకే అందరికీ ఇష్టపాత్రురాలు!

ఆత్మీయతతో కూడుకున్న ఆ రుచులు అలవోకగా గొంతులోంచి జాలువారుతుంటే అప్రయత్నంగానే హృదయంలో ఆ అన్నపూర్ణేశ్వరికి పెద్దపీట వేసేస్తారు ఎంతో ఇష్టంగా.

అలాంటి వసుంధరకి తన పిల్లలమీద కురిపించటానికి ఆశీర్వాదాలు మూటలు కట్టుకుని ఆ అనుభవరత్నాలు తన పెళ్లి ఇంటిని పావనం చెయ్యబోతున్న వేళ తను ఇలా అర్థాంతరంగా అశక్తురాలయిపోవటం ఆవిడని కలవరపెట్టడమే కాకుండా కంగారు కూడా పెట్టేస్తోంది.

వసుంధర భర్త ప్రహ్లాదరావు తన మాటల్లో పరిహాసాన్ని, ధైర్యాన్నీ జోడిస్తూ 'నువ్వు స్వయంగా వాళ్లందరికీ వండి వడ్డించలేకపోతున్నందుకు కలవర పడుతున్నా వంటే అర్థముంది! కంగారు ఎందుకు? ఎక్కడో అక్కడ ఫుడ్ ఆర్డర్ చేద్దాం! నువ్వొండితే రెండు కూరలే చెయ్యగలవ్! అదే బయట ఆర్డరిస్తే నాలుగు కూరలు వడ్డించవచ్చు!'అని అనునయించాడు.

'అయ్యో! వాళ్లు అలా బయట వండిన పదార్థాలు తినరండీ! అందుకే కూడా వంటవాడిని తెచ్చుకుంటారు! నియమనిష్ఠలతో బతికేవాళ్లు వాళ్లు! మనలా కాదు! మనింటికి వచ్చి వ్రతభంగం అయిందనిపించుకోవాలా మనం?' వసుంధర బాధకి అంతులేకుండా పోయింది.

"మరేం చెయ్యమంటావ్ నన్ను? కొత్త కోడలా చిన్న పిల్లాయె! ఇప్పటి పిల్లలకి వంకాయేదో, బెండకాయేదో తెలియదు! ఆ అజ్ఞానాన్ని అదేదో గొప్ప వజ్రాభరణంలా మురిసిపోయే తల్లిదండ్రులు– ముఖ్యంగా ఈ కాలపు తల్లులు!" ప్రహ్లాదరావు ఆడవాళ్ల మీద ఎద్దేవేగా అన్నాడు.

''వజ్రాభరణమా... వన్‌గ్రామ్ గోల్డ్! ఏమయితేనేం గానీ... మనకెలాగూ ఆడపిల్లలు లేరు! ఇంతకీ వాళ్లకి భోజనాల ఏర్పాట్లు ఎలా చెయ్యటం?" వసుంధర కాస్త విసుగు ప్రదర్శించింది.

"ఇక వాళ్లే మనకి వండిపెట్టాలి! వాళ్లకోసం వండుకోవటమే కాకుండా!"

"ఆ వండి వడ్డిస్తారు! కూర్చుంటే లేవలేని స్థితిలో ఉన్నవాళ్లు!"

"సమస్యకి చక్కగా రంగులు పూస్తుంటే సరిపోదు! పరిష్కారం చెప్పాలోయ్! పరిష్కారం!" ప్రహ్లాదరావు తమాషాగా చిటికెలు వేస్తూ అన్నాడు.

"నాకేం తోచి చావకే కదా ఈ అఘోరింపంతా! పోనీ మీరయినా వండి పెడతారేమో అంటే మీకు తినటం తప్ప వంట రాదు!" భర్తకి కొసరి కొసరి వడ్డించే వసుంధర ఇప్పుడు బాధలో మాటలు వడ్డిస్తోంది.

"నీలాంటి అన్నపూర్ణేశ్వరి భార్యగా దొరికితే నాకు తినటం తప్ప వండటం ఎలా వస్తుంది చెప్పు!" భార్య మమకారం తలుచుకుంటూ ఒక్క క్షణం మైమరచి పోయాడు ప్రహ్లాదరావు.

మురిపాలు తర్వాత గానీ ముందున్నది కర్తవ్యం! ఏం చేద్దాం చెప్పండి!

"ఆయన ఒక్క క్షణం ఆలోచిస్తున్నట్టుగా మొహం పెట్టి ఆ తర్వాత 'వాళ్లే వండుకోవాలి! తప్పదు! కూడా ఉండి కూరలు తరిగివ్వటం దగ్గర్నుంచి అన్నీ చేస్తాం నేనూ, నీ కొడుకూ కలిసి! వంట సెక్షన్ మాత్రం వాళ్లది!"భరోసా ఇచ్చాడు.

భర్త మాటలతో వసుంధరకి కాస్త మనస్సు స్థిమితపడ్డట్టుగా అయింది. మళ్లీ అంతలోనే దిగులు మేఘాలు కమ్మేశాయ్ ఆవిడ వదనంలో. "మీకు కూరలు తరగటం అయినా సవ్యంగా వచ్చునా అని!"

దుర్యోధనుడి పాత్రలో ఎస్.వి.రంగారావు 'బానిసల కింత అహంభావమా!' అని చేతిని గమ్మత్తుగా తిప్పుతూ అద్భుత నటన ప్రదర్శించి నట్టుగా "నాపై ఇంతటి సందేహమా? ప్రతి మనిషికీ కామన్‌సెన్స్ అంటూ ఒకటి ఉంటుంది! అది అన్నిటినీ మించిన బ్రహ్మాస్త్రం!


"అవునండోయ్... చాలా మంది గుడ్డెద్దు చేలో బడినట్టు చెయ్యటానికే ఇష్టపడతారు!" వసుంధరకి కాస్త ఎక్కువ నమ్మకం కుదిరింది ఇప్పుడు. ఎలాగో అలా గట్టెక్కెయ్య వచ్చులే అనుకుంది.

"ఇంతకీ మన కోడలుపిల్ల ఎక్కడికి వెళ్లినట్టు?" భర్తని అడిగింది.

"ఇప్పుడు అలా బజారులోకి వెళ్లి వస్తాం అని చెప్పి వెళ్లారు"

"అలాగే ఉంటుంది లెండి! వాళ్లదేం బాధ్యత! అనుకునేందుక్కూడా లేదు! ఇప్పటి పిల్లల తీరు అలాంటిది!" వసుంధర తనలో తనే అనుకుంది.

చూడచక్కని పిల్ల దొరికింది. అదే అదృష్టం! ఈ రోజుల్లో! "నలుగురిలో కలిసిపోయే పిల్లని అందరూ ప్రశంసలు కురిపించి మరీ వెళ్లారు. పనీపాటలదేం





వుంది? ఇష్టమయితే నేర్చుకుంటారు. లేకపోతే లేదు! అనుకుంది.

చూద్దాం– ఏం జరుగుతుందో!

రాత్రి పడుకునే ముందు మర్నాడు వంట రణరంగంలో తామిద్దరూ కత్తులు పట్టువలసిన సంగతి గురించి కొడుక్కి చెప్పాడు ప్రహ్లాదరావు.

"నువ్వేం భయపడకమ్మా! నేనూ, నాన్నగారూ ఉన్నాం కదా! వచ్చిన వాళ్లకేం ఇబ్బంది కలగకుండా, నీకు చెడ్డపేరు రాకుండా చూసుకుంటాం కదా!" అనిరుధ్ తల్లికి ధైర్యం చెప్పాడు.

కొడుకు మాటలతో 'హమ్మయ్య' ఫరవాలేదు! అనుకుంది.

'పిల్లల్ని ఎప్పటికీ తల్లిదండ్రులు చిన్నవాళ్లుగానే భావించటం వల్ల వాళ్ల శక్తియుక్తుల్ని సరిగ్గా అంచనా వెయ్యలేకపోతారు. అనుకుంది మనస్సులో.

లావణ్య పడుకునే ముందు అత్తగారి దగ్గరికి వచ్చి అడిగింది "నేను ఏమయినా చెయ్యగలనా అత్తయ్యగారూ– వాళ్లకి హెల్ప్ చెయ్యటానికి!"

'అలా అడగటంతోనే అర్థం అయిపోతోంది నీకెంత పని తెలుసునో!' అని మనస్సులో మురిపెంగా అనుకొని పైకి మాత్రం "నీకింకా ఇటువంటి పనులు తెలియవులే! నెమ్మదిగా అలవాటు చేసుకుందువు గానిలే! ఇప్పుడు వాళ్లేదో తంటాలు పడతారులే!' అంది వసుంధర వాత్సల్యంగా.

సరేనని చెప్పి వెళ్లిపోయింది లావణ్య.

'పిల్ల మనసు మంచిది! అది చాలు! నెమ్మదిగా అన్ని పనులూ తనే నేర్చుకుంటుంది!' అనుకుంది మనసులో.

* * *

వసుంధరకి నిద్రపట్టడం లేదు. రేపు వాళ్లు వచ్చి భోజనాలు చెయ్యటం అయ్యేవరకూ తనకు కంటి మీదకి కునుకు రాదని అర్థమయిపోయింది. కళ్లు

**ఒక గంట తర్వాత మెలకువ వచ్చేసరికి పోపుల ఘుమఘుమలూ, చుఁయ్ చుఁయ్ మన్న శబ్దాలు వినిపిస్తుంటే ఇదేవిఁటి... వీళ్లు వంట కూడా కానిచ్చేస్తున్నారా ఏవిటి? అన్న సంభ్రమం ఓ ప్రక్క... స్నానం చెయ్యకుండానే వంట కానిచ్చేస్తున్నారా ఏమిటి ఖర్మ.... అడగరూ... పెట్టరూ అనుకుంటూ కొడుకునీ, భర్తనీ పిలిచింది. పిలిచిన తీరులో వాళ్లిద్దరూ ఆగమేఘాల మీద వచ్చి తన ఎదురుగా హాజరు కావాలన్న సందేశం ఉంది.**

మూసుకుని దైవ నామస్మరణ చేసుకుంటూ ఉండిపోయింది.

తెల్లవారుజామున నాలుగు గంటలయ్యేసరికి వంటింట్లోంచి శబ్దాలు వినిపించటం మొదలెట్టాయ్. తండ్రీకొడుకులు కూరగాయలతో కుస్తీ పట్టడం మొదలు పెట్టినట్టున్నారు అనుకుంది కించిత్ బాధగా. సమయానికి దేవుడు తనని ఇలా మంచం మీద కుదేసేశాడు! లేచి వెళ్లి చూద్దామన్న ఆతృత, ఆరాటం లోపల గడబిడ చేస్తున్నా మంచం మీంచి లేవలేని స్థితాయె! ఇటువంటప్పుడు నిశ్శబ్దంగా ఉండటమే తను వాళ్లకి చెయ్యగలిగే మహోపకారం అనుకుని మిన్నకుండి పోయింది వసుంధర.

ముగ్గురి మాటలూ వినిపిస్తున్నాయ్. పాపం లావణ్య కూడా లేచినట్టువుంది అనుకుంది సంతోషంగా.

కూరలు తరుగుతున్నట్టున్నారు – టక్‌టక్‌మన్న చాకుల శబ్దాలు!




వీళ్లన్నీ తరిగిపెట్టి ఉంచితే వాళ్లు స్టవ్ మీద చెయ్యవలసిన పనులు చూసుకుంటారు. పెద్దచిన్న వాళ్లని కష్టపెట్టవలసి వస్తోంది. ఏమిటో...! మళ్లీ వసుంధరని విచారం ఆవరించేసింది. ఆ దేవుడు ఇంకొక్క రెండురోజుల తర్వాత తన కాలు విరగ్గొట్టకూడదూ!

ఏం కూరలు తరిగారో–ఎలా తరిగారో– మధ్యలో వచ్చి చూపించవచ్చు కదా అని ఆత్రంగా అనుకుంది గానీ– వాళ్లు సరిగ్గా తరక్కపోతే తన మనసంతా పాడయిపోతుంది ఇప్పుడు! చెయ్య గలిగిందేం లేనప్పుడు నోరు మూసుకుని కూర్చోవటం ఉత్తమం అన్న నిర్ధారణకి వచ్చేసింది వసుంధర. అప్పుడు నెమ్మదిగా కునుకు పట్టింది.

ఒక గంట తర్వాత మెలకువ వచ్చేసరికి పోపుల ఘుమఘుమలూ, చుఁయ్ చుఁయ్ మన్న శబ్దాలు వినిపిస్తుంటే ఇదేవిఁటి... వీళ్లు వంట కూడా కానిచ్చేస్తున్నారా ఏవిటి? అన్న సంభ్రమం ఓ ప్రక్క... స్నానం చెయ్యకుండానే వంట కానిచ్చేస్తున్నారా ఏమిటి ఖర్మ.... అడగరూ... పెట్టరూ అనుకుంటూ కొడుకునీ, భర్తనీ పిలిచింది. పిలిచిన తీరులో వాళ్లిద్దరూ ఆగమేఘాల మీద వచ్చి తన ఎదురుగా హాజరు కావాలన్న సందేశం ఉంది.

ప్రహ్లాదరావు ముందుగా ఆవిడముందు ప్రత్యక్షం అయ్యాడు. ఒంటి చుట్టూ అటూ ఇటూ మలుపు కుంటుంటే 'ఏవయిందండీ?" అడిగింది వసుంధర.

"మీగడ తునకలు వంటినిండా అంటుకు పోయాయే!" అన్నాడు.

అప్పటికే భర్త నుదుటన విరాజిల్లుతున్న ఎర్రటి కుంకుమ బొట్టు తన సందేహాన్ని తీర్చేయటంతో చిన్నగా నవ్వేస్తూ "సరేలెండి వేళాకోళం గానీ... మీరు స్నానం చేశారో లేదో నన్న సందేహం వచ్చింది నాకు! పోపు వాసనలూ, శబ్దాలూ వస్తుంటే హడలి పోయాను!"

"సందేహ నివృత్తి అయిందా మరి! ఇక నేను నిష్క్రమించవచ్చునా?"

"అయినా మీకు రాని పని ఇప్పుడు ప్రయోగం చెయ్యటం ఎందుకండీ! వీటి రుచి ఎలా అఘోరి స్తుందోనని భయంగా ఉంది నాకు! పెద్దవాళ్లు– వాళ్లొచ్చి చూసుకుంటారులేండి! అన్నీ తరిగిపెట్టి సిద్ధం చేశారుగా!" మెత్తగా తన అయిష్టతని వ్యక్తం చేసింది.

"పోపు ఘుమఘుమలు చెప్పటం లేదూ–వంట ఎంత బ్రహ్మాండంగా సాగిపోతోందో!" ప్రహ్లాదరావు ప్రసన్నవదనంతో అన్నాడు.

"అవుననుకోండి...! కానీ!" ఆ ఘుమఘుమలను నిజంగానే కాదనలేక పోయింది వసుంధర.

"కానీ... ఏవిటీ బఠాణీ!"

"ప్రాస కుదిరింది గానీ సందర్భం కుదరలేదు!" వసుంధర వదనంలో కూడా ప్రసన్నత వెలిగింది.

"అమ్మా- నేను ఆనందం తట్టుకోలేక ఏడుస్తున్నానమ్మా! నువ్వు నాకు ఇరవై సంవత్సరాలు నిండగానే వంట నేర్చుకుని తీరాలని పట్టుబట్టి నప్పుడు, నాకిష్టం లేకపోయినా బలవంతంగా నేర్పించినప్పుడు నీ మీద కోపం వచ్చేది! మా అమ్మ మరీ రాక్షసిలాంటిదని తిట్టుకునేదాన్ని! ఒక ఆరునెలల పాటు ఇంటి ఖర్చులు, నిర్వహణ అంతా నా భుజాల మీదనే వేసినప్పుడు "అబ్బబ్బా! అమ్మకి చాదస్తం పెరిగిపోతోంది!" అని ఎన్నిసార్లు మనస్సులో విసుక్కున్నానో చెప్పలేను!



"ఒక్క గంట ఆగు! నా ప్రతాపం ఏమిటో చూపిస్తాను! అంతా కామన్‌సెన్స్ మహిమోయ్! ఇన్నాళ్ల నుంచి తింటున్నాను! ఈ జగత్తులో ప్రతి అణువునా ఆ విష్ణుదేవుడున్నాడని గ్రహించిన ప్రహ్లాద నామధేయుడ్ని... రోజూ తింటున్న పదార్థాల్లో ఏం వుండి ఉంటాయో తెలుసుకోలేనూ! నరసింహుడ్ని రాతి స్తంభంలో చూపించిన ప్రహ్లాదుడ్ని! కూరల్లోపల ఏం ఉంటాయో తెలుసుకోవటం నాకొక లెఖ్ఖా! ఖ వత్తుని మరీ గట్టిగా వత్తి పలుకుతూ అన్నారు.

వసుంధర పకపకా నవ్వేసింది. మనస్సు తేలిక పడిందేమో కాస్తంత- అందుకని! చాలా సమయం తర్వాత భార్య అలా నవ్వటం చూసి మురిపెంగా అడిగారు ప్రహ్లాదరావు గారు "ఎందుకోయ్ ఆ నవ్వు?"

"చెప్పమంటారా?" మళ్లీ ఆపుకోలేని నవ్వు!

"చెప్పమనేగా అడిగింది!"

"ప్రహ్లాదుడంటే ఎవరికయినా చిన్నపిల్లాడు గుర్తొస్తాడు! మీరేమో... ముసలి... ముసలి...!"

ముసలి తొక్కూ అంటావ్!

"అంతేగా మరి!"

"హమ్మయ్య! నువ్విలా నవ్వుతూ ఉంటే ఎంత పనైనా చిటికెలో చేసేస్తాం!" అంటూ వంటగదివైపు కదిలాడాయన.

మధ్యలో వసుంధరకి కాఫీ తెచ్చి ఇచ్చారు ఆయన.

ఇంకో రెండు గంటల్లో అనూహ్యంగా జరిగింది... ఆ... సంఘటన!

లావణ్య ఓ పెద్ద కంచంలో చిన్నచిన్న గిన్నెల్లో రెండు రకాల కూరలు, రెండు పచ్చళ్లు, సాంబారు పెట్టుకుని వచ్చి "అత్తయ్య గారూ... వంట సిద్ధం!" అంది.

వసుంధరకి ఆనందంతో కళ్లల్లో నీళ్ల చిప్పిల్లాయ్.

నమ్మలేనట్టుగా ఆ వండిన పదార్థాల వైపు చూస్తూ ఉండిపోయింది వసుంధర. ఇది కలా... నిజమా అని ప్రశ్నిస్తున్నాయ్ ఆవిడ కళ్ల సంభ్రమంగా!

"ఇంకో ఆశ్చర్యం చెప్పనా మరి... ఇవ్వన్నీ చేసింది లావణ్య! మేం ఊరికే కూరలు తరిగి ఇచ్చాం! అది కూడా తను తరిగి చూపిస్తే!" అన్నాడు వెనకాలే వచ్చిన ప్రహ్లాదరావు.

"ఇది... ఇది... నిజమా?" వసుంధరకి నోట మాట రానట్టుగా ఉంది.

లావణ్య అవునన్నట్టుగా నవ్వింది.

"ఎంతో అనుభవం ఉంటేనే గానీ ఇంతమందికి వంట చెయ్యలేదు! మరి నీకు...."

"మా అమ్మ నేర్పించిందత్తయ్య గారూ! నాకు ఇరవై సంవత్సరాలు దాటిన దగ్గర్నుంచీ ఇంటిని నడిపించటం ఎలాగో- వంట చెయ్యటం ఎలాగో అన్నీ అమ్మ నేర్పించింది!"

"నిజంగా!" వసుంధరకి ఆనందంతో కళ్ల నీళ్లు వచ్చేశాయ్.

లావణ్య అవునన్నట్టుగా కళ్లతో నవ్వింది.

"ఆవిడ అలా నేర్పించాలనుకోవటం నువ్వు నేర్చుకోవటం అన్నీ అద్భుతమే! ఒకసారి ఇలా నా దగ్గరగా రా తల్లీ!" అంది వసుంధర.

"అన్నపూర్ణాదేవిలా కనిపిస్తున్నావ్ తల్లీ!" అంది వసుంధర.

కాస్సేపటిలో ఇంటికి వచ్చిన పెద్దవాళ్లకి లావణ్య చకచకా మర్యాదలు చేస్తూ ప్రేమగా, చిరునవ్వుతో వండిన వంటల్ని ఆప్యాయంగా వడ్డిస్తూ ఉంటే....

వారి కనులలోంచి కురుస్తున్న ప్రశంసలజల్లులు, వారి మాటల్లోంచి ప్రవహించిన అభిమానపు వరద... లావణ్యని ముచ్చటగా ముంచెత్తి వేశాయ్.

"తల్లీ... నువ్వు చల్లగా పిల్లాపాపలతో మీ ఆయన అనురాగంలో హాయిగా ఉండాలంటూ" ఆ పెద్దవాళ్లు మళ్లీ మళ్లీ ఆశీర్వదించారు.

పైగా "ఇన్నిసార్లు ఆశీర్వదించినా మనస్సుకి తృప్తి దొరకటం లేదు తల్లీ! చదువుకుని ఉద్యోగం చేస్తూ కూడా ఇవన్నీ నీకెలా చేతనయ్యాయ్ తల్లీ! ఈ కాలప్పిల్లలు ఎప్పుడు ఫోన్ పట్టుకుని కూర్చోవటమో, చెవుల్లో అవేవో పెట్టుకుని ఈ ప్రపంచంతో సంబంధం లేనట్టుగా ఉండటమో చూశాం గానీ- తేనెధారల్లా నీ మాటల్లో కురుస్తున్న మర్యాదా, మన్నింపూ... ఆశ్చర్యంగా ఉంది తల్లీ!" అన్నారు.

"ఈ గొప్పదనమంతా మా అమ్మదేనండీ! మీ ఆశీర్వాదాల్లో చాలా భాగం మా అమ్మకే దక్కాలి!" హృదయం ఆనంద జలధియై పొంగుతూ ఉంటే అంది లావణ్య.

"చెప్పే పెద్దలు ఉన్నా వినే పిల్లలు ఉండొద్దూ!" అంటూ మళ్లీ లావణ్యకే పట్టం కట్టారు ఆ పెద్దవాళ్లు.

వచ్చిన పెద్దవాళ్ల ఆశీర్వాదాలు తన పిల్లలకి ఎంత బాగా చేరాయో తిలకించిన వసుంధర ఆనందానికి అవధులు లేవు!

వాళ్లు వెళ్తూ వెళ్తూ ఒకమాట అన్నారు "ఇంటి ఇల్లాలికి ప్రారంభంలోనే ఇటువంటి నేర్పు ఉంటే జీవితంలో ఆనందహర్మ్యాలను అలవోకగా నిర్మించుకోవచ్చు! ప్రతి ఇంట్లోనూ పెళ్లయిన కొత్తలో అత్తమామలతో సమస్యలు ప్రారంభమయ్యేది ఇక్కడే! పిల్లలకి పనిచెయ్యటం రానప్పుడు విసుగు పుడుతుంది. ఆ విసుగులోంచి ఎడమొహం పెడమొహం... ఇలా గొలుసులా అల్లుకుపోతాయ్ సమస్యలు! సమస్యలకి పరిష్కారం పనిలో నైపుణ్యతే!"

వింటున్న అందరికీ అది అక్షరాలా నిజమనిపించింది.

* * *

ఆరోజు రాత్రి తల్లికి ఫోన్ చేసి ఎన్నెన్నో మాటలు, కృతజ్ఞతలూ వెల్లువలా చెప్పాలనుకున్న లావణ్యకి దుఃఖం పొంగుకు వచ్చింది. ముందు తనివితీరా ఏడ్చేసింది.

అటువైపునున్న భాగ్యలక్ష్మి "ఇంకా అత్తగారింటికి వెళ్లి ఎన్నో రోజులవలేదు కదా! ఇంటిమీద బెంగతో ఏడుస్తోందిలే" అనుకున్న ఆవిడ కూతురి దుఃఖం తెప్పరిల్లేదాకా మౌనంగా ఊరుకుంది.


''అమ్మా- నేను ఆనందం తట్టుకోలేక ఏడుస్తున్నానమ్మా! నువ్వు నాకు ఇరవై సంవత్సరాలు నిండగానే వంట నేర్చుకుని తీరాలని పట్టుబట్టినప్పుడు, నాకిష్టం లేకపోయినా బలవంతంగా నేర్పించినప్పుడు నీ మీద కోపం వచ్చేది! మా అమ్మ మరీ రాక్షసిలాంటిదని తిట్టుకునేదాన్ని! ఒక ఆరునెలల పాటు ఇంటి ఖర్చులు, నిర్వహణ అంతా నా భుజాల మీదనే వేసినప్పుడు "అబ్బబ్బా! అమ్మకి చాదస్తం పెరిగిపోతోంది!'' అని ఎన్నిసార్లు మనస్సులో విసుక్కున్నానో చెప్పలేను! అయినా నువ్వు పట్టించుకోలేదు! నా పొగడ్తలనీ, మెప్పునీ ఆశించలేదు! నా విసుగునే భరించావ్!

ఇంటికి పదిమంది చుట్టాల్ని పిలిచి వంట బాధ్యతంతా నాకే అప్పగించేసే దానివి! అభ్యాసం కూసు విద్య అనేదానివి! అమ్మ రాక్షసి అని ఎన్నిసార్లు నాన్నగారితో నీమీద చాడీలు చెప్పానో లెక్కలేదు! నాన్నగారు నవ్వేసి ఊరుకునేవారు. కానీ అమ్మా! ఇవ్వాళ మా ఇంటికి వచ్చినవాళ్లు సాక్షాత్తూ నేను కాశీఅన్నపూర్ణాదేవిలా అనిపిస్తున్నానని అన్నారమ్మా! ఈ మాటలన్నీ నీకే ఇచ్చేస్తున్నానమ్మా.... అన్నీ నీకే!" ఉద్వేగంగా అంది లావణ్య!

భాగ్యలక్ష్మి హమ్మయ్య అని తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. ★

సుజాత గోపగోని, 6302164068

నవంబర్ 11, 12 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోదీఉభయ తెలుగు రాష్ట్రాల్లో పర్యటించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో, తెలంగాణలోని హైదరాబాద్, రామగుండంలో అధికారిక పర్యటన చేపట్టారు. అయితే, రెండు రాష్ట్రాల్లో ఆయనకు లభించిన స్వాగతం, ఆతిథ్యం పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఏపీలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అన్నీ తానై మోదీ పర్యటనను విజయవంతం చేసింది. ఓ రకంగా రాష్ట్ర బీజేపీ నేతలకంటే వైసీపీ నాయకత్వమే మోదీ పర్యటన కోసం తీవ్రంగా శ్రమించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. ప్రధాని విశాఖలో దిగినప్పటి నుంచీ తిరిగి వెళ్లేదాకా వెన్నంటే ఉన్నారు. అధికార యంత్రాంగం కూడా పూర్తిస్థాయిలో ప్రధాని పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమైంది. కానీ, తెలంగాణకు వచ్చేసరికి పరిస్థితి పూర్తి భిన్నంగా మారిపోయింది.




# సింగరేణిని ప్రైవేటీకరించం!

ప్రధాని పర్యటనను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అస్సలు పట్టించు కోలేదు. మోదీ రామ గుండంలో పర్యటించి ఫెర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ – (ఆర్ఎఫ్‌సీఎల్) యూరియా పరిశ్రమను జాతికి అంకితం చేశారు. ఆ పరిశ్రమలో రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా ఉంది. అయినా సీఎం అంటీ ముట్టనట్టు వ్యవహరించారు. కనీసం తన ప్రభుత్వం నుంచి ప్రాతినిథ్యం ఉండేలా కూడా చర్యలు తీసుకో లేదు. ఫలితంగా ప్రధాని పర్యటనలో తెలంగాణ సర్కారు ప్రాతినిథ్యం శూన్యంగా కనిపించింది. ఇక, అధికార యంత్రాంగం కూడా పెద్దగా పట్టించు కోలేదన్న అభిప్రాయాలున్నాయి.

దాదాపు వారం రోజుల పాటు ఈ అంశాలపై తీవ్రంగా చర్చ సాగింది. అయితే, మోదీ కూడా ఈసారి తన సహజశైలికి భిన్నంగా స్పందించారు. ఓ రకంగా గర్జించారనే చెప్పాలి. గతంలో పలుసార్లు కేసీఆర్ ప్రధాని పర్యటనలో పాల్గొనకపోయినా.. మోదీ మాత్రం ఎప్పుడూ నేరుగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. విమర్శలు కురిపించలేదు. కానీ కేసీఆర్ పదే పదే ప్రధానిని, తన పదవిని అవమానపరిచే విధంగా వ్యవహరి స్తుండటంతో ఈసారి మాత్రం మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. తీవ్రస్థాయిలో ప్రతిస్పందించారు. ఈ పరిణామం తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది.

మోదీ తెలంగాణలో రెండు బహిరంగ సభల్లో మాట్లాడారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో, రామగుండంలో ఆయన మాట్లాడారు. రెండు సభల్లోనూ టీఆర్ఎస్ పార్టీ పేరెత్తకుండా, కేసీఆర్ ప్రస్తావన రాకుండా ఆయన సీఎంపై విమర్శలు కురిపించారు. ఒకరకంగా చెమటలు పట్టించారు.

విశాఖలో రాజకీయాలు మాట్లాడని ప్రధాని నరేంద్ర మోదీ.. హైదరాబాద్‌లో విరుచుకుపడ్డారు. అవినీతి, కుటుంబ పాలన ఎంతో కాలం ఉండ దన్నారు. తనను రోజూ దూషిస్తున్నారని గుర్తుచేశారు. కానీ దానిని తాను శక్తిగా మార్చుకుంటున్నానని వివరించారు. ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇకపై మరొక లెక్క అన్నట్లుగా తెలంగాణ గడ్డపై మోదీ గర్జించారు. సూటిగా.. ఘాటుగా.. చెప్పాల్సింది చెప్పేశారు. చేయాల్సిన హెచ్చరికలు చేసేశారు. అసలైన ఆట మొదలైందన్నారు. ఇకపై యుద్ధం రసవత్తరంగా ఉంటుందంటూ సమరానికి సై అన్నారు. నేరుగా ఎవరి పేరు ఎత్తకపోయినా చేరాల్సిన వాళ్లకు చేరిపోయేలా సాగింది మోదీ ప్రసంగం. ఆయన మాటల్లో వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమనే ధీమా కనిపించింది.



**రాష్ట్ర ప్రభుత్వానిది తప్పుడు ప్రచారం**

సింగరేణిని ప్రైవేటుపరం చేసే ఆలోచన కేంద్రానికి లేదని స్పష్టం చేశారు మోదీ. సింగరేణిలో 51 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వానిదన్న ఆయన మెజార్టీ వాటా రాష్ట్రానిదైతే కేంద్ర ప్రభుత్వం ఎలా అమ్ముతుందని ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి కొందరు సింగరేణిపై తప్పుడు ప్రచారం చేస్తూ రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని అన్నారు. నకిలీ ఎరువులు, బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యల నుంచి రైతులను గట్టెక్కించేందుకు దేశవ్యాప్తంగా ఒకేలా 'భారత్' బ్రాండ్‌తో యూరియాను అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు. మునుగోడు ఉపఎన్నికలో ప్రజలు బీజేపీకి భరోసా ఇచ్చారని, ఒక అసెంబ్లీ సీటు కోసం తెలంగాణ సర్కారు మొత్తం మునుగోడుకు పోయిందని మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. తెలంగాణలో అంధకారం ఎక్కువ రోజులు ఉండదని, వచ్చేది బీజేపీ సర్కారేనని ధీమా వ్యక్తంచేశారు. గతంలో రేషన్ బియ్యం పక్కదారి పట్టేవని మోదీ గుర్తుచేశారు. కానీ ఆధార్ లింక్ చేసి అవినీతిని అడ్డుకున్నామన్నారు. రైతుల ఖాతాల్లోనే నేరుగా పీఎం కిసాన్ నిధులు వేస్తున్నామని తెలిపారు. రైతుల కోసం రూ. 10 లక్షల కోట్లు ఖర్చు చేశామని, రానున్న రోజుల్లో మరో రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నామని తెలిపారు.

రాష్ట్రంలో ఇప్పటికే టీఆర్ఎస్–బీజేపీ మధ్య పచ్చగడ్డి కూడా భగ్గుమనే పరిస్థితి ఉంది. తాజాగా మోదీ చేసిన వ్యాఖ్యలతో ఈ యుద్ధం మరింత రసవత్తరంగా మారనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# టీఆర్ఎస్‌ది రైతు వ్యతిరేక పాలన: బీకేఎస్




**భాగ్యనగరం:** రైతులు పండించిన ఉత్పత్తులను ప్రభుత్వాలు లాభసాటి ధరకు కొనుగోలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) అఖిల భారతీయ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా అన్నారు.

నవంబర్ 13న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 'రైతు గర్జన' బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభకు భారతీయ కిసాన్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జోగినపల్లి రంగారావు మార్గదర్శనం చేశారు.

ఈ సందర్భంగా మోహన్ మిశ్రా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి పంజాబ్, హర్యానాల్లోని రైతుల మీద ప్రేమ ఉంది. కానీ సొంత రాష్ట్ర రైతుల మీద లేదని అన్నారు. రాష్ట్రంలో పాలనంతా ఒక్క కేసీఆర్ కుటుంబం చేతిలోనే ఉందని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు వ్యతిరేకి అని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్వింటాల్ వడ్లకు 10 కేజీలు వేస్టేజ్ పేరుతో రైతుల్ని నష్టపరుస్తోందని ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వ కిసాన్ సమ్మాన్ నిధి పెంపు, వ్యవసాయ ఇన్‌పుట్స్‌పైన జీఎస్‌టీని తొలగించడమే లక్ష్యంగా డిసెంబర్ 16న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన 'కిసాన్ గర్జన'కు ఈ సందర్భంగా బీకేఎస్ పిలుపునిస్తున్నట్లు మిశ్రా పేర్కొన్నారు.

బీకేఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పర్యాద అంజిరెడ్డి మాట్లాడుతూ.. కూరగాయలు అమ్ముకునేవాళ్లకు వచ్చే ఆదాయం.. వాటిని పండించిన రైతులకు రావడం లేదని విచారం వ్యక్తంచేశారు. ఏదిఏమైనా రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ భూమి అమ్ముకోవద్దని సూచించారు. గత మూడేళ్లు రుణమాఫీ చేయని కేసీఆర్ ప్రభుత్వం రైతుల్ని అప్పుల్లోకి నెట్టిందని విమర్శించారు.

దేశంలో అన్ని వృత్తుల వాళ్లు సుఖంగా ఉన్నారు. ఒక్క రైతు మాత్రం కష్టం, దుఃఖం, అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నాడని అంజిరెడ్డి వాపోయారు. ఎన్నిక ఏదైనా అన్నదాత అభివృద్ధి కోసం పనిచేసే ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలని రైతుల్ని కోరారు. రైతులందరూ ఐక్యంగా ఉండటం ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అన్నదాతల సమస్యలు పరిష్కరించేందుకు, వారి హక్కుల సాధన కోసమే భారతీయ కిసాన్ సంఘ్ అహర్నిశం పనిచేస్తోందన్నారు.

జాతీయ కార్యదర్శి కొండెల సాయిరెడ్డి మాట్లాడుతూ భారతీయ కిసాన్ సంఘ్‌కి ఏ పార్టీతో సంబంధం లేదని, రైతు సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని అన్నారు.

కార్యక్రమంలో క్షేత్ర సంఘటన కార్యదర్శి దోనూరు రాము, అఖిల భారతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ ప్రభారి నానా ఆక్రే, నాగపూర్, అఖిల భారతీయ కార్యవర్గ సభ్యులు ముదుగంటి శ్రీధర్ రెడ్డి, అఖిల భారతీయ ఎఫ్‌పీఓ ప్రముఖ్ జె. కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పన్యాల వెంకటరెడ్డి, గైని నాగేశ్వర్, ఉడుముల లావణ్య, కోశాధికారి ఎల్. మాణిక్ రెడ్డి, కార్యదర్శులు, అంబీర్ ఆనందరావు, బోరంపేట మల్లారెడ్డి, దబ్బా రవి, ప్రచార ప్రముఖ్ త్యాగల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుండి సుమారు ఇరవై వేలమంది రైతులు ఈ సభకు హాజరయ్యారు. ★






కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో విశాఖపట్నానికి మహర్దశ పట్టనుంది. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎనలేని ప్రాజెక్టులను కానుకలుగా అందించగా, నవంబర్ 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనలో పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టులతో విశాఖ ఎగుమతుల హబ్‌గా మారి ఆదాయం పెంచుకుంటూ విశ్వనగరంగా రూపుదిద్దుకోనుంది. ఇది తెలుగువారికి మోదీ ఇస్తున్న గౌరవంగా మనం భావించాలి.

# విశాఖకు మహర్దశ!

కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన ఎనిమి దేళ్లలో ఏపీకి 8 లక్షల కోట్ల ప్రాజెక్టులను కేటాయిం చిన మోదీ వాటి ఆచరణలో కూడా తగిన ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోదీ, సీఎం జగన్‌తో కలిసి రూ.10,742 కోట్ల విలువైన 7 ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో రూ. 7,614 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్య క్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఇక రూ.7,619 కోట్లతో పనులు పూర్తి చేసిన ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేస్తూ దేశ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇదే వేదికపై విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుకై అవసరమైన కార్యాలయం నిర్మాణానికి రూ.106 కోట్లను



**తురగా నాగభూషణం**
**సీనియర్ జర్నలిస్ట్**

కేటాయించినట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

**ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి నిధులు**

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ, అప్‌గ్రేడేషన్‌కు పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు మొత్తం వ్యయం దాదాపు 150 కోట్ల రూపాయలు. దీంతో ఫిషింగ్ హార్బర్ సామర్థ్యం రోజుకు 150 టన్నుల నుండి 300 టన్నులకు పెరుగుతుంది. సురక్షితమైన ల్యాండింగ్, బెర్తింగ్, ఇతర ఆధునిక మౌలిక సదుపాయాలు జెట్టీలో వేచి ఉండే సమయాన్ని తగ్గిస్తాయి, వృథాను తగ్గించి ధరలు మెరుగుపరచడంలో సహాయపడతాయి.

ఉత్తరాంధ్రకు తలమానికమైన విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ (వి.ఎఫ్.హెచ్)కు మహర్దశ పట్టింది. సరికొత్త హంగులతో వీఎఫ్‌హెచ్ రూపురేఖలు మారనున్నాయి. రూ. 525 లక్షల పెట్టుబడితో విశాఖపట్నం పోర్ట్ ద్వారా 1976లో ప్రారంభమైన వీఎఫ్‌హెచ్ మత్స్యశాఖ నిర్వహణలో ఉంది. ఇది 24 ఎకరాల భూమిలో 1300 మీటర్ల వార్ఫ్ పొడవుతో ఉంది. 5 ఫిషింగ్ జెట్టీలు, 6 వేలం హాల్స్, 1 నెట్ మెండింగ్ హాల్, 24 మంది అధికారులతో కూడిన ఎగుమతి సేకరణ కేంద్రం, విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుండి 1300 ఫిషింగ్ వెసెల్స్, రోజుకు 150 టన్నుల చేపలు, 700 మెకనైజ్డ్ బోట్లు, 450 మోటరైజ్డ్ బోట్లు, 15 బీచ్ ల్యాండింగ్ క్రాఫ్టు, 150 మోటారు లేని సాంప్రదాయ క్రాఫ్ట వీఎఫ్‌హెచ్‌లో పని చేస్తున్నాయి. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటైనప్పటి నుండి సాధారణ మరమ్మతులు, నిర్వహణ మినహా పెద్దగా పెట్టుబడి లేదు. తాజా కేటాయింపులతో చేపలు పట్టడం, నిల్వ చేయడం, ఎగుమతులు మెరుగుపరచడానికి, అదనంగా 15,000 కుటుంబాలకు ఉపాధి కల్పించడానికి దోహదపడతాయి.

**ప్రాజెక్ట్ కీలక టేక్ అవేలు కింది విధంగా ఉన్నాయి:**

1. ప్రస్తుతం బోట్లను అప్‌లోడ్ చేయడానికి 2 గంటలు పడుతుంది. మొత్తం ప్రక్రియ మాన్యువల్‌గా ఉంది. ఇది 40 టైపాలతో ఆటోమేట్ చేస్తారు. ఇది చేపలను అప్‌లోడ్ చేయడానికి పట్టే సమయాన్ని తగ్గిస్తుంది.

2. చేపలను నేరుగా వేలం హాల్‌కు తరలించ డానికి కన్వేయర్ సిస్టమ్‌ను ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నారు.

3. పడవ నుండి వేలం హాలు వరకు యాంత్రిక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు.

4. ప్రస్తుతం ఫిషింగ్ హార్బర్ వద్ద బహిరంగ ప్రదేశంలో చేపలు ఎండబెడుతున్నారు. చేపలు

ఎండటానికి 23 రోజులు పడుతుంది. ఇప్పుడు చేపలు వేగంగా ఎండేందుకు 20 మెకనైజ్డ్ డ్రైయర్లు అమరుస్తారు.

5. 450 కేఎల్‌డీ సామర్థ్యంతో రెండు ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు అమరుస్తారు.

6. అమ్ముడుపోని చేపలను నిల్వ చేయడానికి చిల్ రూమ్ సౌకర్యం అందుబాటులో ఉంచుతారు.

7. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ వ్యవస్థ అభివృద్ధి చేస్తారు.

8. 50 టన్నుల నిల్వ సామర్థ్యంతో 900 చ.మీ. గల కోల్డ్ ఛాంబర్లను అభివృద్ధి చేస్తారు.

9. చేపల అమ్మకం కోసం ఇ-వేలం ప్లాట్ ఫామ్స్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.

**రైల్వేస్టేషన్‌కు కొత్త హంగులు**

దాదాపు 450 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టుకు ప్రధానమంత్రి మోదీ శంకుస్థాపన చేశారు. దీని ద్వారా ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సదుపాయాలు లభిస్తాయి. పునరాభివృద్ధి చేసిన స్టేషన్ రోజుకు 75,000 మంది ప్రయాణికుల అవసరాలు తీరుస్తుంది. ఈ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు నడిచేందుకు అత్యాధునిక స్కైవాక్‌లు ఉంటాయి. ప్లాట్‌ఫామ్స్ పైన డిపార్చర్ హాల్స్, కామన్ వెయిటింగ్ ఏరియాను నిర్మిస్తారు. ఈ రెండింటినీ కలుపుతూ రూఫ్ ప్లాజాను నిర్మిస్తారు. మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో పనిచేసే స్మార్ట్ పార్కింగ్ సిస్టమ్, రీటైల్, ఆఫీస్ స్పేసెస్, రిటైరింగ్ రూమ్స్, మెడికల్ ఎమర్జెన్సీ రూమ్ ఉంటాయి.

**రహదారులకు నిధులు**

ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రాయ్‌పూర్-విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్‌లో ఆంధ్రప్రదేశ్ విభాగానికి కూడా మోదీ శంకుస్థాపన చేశారు. రూ. 3,750 కోట్లకు పైగా వ్యయంతో దీన్ని నిర్మించనున్నారు. ఇది ఛత్తీస్‌గఢ్-ఒడిశా పారిశ్రామిక ప్రాంతాలకు, విశాఖపట్నం పోర్ట్, చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి వేగవంతమైన రవాణా సౌకర్యాన్ని అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశాలోని గిరిజన, వెనుకబడిన ప్రాంతాలకు రాయ్‌పూర్-విశాఖపట్నం రోడ్డు రహదారి సౌకర్యాన్ని మెరుగుపరుస్తుంది. విశాఖపట్నంలో కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలా నగర్ జంక్షన్ వరకు నిర్మించనున్న ప్రత్యేక పోర్టు రోడ్డుకు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఇది స్థానిక, పోర్టుకు వెళ్లే సరకు రవాణా వాహనాలను వేరు చేస్తుంది. దీనివల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. శ్రీకాకుళం-గజపతి కారిడార్‌లో భాగంగా జాతీయ రహదారి-326 ఏలో భాగంగా నరసన్నపేట నుంచి పాతపట్నం వరకు రూ.200 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన సెక్షన్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు.

**గ్యాస్ ఉత్పత్తి ప్రాజెక్టు ప్రారంభం**


ఆంధ్రప్రదేశ్‌లోని ఓఎన్జీసీ 2,900 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన యూ-ఫీల్డ్ ఆన్‌షోర్ డీప్‌వాటర్ బ్లాక్ ప్రాజెక్టును ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. రోజుకు దాదాపు 3 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల (ఎంఎంఎస్‌సీఎండీ) గ్యాస్ ఉత్పత్తి చేయగల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఇది అతి ఎక్కువ లోతు నుంచి గ్యాస్ ఉత్పత్తి చేస్తుంది. అలాగే 6.65 ఎంఎంఎస్‌సీఎండీ సామర్థ్యంతో గెయిల్ చేపట్టనున్న శ్రీకాకుళం అంగుల్ సహజ వాయువు పైప్‌లైన్ ప్రాజెక్ట్‌కు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. రూ. 2,650 కోట్లకు పైగా వ్యయంతో 745 కి.మీ. పొడవు గల పైప్‌లైన్‌ను నిర్మించనున్నారు. సహజవాయువు గ్రిడ్ (ఎన్‌జీజీ)లో భాగంగా చేపట్టనున్న ఈ ప్రాజెక్టు పైప్‌లైన్ ఆంధ్రప్రదేశ్, ఒడిశాలోని వివిధ జిల్లాల్లో గృహాలు, పరిశ్రమలు, వాణిజ్య యూనిట్లు, ఆటోమొబైల్ రంగాలకు అవసరమైన సహజ వాయువును సరఫరా చేయడానికి కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ సెక్షన్ 93 ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్‌లో సమాన విద్యావకాశాలు కల్పించేందుకు వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏర్పాటుచేయాలి. 10 ఏళ్ల కాలంలో వాటిని పూర్తిచేయాలి. నిర్ణయించిన గడువుకి ఇంకా రెండేళ్ల సమయం ఉన్నా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 11 విద్యాసంస్థలను ప్రారంభించింది. దాదాపుగా అన్నింటిలో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీ, మంగళగిరిలోని ఎయిమ్స్ రూపుదిద్దుకున్నాయి. గుంటూరులో వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపుదిద్దుకుంటోంది. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీడీఎం కర్నూలు, ఐఐఎస్‌సీఆర్ తిరుపతి వంటివి సొంత భవనాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఐఐఎం విశాఖపట్నం తాత్కాలిక భవనాల్లో సాగుతూ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ పనులు సాగుతున్నాయి. విశాఖలోని పెట్రో యూనివర్సిటీ, విజయనగరం జిల్లా సాలూరులో ట్రైబల్ వర్సిటీ నిర్మాణాలకు ఇటీవలే భూములు కేటాయించారు. పనులు ప్రారంభం కావాలి. ఎన్‌డీఎం కూడా నిర్మాణ దశలో ఉంది.

ఇవి కాక విభజన చట్టంలో లేని మరో పది సంస్థలను కేంద్రం ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) అర్బన్ కింద ఏపీకి 20, 71,776 ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో 17,43,613 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాగా, వీటిలో 4,92,247 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. పలు రకాల పథకాల కింద జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.లక్ష కోట్లు పెట్టుబడి పెట్టడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. ఇందుకు అనుగుణంగా ప్రాజెక్టు ఎంపిక కూడా పూర్తయింది. 2014 తర్వాత రాష్ట్రంలో 3,720 కి.మీ. జాతీయ రహదారులు అభివృద్ధి చెందాయి. విభజన చట్టంలో లేకున్నా పెట్రోలియం, సహజ వాయువుల రంగంలో ప్రభుత్వ రంగ సంస్థలు రూ. 1.40 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయి. ★



**ఇంటా బయటా, సైగలు, మాటలూ చేతలూ – ఏ రూపంలో ఉన్నా హింస హింసే! బాలికలు, యువతులు, మహిళలు, వృద్ధులు – ఏ వయసువారి మీద అయినా నేరం నేరమే! అది విశ్వవ్యాప్త సమస్య. స్థానికం నుంచి అంతర్జాతీయం దాకా నానాటికీ పేట్రేగుతున్న మహమ్మారి. ప్రాంతం, మతం, వర్గం, వర్ణం, భాష.. అదీ ఇదీ అని కాకుండా అన్నింటినీ, అంతటినీ దారుణంగా కబళిస్తున్న రక్కసి. దీన్ని నిలువెల్లా తుత్తునియలు చేయాలంటే నిత్య సమరం చేసి తీరాల్సిందే అంటోంది ఐక్యరాజ్యసమితి. నవంబర్ 25న ‘స్త్రీలపై హింసను నిరోధించే / నివారించే దినోత్సవం’. ఈ ఒక్క రోజునే కాకుండా, వరసగా కొన్ని రోజులపాటు సమరభేరీ మోగిస్తూనే ఉండాలంటుంది. ప్రచారోద్యమాన్ని రెండు వారాలకుపైగా విస్తరించి, డిసెంబర్ 10 వరకూ కొనసాగిస్తా మని ఇప్పటికే ప్రకటించింది. నిజానికిది వనితల సమస్త, సకల, హక్కుల పరిరక్షణ మహోద్యమం అని ఐరాస చెప్తోంది. వ్యక్తిగతంగా, సంస్థాపరంగా వనితల నేతృత్వాన్ని విస్తృతపరచి; హింసోన్మాదం అంతు చూస్తామని మరింత ప్రస్ఫుటం చేస్తోంది. నానావిధాలుగా దాపురిస్తున్న నేరం కోరల్ని ముక్కచెక్కలు చేయడానికి పౌరసమాజంలోని ఇతరులంతా చేతులు కలపాల్సిందే. క్షేత్రస్థాయి వాస్తవాలను పసిగట్టి, రూపుమార్చుకుంటున్న వాటిని ఎండగట్టి, మహిళాలోకానికి సంపూర్ణ భరోసా కలిగించడం ఎలా? మౌనం వీడి ముందుకొచ్చేలా చేయడమే ఏకైక మార్గం. నిగ్గదీసి అడుగు– దండించేలా చూడు!**



కాలిబాట అంటూ ఒకటుంది. అది సక్రమంగా నడవటానికి. చట్టం, న్యాయం, నడక, నడత అన్నీ సరైన మార్గాలు. వాటిలోని ఏ ఒక్కదాన్నీ పట్టించుకో కుండా ‘నా ఇష్టం నాదే’ అని విర్రవీగే వాళ్లకి కొదవలేదీ లోకంలో. గాలివాటుగా పోయే వాళ్ల చూపు మొదటపడేది ఆడపిల్లలపైనే! వావీవరసా ఏవీ ఉండవు. మంచిచెడుల తేడాలు తెలియవు.

# ఎంతకాలం ఈ

నెలల పసికందుల నుంచి ముసలమ్మల వరకు ఎవరినీ వదలరు. అలాంటి నేరగాళ్ల కళ్లు అమాయకులను వెదుకుతూ వెంటాడుతూ ఉంటాయి. అదను చూసి కసితీరా కాటేసే ఆ విషసర్పాల్ని ఎవరు కనిపెట్టగలరు? ఆలోచనలు వక్రం. మాటలు కుటిలం. చేతల్లో నంగనాచితనం. అవన్నీ కూడి ఎప్పుడు ఏ ప్రాణి ఉసురు తీస్తాయో, ఎవరి జీవితాల్ని ఎంతగా హరిస్తాయో చెప్పలేం. అసలు హింస అనేది ఎక్కడ ఏ విధంగా మొదలై కొనసాగుతుందో ఒక పట్టాన ఊహించలేం. అడుగడుగునా సుడిగుండాలే. వీటి నడుమ ఏ ఆడబిడ్డ చిక్కు పడుతుందో తెలుసుకోవడం కష్టతరమే. మునుపు డొమినికన్ రిపబ్లిక్ ప్రాంతాల్లో ముగ్గురు సోదరీమణులు రాజకీయ ప్రత్యర్థుల చేతుల్లో నిండు ప్రాణాలు కోల్పోయారు. అదే విషాద సూచికగా, అటువంటిది పునరావృతం కాకుండా హింస వ్యతిరేక దిన ప్రకటన వెలువడింది. అధికారిక తీర్మానం, వివిధ దేశాల సంతకాల స్వీకరణం దశాబ్దాల క్రితమే జరిగిపోయింది. ఐరాస ఆశయం ఎలా ఉన్నా, దేశాల్లో స్థితిగతులు వేరు. ఎందరెందరో స్త్రీల మనసుకు ఏ దశలోనూ గుర్తింపు ఉండటం లేదు. పైగా వారి గౌరవానికి భంగం కలిగించేవే తామర తంపరగా



జంధ్యాల శరత్‌బాబు

ఘోరాలకూ మూలకారణం మద్యపానం, పబ్‌లు, క్లబ్‌ల దుష్టసంస్కృతి సర్వాన్నీ భ్రష్టు పట్టించింది. శారీరక అవసరాలకీ ప్రాధాన్యమిచ్చే కొన్ని దేశాల తీరతెన్నులు, సామాజిక బాధ్యతను ఏనాడో విస్మరించిన చలనచిత్రాలు, వ్యసనగుణాన్ని వ్యాధిలా వ్యాపింపచేసే సామాజిక మాధ్యమాల వ్యవహారాలు తలా కొంత పాపాన్ని వరసబెట్టి మూటకట్టుకుంటున్నాయి. మద్యం క్రయ విక్రయాలు రెండూ కొనసాగుతున్నాయి. ఢిల్లీ, ముంబాయి తదితర మహానగరాల్లో బయటపడిన దురాగతాలు మొత్తం మానవతనే ప్రశ్నార్థకం చేస్తూ వచ్చాయి. పల్లెల్లోనైనా, పట్టణాల్లోనైనా సంఘటనలు ఎన్నటికీ మాయని మచ్చలుగా పరిణమించాయి. అవి హృదయ విదారకాలు, వ్యవస్థ ఘోర వైఫల్యానికి ఉదాహరణలు.

**ఈ ప్రశ్నకు బదులేదీ?**

ఆడవారి స్వేచ్ఛ, సమానత్వం గురించి అందరూ మాట్లాడతారు. ప్రచార ప్రసార సాధనాల సాక్షిగా రాజకీయులు, అధికారులు ‘ప్రవచనాలు’ గుప్పిస్తుంటారు. నీతిసూత్రాల తీరుతెన్నులు అటుంచి, బాధ్యతారహితులు చెలరేగుతూనే ఉన్నారు ఇళ్లల్లో హింస అనేది మామూలైపోయింది! ఎవరు ఎవరిని ఎన్ని విధాలుగా హింసించి చిత్రవధకు గురి చేస్తుంటారో లెక్క కట్టేదెవరు? వాస్తవం బయట పడినా; అది న్యాయస్థానాలకు చేరి, అవరోధులకు శిక్షలు పడిన సందర్భాలెన్ని? ఒకవేళ పడినా, చట్టాల నుంచి బహు చక్కగా తప్పించుకున్న వాళ్లు ఎంతమంది లేరు? అడపాదడపా దండనలు ఉంటున్నా, చాలా సమయాల్లో హింసలే ఎక్కువ. బాధితులు లేదా వారికి అండనందించిన వారు గొంతెత్తితే, మూయించడానికి ఎన్ని ‘ఏర్పాట్లు’ లేవు?

# హింస?

శారీరకంగా, మానసికంగా హింసల తీవ్రతను తట్టుకోలేక ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి కదా! ఇవన్నీ సమాధానాలు లేని, రాని ప్రశ్నలు. అన్నీ సమస్యలూ సందేహాలే. నిజమా! నీవెక్కడ అని ఆక్రోశించక తప్పని రీతి. నరకయాతనకు ఆనవాళ్లు లెక్కలేనన్ని. ఆఫ్ఘనిస్థాన్‌లో హింసాత్మక నేరాల సంఖ్య అధికం. కాంగోలో నమోదయ్యే అత్యాచార సంబంధ కేసులు మిక్కుటం. హత్యకు గురయ్యే వనితలు రష్యా, జమైకా ఇతర ప్రాంతాల్లో ఎంతోమంది. పలు విధాల గృహహింసలు పాకిస్థాన్, సోమాలియా పరిసరాల్లో తరచుగా చోటు చేసుకుంటుంటాయి. మన దేశంలోనూ గతంలోనే హింస నిరోధక చట్టం తెచ్చినా, ఫలితాలు అంతంత మాత్రం, అరాచకాల్ని సహించబోమంటూ కేంద్రం ఆ మధ్య చేపట్టిన చర్యలు కొంతవరకు ప్రభావం చూపించాయి. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమవంతు కర్తవ్య నిర్వహణలో ముందుంటున్నాయి. ఫ్రాన్స్‌లో ఎన్నెన్నో నిబంధనలు ఉన్నప్పటికీ ఆచరణపరంగా క్రియాశీలత తక్కువ. బొలీవియా వంటి చోట్ల బాధితుల బంధుమిత్రులు, సేవాసంస్థల కార్యకర్తలు కలిసి ఉద్యమిస్తున్నా ఆశించిన సత్వర ఫలితాలు స్వల్పమే. ఒక్కో ప్రదేశంలో ఒక్కో విధమైన వాతా‘వరణ’ పరిస్థితి!

**పాపం మూట కట్టుకున్నట్లే!**

వందల దేశాల్లో పలు రకాల పరిణామాల పరంపర. స్పెయిన్‌లోనైతే అతివలపై హింస రోజుకో రకంగా మారిపోతూ వస్తోంది. కొరియా, సౌదీ అరేబియా ప్రాంతాల్లో అక్రమ రవాణా రివాజుగా మారుతోంది. విదేశాల వైనం అలా ఉంటే; స్వదేశంలో అందునా కొన్ని రాష్ట్రాల్లో అవాంఛనీయం తాండవిస్తూనే ఉంది. నేర గణాంకాల నమోదు సంస్థ జాతీయ స్థాయిలో వెల్లడించిన వివరాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. లైంగిక వేధింపులు, అపహరణలు, అత్యాచారాలు, ఇతరత్రా నేరాలు నిరుడు మరీ ఎక్కువ. దాడులూ, దౌర్జన్యాలూ యాసిడ్ పోసిన సంఘటనలూ హింసాత్మక రీతులను ప్రస్ఫుటం చేస్తూనే ఉన్నాయి. పరువు హత్యల గురించి విడమరచి చెప్పాల్సిన పనేలేదు. ప్రాణాలు పోయేంతగా చేయడం, ఆ క్రమంలో అన్ని విధాలుగానూ హింసించడం పరిపాటిగా మారుతుండటమే దారుణాతిదారుణం, హేయాతి హేయం. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ, తమిళనాడు, కర్ణాటక, మరికొన్ని ప్రాంతాల్లో ఇటీవలి ఉదంతాలు గగుర్పాటు కలిగిస్తున్నాయి. షీ టీమ్‌లు, ఫ్రెండ్లీ పోలీస్ పద్ధతులను పదేపదే వల్లె వేస్తున్న తెలంగాణలో మహిళలకు పరిరక్షణ లోపించింది. ఒక దశలో – ‘హత్యా’చారాల రీత్యా మారుమోగాల్సి వచ్చిందా పేరు! అఘాయిత్యాలు, కట్నం వేధింపులు హెచ్చి, అదృశ్యం కేసుల దర్యాప్తు నత్తనడ కనసాగి ‘భద్రతా! నువ్వెక్కడ?’ అన్పించింది. ఆంధ్రప్రదేశ్‌లో సైతం అంతే. భౌతికదాడులు, మూకుమ్మడి దురాగతాలు, సాధింపులు హెచ్చి, అదృశ్యం కేసుల దర్యాప్తు నత్తనడకన సాగి ‘భద్రతా! నువ్వెక్కడ?’ అన్పించింది. ఆంధ్రప్రదేశ్‌లో సైతం అంతే. భౌతికదాడులు, మూకుమ్మడి దురాగతాలు, సాధింపులూ, వేధింపులూ పాపాల్లా పెరిగిపోయాయి. అత్యవసర సహాయం అందిస్తామన్న డయల్ 100 పలుమార్లు ప్రశ్నార్థ కంగా మారిందన్నది క్షేత్రస్థాయి సత్యం. రైల్వేస్టేషన్, ఆస్పత్రి వంటి చోట్లా అత్యాచారాలు సభ్య సమాజాన్ని నిశ్చేష్ట పరిచాయి. ‘మీ భద్రతే మా బాధ్యత’ అంటున్న పోలీసుశాఖ ఆచరణలో కనబరచింది ఏమిటన్నది ప్రశ్న.



**ఎవరి కోసమీ ఎదురుచూపు....**

ఏ రాష్ట్రంలోనైనా సరే, కేవలం ప్రభుత్వ ప్రకటనలతో రక్షణ ఊడిపడదు. క్రిమినల్ లా సవరణ చట్టాలు చేయడం మాత్రమే కాదు, ఆ నిబంధనల్ని పకడ్బందీగా అమలు జరపాలన్న కృతనిశ్చయమూ పాలకులకు ఉండాలి. నిర్భయ, దిశ, మనీషా సందర్భాలు ఏం చెప్తున్నాయి? లలనలపై నేరాలూ సంఘానికి అరిష్టాలే. మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపకపోవటం, ఏ నేరానికి ఏది శిక్ష అనేది బహిరంగంగా ప్రదర్శించకపోవటం రెండూ కూడా ప్రభుత్వాల తప్పిదాలే. సరిదిద్దుకోవాల్సిన పాలక పక్షాలు ఇంకా కళ్లు మూసుకుని నిద్ర నటిస్తూనే ఉంటున్నాయి. ప్రతిఘటించాల్సిన ప్రతిపక్షాలు ప్రచారాలూ హెచ్చరికలకే పరిమితమైపోతున్నాయి. సంస్కరణల పేరిట విద్యారంగాన్ని అన్ని రకాల మార్పు చేర్పులకూ లోనుచేస్తున్న సంస్థలు, సంఘాలు నీతిపాఠాల బోధనను మటుకు విస్మరిస్తూ వస్తున్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ధోరణులు కొన్ని... బాల్యం నుంచే పిల్లలకు క్రమశిక్షణ నేర్పలేకపోతున్నాయి. వీటన్నింటినీ సవ్యంగా మలుచుకుంటేనే, వనితలపై హింసకు అడ్డుకట్ట పడినట్లవుతుంది. ఎవరి కర్తవ్యం ఏమిటన్నది ఎవరికి వారికీ తెలుసు. అన్నీ తెలిసినా; ఎవరో వచ్చి ఏదో మంచి చేయాలని ఇంకా ఇంకా చూస్తుండటమే అసలు సమస్య!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# ప్రపంచ కప్‌లో భారత్ నిరాశ, పాకిస్తాన్ పేరాశ!

కంగారూ గడ్డపై సాగిన 2022 టీ-20 ప్రపంచకప్ అనూహ్య ఫలితాలు, పలు సంచలనాలు, అరుదైన రికార్డులతో ముగిసింది. టీ-20 రెండో ర్యాంకర్ ఇంగ్లండ్ 12 సంవత్సరాల విరామం తర్వాత రెండోసారి ఐసీసీ ట్రోఫీ అందుకోవడం ద్వారా అరుదైన ఘనతను సొంతం చేసుకుంటే, పాకిస్తాన్ మరోసారి రన్నరప్ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక భారత్ సెమీఫైనల్లో ఓడినా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్ రికార్డుల మోత మోగించగలిగారు.

ప్రపంచ కప్ ప్రారంభానికి ముందు ఆతిథ్య ఆస్ట్రేలియా, టాప్ ర్యాంకర్ భారత్, పాకిస్తాన్ హాట్ ఫేవరెట్‌గా నిలిచాయి. అయితే, ఏ మాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన ఇంగ్లండ్ మాత్రం అందరి అంచనాలు తలకిందులు చేయటం ద్వారా 2010 తర్వాత మరోసారి టీ-20 ప్రపంచకప్‌ను



అందుకోగలిగింది. క్వాలిఫైయింగ్ దశలోనే రెండుసార్లు విజేత వెస్టిండీస్ నిష్క్రమిస్తే, డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా సూపర్ లీగ్ దశ నుంచే వైదొలిగింది. మాజీ చాంపియన్ శ్రీలంక, దక్షిణాఫ్రికా జట్లు సైతం నాకౌట్ రౌండ్ చేరుకోడంలో విఫలమయ్యాయి. సూపర్-12 గ్రూప్-2 టాపర్‌గా సెమీస్‌లో అడుగుపెట్టిన భారత్ నాకౌట్ రౌండ్లో ఇంగ్లండ్ చేతిలో 10 వికెట్ల ఘోరపరాజయం చవిచూసింది. గతేడాది రన్నర్ న్యూజిలాండ్‌కు తొలి సెమీఫైనల్లో పాకిస్తాన్ చేతిలో ఓటమి తప్పలేదు.

టీ-20 ప్రపంచ కప్ అంటేనే బ్యాటర్ల హోరు, జోరు. బౌలర్ల పాత్ర అంతంత మాత్రమే. 2007 ప్రారంభ ప్రపంచ కప్ నుంచి 2021 వరకూ బ్యాటర్లే రాజ్యమేలుతూ వచ్చారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డులు గెలుచుకుంటూ వచ్చారు. అయితే, ప్రస్తుత ప్రపంచకప్‌లో మాత్రం ఇంగ్లండ్ లెఫ్టామ్ పేస్ బౌలర్ సామ్ కరెన్ చరిత్రను తిరగరాశాడు. ఓ స్పెషలిస్ట్ బౌలర్ సైతం ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలువగలడని చాటి చెప్పాడు. సామ్ కరెన్ మొత్తం ఏడు మ్యాచ్‌ల్లో 13 వికెట్లు పడగొట్టడం ద్వారా ప్లేయర్ ఆఫ్ ది ప్రపంచ కప్ టోర్నీ, ఫైనల్లో 4 ఓవర్లలో 12 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టడం ద్వారా ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్స్ అవార్డులు కైవసం చేసుకున్నాడు.

**భారత్‌పై పాక్ అక్కసు!**

ఈర్ష్య, అసూయ, ద్వేషం, కడుపుమంట, ఆక్రోశం, పొరుగుదేశం పచ్చగా ఉంటే చూడలేనితనం.. వీటన్నిటికీ పర్యాయ పదమే పాకిస్తాన్. ఆ దేశ మాజీ క్రికెటర్ల నుంచి ప్రధాని వరకు భారత క్రికెట్‌పై పదే పదే అక్కసు వెళ్లగక్కుతూ చిల్లరతనాన్ని చాటుకుంటున్నారు.

ప్రస్తుత పాక్ జట్టులోని ఆటగాళ్లందరికీ భారత క్రికెటర్లంటే ఎంతో గౌరవం. కానీ ఆ దేశ క్రికెట్ పెద్దలు, కొందరు మాజీ క్రికెటర్లు ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తారు. రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్ చేతిలో 10 వికెట్ల తేడాతో భారత్ ఓటమిపాలైతే పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ రమీజ్ రాజా, మాజీ క్రికెటర్లు షోయబ్ అక్తర్, డానిష్ కనేరియా నుంచి దేశ ప్రధాని షెబాజ్ షరీఫ్ వరకూ పలు విధాలుగా భారత క్రికెట్‌పైన, క్రికెటర్లపైన వ్యాఖ్యలు చేస్తూ పైశాచిక ఆనందంతో గాల్లో తేలిపోయారు.

**పాక్ ప్రధాని దిగజారుడు వ్యాఖ్యలు**


ప్రపంచ కప్ ఫైనల్స్‌కు మూడోసారి పాకిస్తాన్ అర్హత సాధించడం.. అదే సమయంలో భారత జట్టు సెమీస్ నుంచే ఇంటిదారి పట్టడంతో పాక్ క్రికెటర్లు మినహా మిగిలిన వారందరికీ పట్టపగ్గాలు లేకుండా పోయాయి. తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై తమ జట్టు సాధించిన వికెట్ నష్టపోకుండా 152 పరుగులు, భారత్‌పై ఇంగ్లండ్ సాధించిన 170 పరుగుల స్కోర్లతో పాకిస్తాన్ ప్రధాని షెబాజ్ షరీఫ్ తమ కెప్టెన్ బాబర్ అజమ్‌కు పంపిన ట్విట్టర్ సందేశం కలకలం రేపింది. 2021 ప్రపంచ కప్‌లో భారత్‌ను పాకిస్తాన్ చిత్తు చేసిందని, మెల్బోర్న్ వేదికగా జరిగే ప్రపంచ కప్ టైటిల్ సమరంలో 152/0తో 170/0 జట్లు తలపడబోతున్నాయంటూ ట్వీట్ చేశారు. భారత క్రికెట్ జట్టును ఎద్దేవా చేస్తూ స్వయానా పాక్ ప్రధానే ట్వీట్ చేయడం విమర్శలకు దారితీసింది.

భారత జట్టు సెమీఫైనల్లో ఓడితే, పాక్ బోర్డ్ చైర్మన్ రమీజ్ రాజా వందల కోట్ల రూపాయల భారత క్రికెట్ జట్టు సెమీఫైనల్లోనే చతికిలపడిపోయిందంటూ చిల్లర వ్యాఖ్య చేశాడు. పాక్ మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ కూడా భారత క్రికెట్ జట్టును తక్కువ చేస్తూ మాట్లాడాడు. జింబాబ్వే, నెదర్లాండ్స్ లాంటి పిల్ల జట్లపై నెగ్గడం ద్వారా భారత్ సెమీఫైనల్స్ చేరిందని; దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ లాంటి పెద్ద జట్లతో ఆడిన సమయంలో సరుకు లేదని తేలిపోయిందంటూ ఎద్దేవా చేశాడు. భారత జట్టులోని మెగా క్రికెటర్లంతా వెలవెలపోయారని, పసలేని బౌలింగ్‌తో భారత్ ఫైనల్ చేరాలని, విశ్వవిజేతగా నిలవాలని కోరుకోడం ఏమిటంటూ ప్రశ్నించాడు.

**ఇర్ఫాన్ పఠాన్ కౌంటర్**

భారత క్రికెట్‌పై పాక్ ప్రధాని అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని భారత మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ తప్పుపట్టాడు. 1992, 2022 ప్రపంచ కప్ టోర్నీలో పాక్ అదృష్టం కలిసొచ్చి దొడ్డిదారిన సెమీస్ చేరిందని, ఆ రెండు ప్రపంచ కప్ టోర్నీల్లోనూ భారత్ చేతిలో పాక్ పరాజయాలు చవిచూసిన తీరును గుర్తుంచుకోవాలని పఠాన్ సూచించాడు.

భారత్‌కు, పాక్‌కు ఎంతో తేడా ఉందని, పొరుగు జట్టు విజయాలు సాధిస్తే భారత క్రికెటర్లు అభినందిస్తారని, అదే పాకిస్తాన్ పెద్దలు, వ్యాఖ్యాతలు, చివరకు దేశ ప్రధాని సైతం దానికి భిన్నంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డాడు. జయాపజయాలు ఆటలో భాగమన్న వాస్తవాన్ని గ్రహించాలని కూడా సూచించాడు. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్



అరుణ

గత కొద్ది కాలంగా లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తున్న సమంత నటించిన తొలి పాన్ ఇండియా మూవీ 'యశోద'. కాస్మొటిక్ మాఫియా నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. సినిమా టీజర్, ట్రైలర్ చూసినప్పుడు ఇదేదో సరోగసీ బ్యాక్ డ్రాప్ మూవీ అనే భావనను దర్శక నిర్మాతలు కలిగించినా, దానిని మించిన ఓ మెడికల్ రాకెట్‌ను ఇందులో చూపించారు.

# కాస్మొటిక్ మాఫియా నేపథ్యంలో యశోద

చిత్రం ఏమంటే.. ఈ సినిమా విడుదలకు ముందు కథానాయిక సమంత అనారోగ్యం పాలైంది. ఐదు భాషల్లో భారీ స్థాయిలో దేశ వ్యాప్తంగానూ, విదేశాలలోనూ విడుదల కాబోతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఆమె పాల్గొనలేని పరిస్థితి. ఆమె టైటిల్ రోల్ ప్లే చేసిన మూవీకి ఇలాంటి ఇబ్బంది రావడంతో అరాకొరా ప్రచారంతోనే జనంలోకి తీసుకెళ్లిపోయారు నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్. సమంత కేవలం ఒకే ఒక్క ఇంటర్వ్యూ ఇచ్చింది. ఆ సందర్భంగా తన అనారోగ్యం, దాని పర్యవసానాలు చెప్పి కన్నీరు పెట్టుకుంది. అది తురుపు ముక్కలా పనిచేసింది. ఆ మధ్య నాగచైతన్య, ఆమె విడిపోవడంతో ఏర్పడిన సానుభూతి పవనాలు, ఇప్పుడీ అనారోగ్యం మీదుగా సాగి థియేటర్లలో పాజిటివ్ టాక్‌కు కారణమైనట్టు తెలుస్తోంది. అయితే కేవలం సానుభూతితో సినిమాలు ఎప్పుడూ గట్టెక్కవు. కథలో దమ్ము ఉండాలి, కథనం ఆసక్తికరంగా సాగాలి. ఆ రెండూ కూడా 'యశోద'కు సమకూర్చారు నూతన దర్శకులు హరి, హరీశ్. దాంతో ఈ పాన్ ఇండియా మూవీ పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది!

కథ విషయానికి వస్తే.. ఇదో సస్పెన్స్ థ్రిల్లర్. వరలక్ష్మీ శరత్ కుమార్ నిర్వహించే ఇవా సెంటర్ ప్రధాన కేంద్రంగా ఇది నడుస్తుంది. ఓ రాజకీయ నాయకుడు, సైంటిస్ట్, కొంతమంది వైద్యుల సహకారంతో ఈ ఇన్‌స్టిట్యూట్ సాగుతూ ఉంటుంది. సరోగసీ ద్వారా బిడ్డను కని ఇవ్వడానికి అంగీకరించిన యశోద (సమంత) ఆ సంస్థ నియమ నిబంధనలను అంగీకరిస్తూ అందులో వైద్యం చేయించుకుంటూ ఉంటుంది. అయితే నెలలు నిండిన తర్వాత అక్కడి మహిళలు ఆచూకీ లేకుండా పోతుంటారు. వారికి ఏమైంది? వారికి పుట్టబోయే బిడ్డల స్థితి ఏమిటనేది మిస్టరీగా మారుతుంది. మరోపక్క విదేశాల నుండి వచ్చిన ఓ ప్రముఖ నటి ఇండియాలో చనిపోవడంతో పోలీస్ అధికారులు దర్యాప్తు చేస్తుంటారు. ఆ మరణం వెనుక ఎవరున్నారు? ఇవా సెంటర్‌లో అసలు ఏం జరుగుతోంది? దీనిని యశోద ఎలా ఛేదించింది? ఎందుకు ఆమె ప్రాణాలను సైతం పణంగా పెట్టి.. ఈ పనికి పూనుకుంది? అనేది మిగతా కథ.

ఇవాళ సరోగసి ద్వారా పిల్లలను కనడం అనేది చాలా దేశాలలో జరుగుతున్నదే. తీసుకుంటున్న ఆహారంతో పాటు వాతావరణంలోనూ కాలుష్యం కారణంగా ఫెర్టిలిటీ ఛాన్సెస్ తగ్గిపోతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో డబ్బు ఉన్నవాళ్లే కాదు లేనివాళ్లు కూడా సరోగసి ద్వారా పిల్లలను పొందడం అనేది సాధారణ విషయంగా మారిపోయింది. అదే సమయంలో అద్దె గర్భం ఇవ్వడానికి మరికొందరు మహిళలు ముందుకొస్తున్నారు. ఈ అంశాల మీద వివిధ భాషల్లో చాలానే సినిమాలు వచ్చాయి. అయితే సరోగసీని బేస్ చేసుకుని, మరో లెవెల్‌లో ఎలాంటి మోసాలు జరుగుతున్నాయి? యవ్వనాన్ని కాపాడుకోవడానికి కొందరు ఏ స్థాయిలో రిస్కు తీసుకోవడానికి సిద్ధపడుతున్నారు? వారి బలహీనతలను అడ్డుపెట్టుకుని కాస్మొటిక్ మాఫియా ఎలాంటి దురాగతాలకు పాల్పడుతోందనేది ఇందులో చూపించారు.

నటీనటుల విషయానికి వస్తే సమంత తన నటనతో ఆకట్టుకుంది. గతంలో ఆమె కొన్ని లేడీ ఓరియంటెడ్ మూవీస్ చేసినా ఇందులోని నటన మరోస్థాయిలో ఉంది. కొన్ని చోట్ల కరుణ రసాన్ని, మరికొన్ని చోట్ల వీర రసాన్ని చక్కగా పలికించింది. అలానే ఇతర ప్రధాన పాత్రలు పోషించిన వరలక్ష్మీ శరత్ కుమార్, ఉన్ని ముకుందన్, రావు రమేశ్, సంపత్ రాజ్, శత్రు, మురళీశర్మ, కల్పికా గణేశ్, దివ్య స్పందన, ప్రియాంక శర్మ తదితరులు పాత్రోచితంగా నటించారు. ఇప్పటికే కొన్ని సినిమాలకు మాటలు రాసిన పులగం చిన్నారాయణ, కొన్ని సినిమాలకు పాటలు రాసిన చల్లా భాగ్యలక్ష్మీ ఈ సినిమాకు కలిసి సంభాషణలు సమకూర్చారు. 'రాజు అవ్వాలంటే రాజ్యం గెలవాలి, రాణి అవ్వాలంటే రాజుని గెలిస్తే చాలు' వంటి సంభాషణలు ఆకట్టుకుంటాయి. పాత్రలు, వాటికి పెట్టిన పేర్లు కూడా అర్థవంతంగా ఉన్నాయి. అందుకు దర్శకులు హరి, హరీశ్‌లను అభినందించాలి. మణిశర్మ సమకూర్చిన నేపథ్య సంగీతం బాగుంది. అయితే వీఎఫ్ఎక్స్ వర్క్ మాత్రం ఉండాల్సిన స్థాయిలో లేదు.

ఇందులోని కొన్ని సన్నివేశాలు చూస్తుంటే ఇలా కూడా జరుగుతుందా అనే సందేహం కలగడం సహజం. అయితే చివరలో ప్లే చేసిన న్యూస్ క్లిప్పింగ్స్ చూసిన తర్వాత ఇలాంటి దారుణాలకు ఆస్కారం ఉందనే నమ్మకం కలుగుతుంది. చిత్ర నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్‌కు ఉన్న అనుభవం 'యశోద' సినిమా బాగా రావడానికి ఉపయోగపడింది. మొదటి పాన్ ఇండియా మూవీ విషయంలో సమంత... ప్రచారంలో పాల్గొనకపోయినా పాస్ మార్కులు పొందేసింది. కాబట్టి దీని వెనుక రాబోతున్న 'శాకుంతలం, ఖుషీ' నిర్మాతలకు ఈ విజయం బోలెడంత ఊరటను ఇస్తుందనడంలో సందేహం లేదు. థ్రిల్లర్ మూవీస్‌ను ఇష్టపడే వారికి, కొత్తదనం కోరుకునే వారికి 'యశోద' నచ్చుతుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# నెల్లూరులో సింహపురి సమితి ఆధ్వర్యంలో దీపోత్సవం

**నెల్లూరు:** నెల్లూరులోని స్వర్ణాల చెరువు, వినాయక్ ఘాట్‌లో కార్తిక పౌర్ణమి సందర్భంగా సింహపురి కార్తిక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో మహా కార్తిక దీపోత్సవం నవంబర్ 7 రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది.

యాభైవేలకు పైగా కుటుంబాలతో సహా పాల్గొన్న ఈ కార్యక్రమంలో పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామీజీ, ప్రముఖ ప్రవచనకర్త శ్రీ గరికపాటి నరసింహారావు భక్తులకు మార్గదర్శనం చేశారు.



ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పుర ప్రముఖులు పాల్గొన్నారు. ★

# సోంపేటలో మహేంద్ర సంగమం




**సోంపేట:** నవంబర్ 13న సోంపేట ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో సోంపేట, కంచిలి మండలాల స్వయంసేవకులకు సాంఘిక్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా సహ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ వ్యాపారవేత్త డా॥ ఎస్. రాజేంద్రప్రసాద్, జిల్లా సంఘచాలక్ బరాటం నాగభూషణ రావు, విభాగ కార్యవహ పి.వి. రమణమూర్తి, రమణ పాల్గొన్నారు.

సోంపేట, కంచిలి మండలాల్లో ఉన్న 55 పంచాయతీల నుండి 450 మంది స్వయంసేవకులు గణవేష్‌లో పాల్గొన్నారు. కార్యకర్తలు, హిందూ బంధువులు 725 మంది హాజరయ్యారు. ★

# నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలలో భాగంగా డివిజన్ వారీగా జరిగిన యువ సమ్మేళనాలు





**ఆదిలాబాద్:** కెసిబి గార్డెన్‌లో నవంబర్ 12న జరిగిన యువ సమ్మేళనంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్–తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్, బలవత్రి గణేష్, రాజులవార్ దిగంబర్, ఉత్సవ సమితి సభ్యులు ప్రతాప్‌రెడ్డి (అడ్వకేట్). ఇందులో 1881 మంది యువతీయువకులు పాల్గొన్నారు. ★





**నల్లగొండ:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నవంబర్ 10న మిర్యాలగూడ డివిజన్ యువ సమ్మేళనం జరిగింది. వక్తగా తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత సంయోజక్ అప్పాల ప్రసాద్, ఇతిహాస సంకలన సమితి భాగ్యనగర్ ఇన్‌ఛార్జ్ ఇందుశేఖర్ పాల్గొన్నారు. ఇందులో 1200 మంది యువతీ యువకులతో పాటు ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు. ★



**సికింద్రాబాద్ :** బోయిన్‌పల్లి భాగ్ ఐడిపిఎల్‌లో నవంబర్ 10న నిర్వహించిన యువ సమ్మేళనంలో ముఖ్య వక్తగా ప్రముఖ సాహితీవేత్త డా॥ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు సురేఖరెడ్డి, ఉత్సవ సమితి అధ్యక్షులు విద్యాసాగర్ రావు, ప్రధాన కార్యదర్శి అనిల్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 1600 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. ★



తెలుసుకుందాం

# తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయం



తెలంగాణలోని ఖమ్మంలో ఈ ఆలయం ఉంది. అత్రి మహర్షి పేరు మీదుగా ఏర్పడిన ఆకేరు, భృగు మహర్షి పేరు మీదుగా బుగ్గేరు, మౌద్గల్య మహర్షి పేరు మీదుగా ఏర్పడిన మున్నేరు అనే మూడు నదులు కలిసే (కూడలి) చోట ఈ దేవాలయం కొలువు దీరింది. ఒకనాడు అత్రి, భృగు, మౌద్గల్య మహర్షులు శివునితో కలిసి వెంకటేశ్వర స్వామి కల్యాణానికి వెళ్లి వస్తూ మార్గమధ్యలో ఈ ప్రాంతంలో కొంతసేపు విశ్రాంతి తీసుకున్నారని స్థల పురాణం చెబుతోంది. మహాశివరాత్రి రోజుల్లో ఇక్కడ పెద్దఎత్తున జాతర జరుగుతుంది.

కథ

# ఉచిత సలహాలు వద్దు!

ఒక ఊళ్లో దానయ్య, వీరయ్య అనే ఇద్దరు రైతులు ఉండేవారు.

దానయ్య ప్రతి విషయంలోనూ వీరయ్యను సరిచేస్తూ ఉండేవాడు.

మొదట్లో వీరయ్య సంతోషించేవాడు. పొరపాటు సరిదిద్దుకుని, దానయ్యకు ధన్యవాదాలు తెలిపేవాడు. దాంతో దానయ్యకు తాను వీరయ్య కన్నా తెలివైనవాడిననీ, తన సలహా లేనిదే అతను ఏ పనీ చెయ్యలేడనీ నమ్మకం ఏర్పడింది. రాను రానూ వీరయ్యకు దానయ్యతో స్నేహంగా ఉండడం కష్టమనిపించసాగింది. ఏం చెయ్యాలో పాలుపోక గ్రామ పెద్దను సలహా అడిగాడు. ఊళ్లోని వారంత ఆయన ఏం చెప్పినా ఎదురు చెప్పకుండా చేసేవారు.

గ్రామ పెద్ద మర్నాడు దానయ్యను రమ్మని కబురు పంపాడు. కుశల ప్రశ్నలు అడిగిన తర్వాత, 'వీరయ్య పొలంలో కలుపు సమస్య ఉందని తెలిసింది. ఈరోజు నుంచీ నువ్వు క్రమం తప్పకుండా అతని పొలంలో కలుపు తియ్యాలి!' అని ఆజ్ఞాపించాడు.

తన నైపుణ్యాన్ని గ్రామాధికారి కూడా గమనించాడని సంబరపడ్డాడు దానయ్య.

కొన్నిరోజులు ఉత్సాహంగా వీరయ్య పొలంలో పనిచేశాడు. కానీ క్రమంగా అతనికి ఈ పని విసుగనిపించసాగింది. పైగా తన స్వంత పొలంలో కలుపు తీసేపని అటకెక్కింది. వెళ్లి గ్రామాధికారితో మొర పెట్టుకున్నాడు.

అప్పుడు గ్రామాధికారి, 'మరి వీరయ్య పొలంలో కలుపు తియ్యపోతే అతనికి నష్టం కదా?' అని



## పద్యము

**కూరిమిగల దినములలో**
**నేరములెన్నడును గలుగనేరవు మరి యా**
**కూరిమి విరసంబైనను**
**నేరములే తోచుచుండ నిక్కము సుమతీ!**

**భావం :** ఓ సుమతీ! స్నేహము బాగుగా ఉన్న రోజులలో ఆ స్నేహితులకు ఒకరు చేసిన పనులలో మరొకరికి తప్పులు కనిపించవు. అదే స్నేహితులకు విరోధము వచ్చినపుడు ఒకరి చేష్టలు మరొకరికి దోషములుగా కనిపించును అని భావం.

## సూక్తిరత్నం

**'బుద్ధిః కర్మానుసారిణీ'**

**'సత్యానుసారిణీ లక్ష్మీః కీర్తిః త్యాగానుసారిణీ**
**అభ్యాసానుసరీ విద్యా బుద్ధిః కర్మానుసారిణీ'**

**భావం :** సత్యవ్రతం అనుసరించడం వల్ల సంపదలు కలుగుతాయి. త్యాగాన్ని బట్టి కీర్తి , అభ్యాసం వల్ల విద్య లభిస్తాయి. కర్మలను బట్టి బుద్ధి ప్రవర్తిస్తుంటుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| బలహీనుడు | ఆలస్యం |
| తొందర | గర్వం |
| వినయం | తరుగు |
| పెరుగు | నిరాశ |
| ఆశ | బలవంతుడు |

జవాబులు : బలహీనుడు-బలవంతుడు; తొందర-ఆలస్యం; వినయం-గర్వం; పెరుగు-తరుగు; ఆశ-నిరాశ.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

## కన్నెగంటి హనుమంతు (1870-1922)



బ్రిటిష్ సామ్రాజ్యంపై పిడికిలి బిగించిన తొలితరం విప్లవ సేనాని కన్నెగంటి హనుమంతు. ఈయన గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతం దుర్గి మండలం, కోలగట్లలో జన్మించారు. పుల్లరి కట్టేందుకు నిరాకరించి, పల్నాడు ప్రజలు కన్నెగంటి హనుమంతు నాయకత్వాన బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించారు. అదే పుల్లరి సత్యాగ్రహంగా ప్రసిద్ధి చెందింది. బ్రిటిష్‌వారు అప్పటి గుంటూరు జిల్లా కలెక్టరు రూథర్‌ఫర్డు నాయకత్వంలో ఆ సత్యాగ్రహాన్ని క్రూరంగా అణచివేసారు. చివరికి కన్నెగంటి వీరమరణంతో ఆ సత్యాగ్రహం ముగిసింది.

## జనరల్ నాలెడ్జ్

1. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత గవర్నర్ ఎవరు?
2. భారత రాజ్యాంగ దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
3. చర్మ సంబంధిత వ్యాధుల గురించి చేసే అధ్యయనాన్ని ఏమంటారు?

జవాబులు : 1. బిశ్వభూషణ్ హరిచందన్; 2. నవంబర్ 26; 3. డెర్మటాలజీ.



అడిగాడు. 'అయ్యా అతని పొలం బాధ్యత అతనిది కదా? అతని పొలంలో కలుపు తీస్తుంటే నా పొలంలో కలుపు పెరిగిపోతుంది!' అన్నాడు దానయ్య.

అప్పుడు గ్రామాధికారి, 'దానయ్య, నువ్వు అనుక్షణం వీరయ్యను కనిపెట్టుకుని ఉంటావనీ, అతని పొరపాట్లన్నీ సరిదిద్దుతావనీ విన్నాను. అందుకే అతని పొలం బాధ్యత నీకు అప్పగించాను.' అన్నాడు.

దానయ్య తాను చేసిన తప్పు తెలుసుకున్నాడు.

'ఇప్పుడు అర్థమైందా? ఎవరి పొలంలో కలుపు వారే తీసుకోవాలి. ఎవరి తప్పులు వారే సరిదిద్దుకోవాలి. ఏమంటావు?' అని ప్రశ్నించాడు గ్రామ పెద్ద.

అప్పట్నుంచీ వీరయ్యకు అతిగా సలహాలు ఇవ్వడం మానుకున్నాడు దానయ్య. ★

## మెదడుకు మేత

ఆకాశంలో
ఎగురుతాను. గాలిని
భోంచేస్తాను. తోక ఉన్నది.
కానీ కోతిని కాదు. నేనెవరిని?

జవాబు : గాలిపటం

## మంచిమాట

విజేత వెనక ఉండేది
అదృష్టమో,
మంత్రదండమో కాదు..
కఠినశ్రమ,
అంకితభావం.




# వారఫలాలు

21-27 నవంబర్ 2022



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

సమస్యల నుంచి బయటపడతారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. ఆస్తి విషయాల్లో చికాకులు తొలగుతాయి. గృహ నిర్మాణ యత్నాలు కలసివస్తాయి. వివాహ, ఉద్యోగ యత్నాలు కలసివస్తాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. వ్యాపారులకు సానుకూలం. లాభాలు దక్కుతాయి. 26.27 తేదీల్లో వృథా ఖర్చులు. మనశ్శాంతి లోపిస్తుంది. ఆదిత్య హృదయం పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

నేర్పుగా వివాదాల నుంచి బయటపడతారు. కోర్టు వ్యవహారాలు అనుకూలంగా మారతాయి. స్థిరాస్తిపై అగ్రిమెంట్లు చేసుకుంటారు. వ్యాపారులకు లాభాలు తథ్యం. ఉద్యోగులకు విధుల్లో ప్రోత్సాహకరం. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు సత్కారాలు. పరిశోధకులు, సాంకేతిక నిపుణులకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. 21, 22 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు. హనుమాన్ చాలీసా పఠించండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

కొన్ని ఈతి బాధలు ఎదురైనా ఉపశమనం లభిస్తుంది. ఆస్తి వివాదాలు పరిష్కార దశకు చేరతాయి. ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి. విద్యార్థులకు నూతన విద్యావకాశాలు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు పదోన్నతులతో కూడిన బదిలీలు. నిరుద్యోగులకు శుభవర్తమానాలు. కళాకారులకు అవార్డులు. 22, 23 తేదీల్లో అనుకోని ఖర్చులు. మానసిక ఆందోళన. విష్ణుసహస్రనామ పారాయణం చేయండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి. సమస్యలు పరిష్కరించుకుంటారు. వాహనాలు, గృహం కొనుగోలు యత్నాలు కలసివస్తాయి. విద్యార్థులకు పరిస్థితులు అనుకూలం. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు విధుల్లో ఒడిదుడుకుల నుంచి బయటపడతారు. కళాకారులకు అవార్డులు. 24, 25 తేదీల్లో అనుకోని ఖర్చులు. అనారోగ్యం. కుటుంబ సభ్యులతో తగాదాలు. దత్తాత్రేయ స్తోత్రం పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

రాబడికి మించిన ఖర్చులు. భూవివాదాలు నెలకొన్నా సర్దుబాటుకు యత్నిస్తారు. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో విజయం. వ్యాపారులకు పెట్టుబడుల్లో జాప్యం. ఉద్యోగస్తులకు అదనపు పని భారం. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు కొద్దిపాటి చిక్కులు. సాంకేతిక నిపుణులు తటస్థ వైఖరితో ముందుకు సాగాలి. 23, 24 తేదీల్లో విందువినోదాలు. భూలాభాలు. గణేశ్‌ను పూజించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

కొంత పట్టువిడుపు ధోరణి అవలంబించడం మంచిది. గృహం, వాహనాల కొనుగోలు యత్నాలు అనుకూలిస్తాయి. విద్యార్థుల శ్రమ ఫలిస్తుంది. వ్యాపారులకు సామాన్యమైన లాభాలు. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవరోధాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తల అంచనాలు నిజమవుతాయి. 25, 26 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. మానసిక అశాంతి. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

విద్యార్థులు, నిరుద్యోగుల కృషి ఫలించి సంతోషంగా గడుపుతారు. విచిత్ర సంఘటనలు ఎదురవుతాయి. వ్యాపారులకు అదృష్టం వరిస్తుంది, అనుకున్న లాభాలు దక్కుతాయి. ఉద్యోగస్తులకు విధి నిర్వహణలో ప్రతిబంధకాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు అవకాశాలు. పరిశోధకులకు గుర్తింపు. 21, 22 తేదీల్లో వృథా ఖర్చులు. మనశ్శాంతి లోపిస్తుంది. వేంకటేశ్వర స్తుతి మంచిది.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయం మరింత దక్కుతుంది. కొన్నేళ్ల క్రితం దూరమైన బంధువులు తిరిగి దగ్గరకు చేరతారు. విద్యార్థులు, నిరుద్యోగులు సత్తా నిరూపించుకునేందుకు తగిన సమయమే. షేర్ల మార్కెటింగ్‌లో అభివృద్ధి కనిపిస్తుంది. గృహ నిర్మాణాలు ప్రారంభిస్తారు. వ్యాపారులు నైపుణ్యతతో లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగస్తులకు మరింత గుర్తింపు లభిస్తుంది. హయగ్రీవ స్తోత్రం పఠించండి.

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఆస్తుల వ్యవహారంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు. ఆశించిన రాబడి దక్కుతుంది. వాహనయోగం. ఉద్యోగులు నూతన హోదాలు దక్కించుకుంటారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు అప్రయత్నంగా అవకాశాలు. సాంకేతిక నిపుణులు నైపుణ్యతను నిరూపించుకుంటారు. 24, 25 తేదీల్లో బంధు విరోధాలు. శారీరక రుగ్మతలు. విలువైన సామగ్రి జాగ్రత్త. శివాష్టకం పఠించండి.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

జీవితాశయ సాధన దిశగా ముందుకు సాగి విజయాల పరంపర సాగిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరతాయి. రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. విలువైన డాక్యుమెంట్లు జాగ్రత్త. ఇంటి నిర్మాణాలు చేపడతారు. వాహనాలు కొనుగోలు చేసుకుంటారు. వ్యాపారాలలో భాగస్వాములు పెరుగుతారు. 22, 23 తేదీల్లో ఖర్చులు అధికం. గణపతి ఆరాధన చేయండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

కార్యజయంతో ఉత్సాహంగా సాగుతారు. విద్యార్థులకు అనూహ్య ఫలితాలు. ఆస్తి వ్యవహా రాలలో చికాకులు తొలగుతాయి. దేవాలయాలు సందర్శిస్తారు. సొమ్ము సకాలంలో అందుతుంది. సమస్యల నుంచి బయటపడతారు. కొన్ని రుగ్మతల నుంచి ఉపశమనం. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎదురుండదు. 22, 23 తేదీల్లో మానసిక ఆందోళన. సూర్యభగవానుని పూజించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఉరకలెత్తే ఉత్సాహం, సంతోషకరమైన సమాచారాలతో మరింత ముందుకు సాగుతారు. కొన్ని ఆహ్వానాలు పాతజ్ఞాపకాలను గుర్తు చేస్తాయి. స్థిరాస్తి విషయంలో అగ్రిమెంట్లు. వాహనాలు, స్థలాలు కొంటారు. కోర్టు వ్యవహారాలలో ఒత్తిడులు తొలగుతాయి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు విధి నిర్వహణలో సమర్థతను చాటుకుంటారు. 23,24 తేదీల్లో అనుకోని ఖర్చులు. దూరప్రయాణాలు. అన్నపూర్ణాష్టకం పఠించండి. ★

# పదరసం-391

## ఆధారాలు

**అడ్డం**

1. మునుపటి రాతి మిక్సీ (4)
3. దేశానికయినా, రాష్ట్రానికయినా ముఖ్య పట్టణం (4)
6. ఇది ఉంటే మనుషులు ఋషులవుతారట (2)
8. ఈ మొన మోపినంత భూమినయినా పాండవులకు ఇవ్వనన్నాడు దుర్యోధనుడు (2)
9. మంగళము, శ్రీ (2)
11. సైన్యము (2)
12. పుట్టినరోజు (4)
13. చెట్టు (2)
14. అటుగా అసహ్యతను వ్యక్త పరిచేపదం (2)
16. పట్టణం, ఇతగాడు (2)
19. సింహాలు ఉండేవి, సింహాలకు ఉండేది (2)
21. దేవాలయము (2)
22. భూమి, వెల (2)
24. వర్ణము (2)
25. ఉన్మాదము (2)
26. నాగలి (3)
27. చేతి బట్ట ముక్కు తుడుచుకునేది (3)
29. పార్వతి నృత్యము (2)
31. అటుగా నేల విస్తారమైనది (3)
32. సంతోషం (5)

**నిలువు :**

1. తెల్లజాతికి నల్లజాతి ప్రధాని (5)
2. వైద్యం అవసరమైనవాడు (2)
4. జన్మదినమే కీర్తిశేషులది (3)
5. రాత్రి విశ్రాంతి (2)
7. సూర్యోదయం ఎటువైపు? (4)
10. శివుడు (3)
15. జ్ఞాపకము (2)
16. అవకాశము (2)
17. కర్ణాటక ముఖ్య పట్టణం (4)
18. అమృతం (2)
20. ఏది కావాలన్నా అంతర్జాలంలో దీనిలోనే వెతకడం (3)
23. గుట్టు (4)
25. ఆమతి, ఆహ్వానం (3)
28. దండ (2)
30. ఆలోచన, యోచన (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | ✠ | 3 | 4 | | 5 |
| 6 | | ✠ | | ✠ | 7 | ✠ | | ✠ | |
| ✠ | 8 | | ✠ | ✠ | | ✠ | 9 | 10 | ✠ |
| 11 | | ✠ | 12 | | | | ✠ | 13 | |
| ✠ | 14 | 15 | ✠ | ✠ | | ✠ | 16 | | ✠ |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | ✠ | 20 |
| 21 | | ✠ | ✠ | 22 | 23 | ✠ | ✠ | 24 | |
| | ✠ | 25 | | ✠ | 26 | | | ✠ | |
| 27 | 28 | | ✠ | 29 | | ✠ | ✠ | 30 | ✠ |
| ✠ | 31 | | | ✠ | 32 | | | | |

**పదరసం – 391**

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..............................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2022 డిసెంబర్ 05 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 387 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 ఉ | త్త | 2 రా | లు | ✠ | 3 పా | 4 రా | వ | 5 తం |
| 6 మ | ట్టి | ✠ | త్రి | ✠ | 7 ప | ✠ | యం | ✠ | డు |
| ✠ | 8 కె | మ్యో | ఖి | ✠ | రు | ✠ | 9 చ | 10 ప | ల |
| 11 బొం | గు | ✠ | 12 గ | వే | ష | ణ | ✠ | 13 జా | ము |
| ✠ | 14 ర | 15 ధు | మ | ✠ | ము | ✠ | 16 న | వ | ✠ |
| 17 ర | ✠ | మ | ✠ | 18 పం | ✠ | 19 అ | మ్ము | ✠ | 20 అ |
| 21 ణ | లీ | ధు | ✠ | 22 ద | 23 శ | ✠ | ✠ | 24 మొ | క్క |
| సీ | ✠ | 25 మ | తి | ✠ | 26 నా | క | ము | ✠ | య్యు |
| 27 మ | 28 సా | లా | ✠ | 29 తో | క | ✠ | ✠ | 30 పా | ✠ |
| ✠ | 31 ము | డు | కు | ✠ | 32 శో | భా | నా | యు | డు |

**విజేతలు:** టి.వి.నారాయణ, బి.ఇందుశేఖర్, టి.తులశమ్మ, ఎం.విజయలక్ష్మి, వి.రాఘవేంద్ర రావు–హైదరాబాద్, వి.రామలింగాచారి–యాదగిరిగుట్ట, సి.హెచ్.కల్పన–భువనగిరి, టి.ఝాన్సి–నెల్లూరు, ఎస్.పృధ్విసాయి–ఒంగోలు, పి.సీతామహాలక్ష్మి–చిత్తూరు, ఎస్.రాజు–కర్నూలు, ఎం.శ్రీహరిరావు–ఏలూరు, బి.సత్య నాగరాజు–విశాఖపట్నం, కె.అల్లీరాణి–తిరుపతి, కె.కాంతామణి–భువనేశ్వర్.

**విజేత: సి.హెచ్.కల్పన-భువనగిరి**


భారత రాజ్యాంగ దినోత్సవ
(నవంబర్ 26) శుభాకాంక్షలు
గనపురం చంద్రశేఖర్ రెడ్డి, అడ్వకేట్-9391118889


భారత రాజ్యాంగ
దినోత్సవ (నవంబర్ 26)
శుభాకాంక్షలు
గుర్రం శ్రీనివాస్ రెడ్డి
కో-ట్రెసరర్ రంగారెడ్డి (అర్బన్)

# VIRAT FOUNDATION

Flat No. 603, Everest Block, Aditya Enclave, Ameerpet, Hyderabad-500 038
Email : viratfoundationsnr@gmail.com, Ph: 040-40036219 Mobile : 9246845503



**Goal is "Param Vibhav"- Re-establishment of "Annapoorna" as a start up programme and "Apad Bhandav" for human kind at the time of short fall of food availability in the coming years of within the year 2050 about 120 crore people will be replaced from their places throughout the world as per world bank prediction/warning. Including demonstration of Vedic way of life and motivation to divine life for interested each individual towards divination as "Jagath Guru" to Hindustan/Bharath - through radical reform and creation of mighty peoples movement by confidence building and change of attitude of rural community to become empowered community - playing a main role in establishment and regular operational activities of "Polity Pyramid" of Bharath , which will be established by Pro people Political system - Towards "Dharma" Samsthapana in social order, Details are enclosed below. The guide and Philosopher is RSS, as role player of lord Sri Krishna- Hindusthan/Bharath Jodo Yatra continuing since 97 years un interruptedly and shall be reached the above mentioned goal within the period of "Azadika Amruthothsav" celebrations time of the year 2022 to the year 1947 fixed by the government of Hindusthan/Bharath .**

**A concise definition of Dharma in the social context stated in Bhagvath Geetha by lord sri krsihna - Dharma is the super system of social, political, economical, and spiritual systems – transparent , qualitative , integrated ,united and active -Governing all activities and actions of all individuals and institutions to nurture , protect and en-flourish all human beings and lead them to ultimate goal of godliness-in any degenerate society the government entrenches itself as supreme and all powerful. The responsibility and Accountability of creating a good society should be taken up by the present governments which have removed the previous governments. They created and conduct movements. And, Previously all the power was with government. Therefore, it is the responsibility and accountability of the governments by political policies to direct the creation of a good government through appropriate reforms, through decentralization of power ensuring participation of all sections of the people , and through giving some incentives in the early stages as a part of the re - establishment of Dharma/super system, rejuvenation of decentralized four systems which are interlinked and inter dependents in achieved and can be achieved only with holistic approach by whole hearted leadership for Re-Establishment of Bharath as "Annapoorna" through "Smart village/Rurban" programme - A part of "Polity- Pyramid" of Bharath. Details will be presented.**

**Realization/demonstration of ideology"Integral Humanism" in perspective of "Vasudaika** *Kutumbakam"-heart/culture of Hindusthan - Vedabhoomi - Realization of "Param Vaibhav"*

*Sadar Namaskarams* **-SURYANARAYANA REDDY -President Virat Foundation, Hyderabad (Reg No: 408/2021).**

*"Krunvantho - Vishwamaryam"*

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 05

